www.velthuru.com
RNI TEL TEL/ 2019 / 78609
రంగారెడ్డి
VELTHURU TELUGU DAILY
# వెలుతురు
తెలుగు దినపత్రిక
మంగళవారం 21 జనవరి 2025
సంపుటి :06 సంచిక : 233 , పేజీలు : 12 వెల:రూ.5/-
TELANGANA, ANDHRA PRADESH



### తన గెలుపుకై కృషిచేసిన నియోజకవర్గ ప్రజల సమస్యలపై పరిష్కరించడానికి ఎల్లప్పుడూ పోరాటం చేయడానికి సిద్ధం

- రాబోవు స్థానిక సంస్థ ఎన్నికల్లో బిజెపి గెలుపు ఖాయం
- ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్

మిగతా2లో..

## దావోస్ కు చేరిన సీఎం బృందం

- విమానాశ్రయం లో ఘన స్వాగతం
- ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి తో భేటీ



(రాపర్తి భాస్కర్ గౌడ్)
వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, జనవరి 20:
దావోస్ వరల్డ్ ఎకనమిక్ ఫోరం సదస్సులో పాల్గొనడానికి జ్యూరిచ్ చేరుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,మంత్రి దుద్దిళ్ల శ్రీధర్

మిగతా2లో..

# అర్హులకు రేషన్ కార్డులు అందేనా..?

- పదేండ్లు ఎదురు చూస్తున్న పేదలు
- ప్రజా పాలన, కుల గణన ద్వారా పెట్టుకున్న దరఖాస్తులు
- వెరిఫికేషన్లో కొందరి పేర్లు రావడం ఆందోళనకరం
- గ్రామ సభల ద్వారా దరఖాస్తులు కోరడం విడ్డూరం
- మరోసారి ప్రభుత్వ మోసపూరిత ప్రకటనతో మండిపాటు
- కులగణనతో రేషన్ కార్డు కు ముడి పెట్టడమేమిటని ప్రశ్న
- తీవ్ర ఆందోళనలో నిరుపేదలు వచ్చిన లిస్టో గందరగోళం
- అధికారుల వైఫల్యమేనని విమర్శలు
- అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఇవ్వాలని పలువురి డిమాండ్

చింతపల్లి వెలుతురు జనవరి 20
పదేండ్లుగా పేద, మధ్యతరగతి కుటుంబాల ప్రజలు కొత్త రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్నారు. ఒకే కుటుంబంలో ముగ్గురు, నలుగురు అన్నదమ్ములు ఉండి పెళ్లయిన అనంతరం కొత్త రేషన్ కార్డు రాక ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు పొందక అనేక అవస్థలు ఎదుర్కొంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, గ్యాస్ సబ్సిడీ, కరెంటు జీరో బిల్లు, ఇతర సబ్సిడీలు రేషన్ కార్డు లేక లబ్ది పొందలేకపోతున్నారు. మండల వ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామాల నుంచి అర్హత ఉన్న పేదలందరూ ప్రజా పాలన, కుల గణన సర్వే ద్వారా కొత్త రేషన్ కార్డుల కోసం



మిగతా2లో..




# రోడ్ సేఫ్టీ విషయం లో ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలి

- గవర్నర్ జీస్టీ దేవ్ వర్మ
- డీపీఎస్ స్కూల్ లో విద్యార్థులకు రోడ్ సేఫ్టీ అవగాహన
- కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం, పలువురు ప్రజా ప్రతినిధులు



(రాపర్తి భాస్కర్ గౌడ్)
వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, జనవరి20 :
రోడ్ సేఫ్టీ విషయంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని రాష్ట్ర గవర్నర్ జీ స్ట్ దేవ్ వర్మ అన్నారు,సింగిల్ లైన్, డబుల్ లైన్, హైవే రకరకాల రోడ్లు ఉంటాయని వాటిని ప్రజలు జాగ్రత్త పరిశీలించాలని సూచించారు స్పీడ్ థ్రిల్ గా ఉంటుంది.కానీ అది ప్రాణాల్ని తీస్తుంది.యువత దీన్ని పరిగణనలోకి తీసుకోవాలని గవర్నర్ సూచించారు,చిన్న చిన్న రూల్స్ పాటిస్తే.అద్భుత విజయాలు సాధించవచ్చునని ఆయన అభిప్రాయపడ్డారు, క్లాస్ రూమ్ లో అనేకవిషయాలుతెలుస్తాయి.డాక్టర్, ఇంజనీర్ కావచ్చు.పాఠశాల దశలోనే ట్రాఫిక్ రూల్స్ పై అవగాహన ముఖ్య మని గవర్నర్ వర్మ తెలిపారు, తెలంగాణ అవైర్ నెస్ పార్క్ లు ఏర్పాటు చేయడం బాగుంది.. ఆటలతో అనేక అంశాలపై అవగాహన కలుగుతుంది. పుట్ బాల్ తో సమాజంలో ఎలా

మిగతా2లో..

## తెలంగాణ రాష్ట్రం లో సమృద్ధి గా ఖనిజ నిక్షేపాలు

- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

- ఒడిశా రాష్ట్రం కోణార్క్ లో జరిగిన 3 వ జాతీయ ఖనిజ మంత్రుల సమావేశంలో పాల్గొన్న భట్టి విక్రమార్క



(రాపర్తి భాస్కర్ గౌడ్)
వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, జనవరి 20:
తెలంగాణ రాష్ట్రంలో ఖనిజనిక్షేపాలతో సమృద్ధి గా ఉన్నాయని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు,ఒడిస్సా రాష్ట్రం కోణార్క్ లో జరిగిన 3వ జాతీయ ఖనిజ మంత్రుల సమావేశంలో పాల్గొన్న భట్టి విక్రమార్క మాట్లాడారు, తెలంగాణ రాష్ట్రం ఖనిజనిక్షేపాలతో సమృద్ధిగా ఉందన్నారు, 2014లో 1,958

మిగతా2లో..

## రాయికోడ్ ఆలయ అభివృద్ధికి ప్రత్యేక కృషి

- రాష్ట్ర వైద్య ఆరోగ్య సైన్స్ టెక్నాలజీ శాఖ మాత్యులు దామోదర్ రాజనర్సింహ.
- అభివృద్ధి నిరంతర ప్రక్రియ. అభివృద్ధి చేపట్టాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులది.
- 6 గ్యారంటీల్లో భాగంగా జనవరి 26 నుండి నాలుగు ప్రతిష్టాత్మక పథకాల అమలు.
- స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తల గెలుపు కోసం కృషి.
- పది సంవత్సరాల్లో టిఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డు ఇచ్చిన పాపాన పోలేదు.
- అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తాం.
- రాయికోడ్ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారానికి హాజరైన మంత్రి.





రాయికోడ్ వెలుతురు జనవరి 20:
గత పది సంవత్సరాల కాలంలో బి ఆర్ ఎస్ ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డు ఇచ్చిన పాపాన పోలేదని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. సోమవారం రాయికోడ్ మండల కేంద్రంలో భద్రకాళి సమేత వీరభద్ర స్వామి ఆలయ కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో భద్రకాళి సమేత వీరభద్ర స్వామి ఆలయ నూతన ఆలయ కమిటీ చైర్మన్ కులకర్ణి ప్రభాకర్, వైస్ చైర్మన్ గోవ్వ భీమన్న, సభ్యులు గా, పి బసవంతరావు, ఉప్పరి విటల్ బేకర్ కృష్ణవేణి బి నర్సయ్య జొన్నాడ దత్త రెడ్డి లు మంత్రి సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో

మిగతా2లో..

## ఇందిరమ్మ ఇళ్ల కోసం మరో అవకాశం

- నేటి నుంచి గ్రామసభల్లో దరఖాస్తుల స్వీకరణ

హైదరాబాద్,జనవరి20 వెలుతురు:
కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు మరో అవకాశం




మిగతా2లో..

## కక్ష సాధింపు రాజకీయాలు సరికాదు

- కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి సంచలన వ్యాఖ్యలు

హైదరాబాద్,జనవరి20 వెలుతురు:
కక్ష సాధింపు రాజకీయాలకు తాను వ్యతిరేకం అని మాజీఎమ్మెల్యే

మిగతా2లో..

## కర్మభూమితో పాటు జన్మభూమికి పాటుపడండి

- ఐటి కోసం ఆనాడు పడ్డ కష్టానికి ఫలితం దక్కింది
- సత్య నాదెళ్ల లాంటి వారు మైక్రోస్టాఫ్ట్ సిఇవో కాగలిగారు
- కన్నవూరు కోసం పాటుపడేలా ముందుకు రండి
- మరో జన్మంటూ ఉంటే తెలుగువాడిగా పుడతా
- జ్యూరిచ్ పారిశ్రామికవేత్తల సదస్సులో చంద్రబాబు

జ్యూరిచ్,జనవరి20 వెలుతురు:
కర్మభూమిని, జన్మభూమిని మరవ వద్దని ఎపి సిఎం



మిగతా2లో..

(మొదటి పేజీ తరువాయి..)

## దావోస్ కు చేరిన సీఎం బృందం





బాబు, ఉన్నతాధికారుల ప్రతినిధి బృందం జ్యూరిచ్ విమానాశ్రయం చేరుకోగానే అక్కడ స్థిరపడిన తెలుగు వారితో సందడి నెలకొంది. ముఖ్యమంత్రి కి పెద్ద ఎత్తున హాజరై అభినందనలు తెలియజేశారు. జ్యూరిచ్ విమానాశ్రయంలో రేవంత్ రెడ్డి , ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరస్పరం మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా రెండు రాష్ట్రాల్లో జరుగుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన అంశాలపై వారి మధ్య క్లుప్తంగా చర్చ జరిగింది. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు , మంత్రి శ్రీధర్ బాబు , ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేశ్ కూడా ఉన్నారు. దావోస్ సదస్సు తొలి రోజున పలువురు పారిశ్రామికవేత్తలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశమవుతారు. అంతర్జాతీయ పెట్టుబడుల గమ్య స్థానంగా తెలంగాణను ప్రపంచానికి పరిచయం చేసే నిర్దిష్టమైన భవిష్యత్తు ప్రణాళికతో ఈ పర్యటనపై రాష్ట్ర ప్రతినిధి బృందం ప్రత్యేకంగా దృష్టి సారించింది.

## తన గెలుపుకై కృషిచేసిన నియోజకవర్గ ప్రజల సమస్యలపై పరిష్కరించడానికి ఎల్లప్పుడూ పోరాటం చేయడానికి సిద్ధం



**ఆదిలాబాద్ వెలుతురు జనవరి 20:**
గిమ్మ గ్రామానికి చెందినటువంటి కాంగ్రెస్ టిఆర్ఎస్ పార్టీలో చెందిన నాయకులు బిజెపిలో చేరారు. పార్టీలో చేరిన వారికి కండువా కప్పి ఘనంగా స్వాగతం పలికారు. జిల్లా పార్టీ తరఫున మనస్ఫూర్తిగా స్వాగతం పలికారు. గిమ్మ గ్రామస్తులు చాలా చైతన్యవంతమైన వంటి గ్రామం ఆ గ్రామం ఆలోచన చాలా గొప్పగా ఉంటుంది. ఎప్పుడు కూడా నాకు ప్రతిసారి మేమున్నాం మీకు అండగా అంటూ, ఎప్పుడూ ఆధారపడొద్దని నాకు మనోధైర్యం ఇచ్చినటువంటి గ్రామం. మనస్ఫూర్తిగా రేపు రాబోయే రోజుల్లో కూడా భారతీయ జనతా పార్టీ మరింత పార్టీ బలుపేతం చేసే నేను చేస్తున్నటువంటి పోరాటాన్ని గ్రామస్తులు సంపూర్ణ మద్దతు ఉంటుందని భరోసా ఇవ్వడం సంతోషకరమన్నారు. జైనథ్, బోరజ్ మండలం స్థానిక ఎన్నికలలో గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఆదిలాబాద్ నియోజకవర్గ సమస్యలు ఎక్కడ అవకాశం వచ్చిన ఆ సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. అనేక సంవత్సరాలుగా పెండింగ్ ఉన్న సమస్యలు పరిష్కారం కావాలన్నారు. ఇల్లు లేని వారికి ఇల్లు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గ్రామాలు ఉన్నటువంటి సమస్యలు పరిష్కారం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. స్థానిక సంస్థ ఎన్నికలలో ఈ రకంగా నైతే శాసనసభల్లో నిండు మనసుతో గెలిపించారు అదే విధంగా స్థానిక సంస్థలలో బిజెపి పార్టీ అభ్యర్థులను గెలిపించాలని సూచించారు. పార్టీలో చేరిన వారందరినీ కుటుంబ సభ్యులుగా భావిస్తున్నామన్నారు. కొత్త పార్టీ తేడా లేకుండా పార్టీలో సముచిత స్థానం కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కరుణాకర్ రెడ్డి రాందాస్ అశోక్ రెడ్డి మోహన్ విజయ్ సన్నీ అడెల్లు ముకుంద తదితరులున్నారు పార్టీలో చేరిన వారిలో శివన్న సంజు రాజశేఖర్ సంతోష్ సాయి జనార్ధన్ మురళి తదితరులున్నారు

## ఇందిరమ్మ ఇళ్ల కోసం మరో అవకాశం

ఇవ్వాలని నిర్ణయించింది రాష్ట్ర ప్రభుత్వం. జనవరి 21 నుంచి జరిగే గ్రామ సభల్లో వీటి కోసం అప్లికేషన్లు స్వీకరించాలని కలెక్టర్లను ఆదేశించారు సీఎస్ శాంతి కుమారి. దీనికి సంబంధించి గైడ్స్ లైన్స్ తో సర్క్యులర్ పంపించారు. గ్రామ సభల్లో కొత్త రేషన్ కార్డులతో పాటు ఇప్పటికే ఉన్న కార్డుల్లో పేర్లు చేర్చడానికి దరఖాస్తులు స్వీకరించాలి. ఒకే కుటుంబం నుంచి వేరే పడ్తున్న కుటుంబాలకు కొత్త కార్డులు ఇచ్చేందుకు అప్లికేషన్లు తీసుకోవాలి. కుటుంబ పెద్దతో పాటు ఇతర కుటుంబ సభ్యుల వివరాలు, వారి ఆధార్ కార్డులు, కులం, మొబైల్ నంబర్, చిరునామా వంటి వివరాలను తీసుకోవాలని గైడ్ లైన్స్ లో స్పష్టం చేశారు.

## కక్ష సాధింపు రాజకీయాలు సరికాదు



జగ్గారెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ రాజకీయ పరిణామాలపై కాంగ్రెస్ సీనియర్ నేత జగ్గారెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. రివైంజ్ పాలిటిక్స్‌పై జగ్గారెడ్డి మీడియాతో చిట్‌చాట్ చేశారు. అయినా రివైంజ్ పాలిటిక్స్ ఏ పార్టీకి మంచిది కాదని సూచించారు. అలాంటి రాజకీయాలు చేసే వాళ్లు అధికారం పోయాక బాధ పడాల్సి వస్తుందని పేర్కొన్నారు. వైఎస్.రాజశేఖర్‌రెడ్డి, రోశయ్య.. రివైంజ్ పాలిటిక్స్ చేయలేదన్నారు. ఎవరైనా తనకు నష్టం చేసినా.. తానెవ్వరికీ నష్టం చేయను అని జగ్గారెడ్డి చెప్పుకొచ్చారు. కాకపోతే రాజకీయ యుద్ధం మాత్రం చేస్తామని పేర్కొన్నారు. ఏ రాజకీయ పార్టీ నాయకుడైనా? డబ్బులు తీసుకోకుండా రాజకీయం చేస్తున్నట్లుగా ఎవరైనా ఒప్పుకుంటారా..?, తనతో సహా పైసలు ముట్టుకోకుండా రాజకీయం చేయని నాయకుడెవరూ ఉండరని జగ్గారెడ్డి చెప్పుకొచ్చారు.

# అర్హులకు రేషన్ కార్డులు అందేనా..?

(మొదటి పేజీ తరువాయి..)
దరఖాస్తులు పెట్టుకున్నారు. అధికారులు ఈ డేటాను కంప్యూటరైజ్డ్ చేసి ప్రభుత్వానికి అందజేశారు. అయితే గత ప్రభుత్వంలో మీసేవల ద్వారా పెట్టుకున్నా దరఖాస్తులు, కుల గణన ద్వారా పెట్టుకున్న దరఖాస్తులను పరిశీలించిన ప్రభుత్వం నిజమైన లబ్దిదారులను గుర్తించకుండా రేషన్ కార్డుల లిస్టును ప్రకటించింది. ఈ రెండు లిస్టులో అర్హత ఉన్న నిరు పేదల పేర్లు లేకపోవడంతో వారు ఆందోళన చెందుతున్నారు. రేషన్ కార్డు లిస్టును పరిశీలించి పంపాలని అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. గ్రామాలలో నిరుపేదలు అధికారులపై మండి పడుతున్నారు. ప్రకటించిన రేషన్ కార్డు లిస్టులో అర్హత లేని వారు పేర్లు వచ్చాయని పలువురు విమర్శిస్తున్నారు. ప్రభుత్వం మాత్రం లిస్టులో పేరు లేనివారు గ్రామసభల ద్వారా మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని చెప్పడంలో పేద, మధ్యతరగతి కుటుంబాల ప్రజలు మండిపడుతున్నారు. చింతపల్లి మండలంలో అధికారులపై గ్రామాల వారిగా ప్రజల నుంచి పెద్ద ఎత్తున విమర్శలు గుప్పిస్తున్నారు. జరగబోయే గ్రామ సభలను అడ్డుకుని తీరుతామని ప్రజలంతా హెచ్చరిస్తున్నారు. కొన్ని గ్రామాలలో వచ్చిన రేషన్ కార్డు లిస్టులో ప్రభుత్వ ఉద్యోగుల పేర్లు, అధిక భూములు, ఆర్థికంగా ఎదిగిన వారి పేర్లు రావడంతో అధికారుల వైఫల్యమేనని స్థానిక ప్రజలు మండిపడుతున్నారు. గ్రామ సభలు సజావుగా సాగుతాయా లేక రేషన్ కార్డు రాక అసంతృప్తితో ఉన్న పేద ప్రజలు అడ్డుకుంటారా అనే సందేహం గ్రామాలలో బలంగా వినిపిస్తుంది. మొత్తం మీద వచ్చిన రేషన్ కార్డు లిస్టుతో మండల వ్యాప్తంగా గందరగోళ పరిస్థితి నెలకొంది.

# రోడ్ సేఫ్టీ విషయం లో ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలి

(మొదటి పేజీ తరువాయి..)
బతకాలో ఒకరికి ఒకరు ఎలా సహాయం చేసుకోవాలో తెలుస్తుంది. పొలిటీషియన్ ఒక బోరింగ్...మిలో ఉన్న క్రియేటివిటీ బయటకు తీయండి..అద్భుతమైన శాస్త్రవేత్తలు అవుతారు,జై జవాన్, జై కిసాన్, జై విజ్ఞాన్..విద్యార్థి దశ నేర్చుకునే దశ.ఈ దశలోనే సాంకేతిక, సామాజిక, ఆర్థిక అంశాలపై అవగాహన చేసుకోండి అని విద్యార్థులకు గవర్నర్ తెలిపారు, ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్రరవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి విద్యార్థి దశలోనే ట్రాఫిక్ రూల్స్ పై అవగాహన కల్పించేందుకు ట్రాఫిక్ అవేర్నెస్ పార్కులు అందుబాటులోకి తీసుకొచ్చాం,రోడ్డు ప్రమాదాల నివారణ విద్యార్థి దశ నుంచే అలవర్చుకోవాలి,గతంలో రోడ్డు భద్రత అవగాహన పై




వారోత్సవాలు ఉండేవి ఇప్పుడు వాటి స్థానంలో రోడ్ భద్రత మాసోత్సవాలు తీసుకొచ్చాం,రవాణా శాఖ లో కొత్తగా , స్క్రాప్ పాలసీ, ఈవీ పాలసీ తీసుకొచ్చాం విద్యార్థులు మీరు ట్రాఫిక్ రూల్స్ పాటించాలి, మీ తల్లదండ్రులు పాటించేలా అవగాహన కల్పించండి డిపీస్ స్కూల్ లో ట్రాఫిక్ అవేర్నెస్ పార్క్ ఏర్పాటు కు సహకరించిన స్కూల్ యాజమాన్యానికి దన్యవాదాలు,పొల్యూషన్ కంట్రోల్ చేయడానికి స్క్రాప్ పాలసీ తెచ్చాం,రోడ్ సేఫ్టీ పై విద్యార్థి దశ లో నే ట్రాఫిక్ అవగాహన కల్పించేందుకు పాఠ్య పుస్తకంలో ట్రాఫిక్ అవేర్నెస్ పై ఒక పాఠంగా చేర్చేందుకు ప్రణాళికలు చేస్తున్నామని మంత్రి ప్రభాకర్ తెలిపారు, ఈ కార్యక్రమంలో మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే లు, ఎమ్మెల్సీలు,అధికారులు తదితరులు పాల్గొన్నారు,

# తెలంగాణ రాష్ట్రం లో సమృద్ధి గా ఖనిజ నిక్షేపాలు

(మొదటి పేజీ తరువాయి..)
కోట్లు ఉన్న ఆదాయం 2023-24 నాటికి 5,440 కోట్లకు ఖనిజ ఆదాయం పెరిగిందని భట్టి విక్రమార్క చెప్పారు,32 పెద్ద లైమ్ స్టోన్, మాంగనీసు ఖనిజ బ్లాక్ ల వేలానికి కార్యాచరణ ప్రణాళికలు ఉన్నాయని తెలిపారు,ఖనిజాలు అనేవి మన రోజువారీ జీవితంలో ప్రధాన మరియు అవసరమైన ముడిసరుకులుగా ఉండి, ఆర్థిక, సామాజిక మరియు సాంకేతిక అభివృద్ధికి కీలకమైనవిగా నిలుస్తాయని భట్టి చెప్పారు, రాష్ట్రంలో మొత్తం 2,552 మైనింగ్ మరియు ఖనిజ గనుల లీజులు ఉన్నాయని తెలిపారు,తెలంగాణ రాష్ట్రంలో నదితీరంలోని మట్టి/మెట్ట ఖనిజాల కోసం ప్రత్యేకమైన విధానాన్ని రూపొందించడం జరిగిందని, తెలంగాణ రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ పర్యావరణ మరియు ఇతర నియమ నిబంధనలకు అనుగుణంగా అనుమతి తీసుకుని ఇసుకను తవ్వడం, ప్రజలకు పారదర్శకంగా మరియు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచడం ద్వారా తక్కువ ధరలకు విక్రయిస్తున్నామనీ భట్టి విక్రమార్క పేర్కొన్నారు,2024లో సూర్యాపేట జిల్లాలో 2 లైమ్‌స్టోన్ బ్లాక్‌లను వేలం వేసి విజయవంతమైన బిడ్డర్లకు పత్రాలను జారీ చేశామనీ భట్టి విక్రమార్క అన్నారు,చిన్న ఖనిజాల లీజుల మంజూరు విషయంలో, అవసరమైన అనుమతులతో కూడిన బ్లాక్‌ల వేలం విధానాన్ని రాష్ట్రం అమలు చేస్తోందని భట్టి విక్రమార్క తెలిపారు,రాష్ట్రంలో ఖనిజ వనరుల ఆడిట్ కోసం DGPS సర్వే మరియు ETS సర్వే పూర్తయ్యాయని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు, ఈ కార్యక్రమంలో దేశంలో ఉన్న అన్ని రాష్ట్రాల మంత్రుల సమావేశంలో పాల్గొన్నారు,

# రాయికోడ్ ఆలయ అభివృద్ధికి ప్రత్యేక కృషి

(మొదటి పేజీ తరువాయి..)
ఆయన మాట్లాడారు. 10 సంవత్సరాల కాలంలో గత ప్రభుత్వం ఒక రేషన్ కార్డు కూడా ఇవ్వలేదు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులందరికీ ప్రభుత్వ పథకాలందేళ చర్యలు చేపట్టిందన్నారు ఆరోగ్యంలో భాగంగా రైతు భరోసా సంవత్సరానికి ఎకరాకు 12 వేల రూపాయలు ఈ నెల 26 నుండి ప్రారంభించనున్నట్లు తెలిపారు. అర్హులందరికీ రేషన్ కార్డులు ఇవ్వడంతో పాటు ఉపాధి హామీ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇవ్వనున్నట్లు తెలిపారు ఇల్లు లేని నిరుపేదలకు మొదటి ప్రాధాన్యత ఇస్తూ రాజకీయాలకతీతంగా ఇందిర మైండ్లు మంజూరు చేయనున్నట్లు మంత్రి తెలిపారు అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తామన్నారు. రాయికోడ్ ఆలయ అభివృద్ధి కోసం గతంలో విశేష కృషి చేసినట్లు తెలిపారు ఆలయ అభివృద్ధి కోసం పాలకవర్గంతో కలిసి చిత్తశుద్ధితో పనిచేయున్నట్లు మంత్రి తెలిపారు. రాయికోడు, కప్పాడ్ చౌరస్తా రోడ్డు 20 రోజుల్లో పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు. రాయికోడ్ లో ప్రభుత్వ ఐటిఐ



ఏర్పాటుకు కృషి చేయునట్లు మంత్రి తెలిపారులోని రెసిడెన్షియల్ పాఠశాల మోడల్ పాఠశాలలో సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు . రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి కార్యకర్త గెలుపు కోసం కృషి చేయునట్లు మంత్రి తెలిపారు. తన కార్యకర్తలు సర్పంచ్లు, ఎంపీపీలుగా, జెడ్పిటిసిలుగా ఎదగ దానికి అవసరమైన సహాయ సహకారాలు అందించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని మంత్రి కార్యకర్తలకు సూచించారు. అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియని, ప్రాంత అభివృద్ధి కోసం ప్రజాప్రతినిధులు చిత్తశుద్ధితో పని చేస్తే ప్రాంతం అని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. ఆలయ అభివృద్ధితో పాటు రాయకోడ్ మండల అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేయునట్లు మంత్రి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య,మండల ప్రత్యేక అధికారి/ జిల్లా బీసీ సంక్షేమ అధికారి జగదీష్, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్, ఆలయ ఈవో శివ రుద్రయ్య, ప్రజా ప్రతినిధులు వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# కర్మభూమితో పాటు జన్మభూమికి పాటుపడండి

చంద్రబాబు ప్రవాసాంధ్రులను కోరారు. తెలుగుజాతి అభివృద్ధికి పాటుపడాలని అన్నారు. ఉన్నచోట ఉంటూనే అక్కడి దేశ అభివృద్ధితో పాటు, కన్నభూమి అభివృద్ధికి కూడా తోడ్పడాలని అన్నారు. ఏ దేశమైనా యువత వల్లే అభివృద్ధి చెందుతుందని చంద్రబాబు అన్నారు. అందుకే రాజకీయాల్లోకి వచ్చేలా యువతను ప్రోత్సహించి నట్లు చెప్పారు. రాష్ట్రానికి పెట్టుబడులు సాధించడమే లక్ష్యంగా ప్రపంచ ఆర్థిక సదస్సులో పాల్గొనేందుకు దావోస్ వెళ్లిన ఆయన జ్యూరిచ్‌లో అక్కడి పారిశ్రామికవేత్తలతో భేటీ అయ్యారు. యూరప్‌లోని 12 దేశాల నుంచి వ్యాపారవేత్తలు ఈ సమావేశానికి రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. తాను బిల్‌గేట్స్‌ను కలవడం ద్వారా హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ వచ్చిందని, సత్యనాదెళ్ల లాంటి వారు ఇప్పుడు సిఇవో అయ్యారని చంద్రబాబు అన్నారు. తాను ఐటి గురించి మాట్లాడితే అంతా ఆశ్చర్యంగా చూశారని, కాని ఇవాళ ప్రపంచవ్యాప్తంగా తెలుగువారు దూసుకు పోతున్నారని అన్నారు. ఎపిలో ఇప్పుడు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని అన్నారు. 2004లో అధికారం కొనసాగివుంటే పరిస్థితి మరోలా ఉండేదన్నారు. ఎపిలో గత ఐదేళ్లలో విధ్వంసం సాగిందన్నారు. తాను విజన్ 2047తో ముందుకు వెళుతున్నానని అన్నారు. ప్రధాని మోడీ దేశం కోసం వికసిత్ భారత్‌తో కృషి చేస్తున్నారని అన్నారు. ప్రపంచంలోని అన్ని దేశాల్లోనూ తెలుగువారుంటారని, అవకాశం ఉన్న ప్రతిచోటుకీ మనవాళ్లు వెళ్లిపోతారని చెప్పారు. 'అన్ని దేశాల్లో తెలుగువాళ్ల ఫుట్ ప్రింట్ ఉంటుంది. అదే మన గొప్పతనం. తెలుగువాళ్లు ఎక్కడైనా గొప్పగా పని చేస్తారు. రాణిస్తారు. పట్టుదల ఎక్కువ. నైపుణ్యాలు పెంచుకుంటారు. నేను జైల్లో చేసిన న్యాయ పోరాటానికి మద్దతుగా నిలిచారు. అప్పుడు ఇన్ని దేశాల్లో తెలుగువాళ్లు ఉన్నారా? అని ఆశ్చర్యపోయా. మరో జన్మ ఉంటే తెలుగువాడిగానే పుట్టించాలని దేవుడిని కోరుకుంటున్నా. యువతలో సరికొత్త ఆలోచనలు రావాలి. చైతన్యవంతులు కావాలి' 'ఆ రోజుల్లో ఐటీకి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చా. అనేకమంది యువత గ్రామాల నుంచి నగరాలకు వచ్చి ఇంజినీరింగ్ విద్యను అభ్యసించి, ఐటీ రంగంలోకి వచ్చారు. హైదరాబాద్‌లో భూములు అమ్ముకోవద్దని అనేకమందికి చెప్పా. ఇక్కడి భూములకు మంచి ధర వస్తుందని ఆనాడే చెప్పా. తెలంగాణలో అత్యధిక తలసరి ఆదాయానికి హైదరాబాద్ సంపదే కారణం. చదువులో ఆడపిల్లలపై వివక్ష చూపించొద్దని ఆనాడే చెప్పాను. ఇప్పుడు ఏ ఐటీ కంపెనీకి వెళ్లినా అమ్మాయిలు కనిపిస్తున్నారు. ప్రస్తుతం యువకుల కంటే యువతులకే ఎక్కువ ఆదాయం వస్తోంది. వాస్తవానికి పురుషుల కంటే మహిళలే తెలివైన వాళ్లు. పరిశోధనలు కూడా అదే చెబుతున్నాయి' అని చంద్రబాబు అన్నారు. ఈ క్రమంలో అంతా జన్మభూమి కోసం కష్టపడాలని, అభివృద్ధిలో అలసి పోవద్దని పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులు సాధించడమే లక్ష్యంగా ప్రపంచ ఆర్థిక సదస్సులో పాల్గొనేందుకు దావోస్ వెళ్లిన సీఎం చంద్రబాబు బృందం జ్యూరిచ్‌లో అక్కడి తెలుగు పారిశ్రామికవేత్తలతో భేటీ అయింది. సీఎం చంద్రబాబు ఏం చెబుతారోనని వచ్చిన వ్యాపారవేత్తలు, యూరప్ ఎన్నారై తెదేపా సభ్యులకు ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ కృతజ్ఞతలు తెలిపారు. పిలవగానే ఇంత మంది వస్తారని తాను ఊహించలేదన్నారు. ఇక్కడి తెలుగు పారిశ్రామికవేత్తలను చూస్తుంటే జ్యూరిచ్‌లో ఉన్నామా.. లేక జువ్వలపాలెంలో ఉన్నామా అర్థం కావడం లేదని హర్షం వ్యక్తం చేశారు. 'తెలుగు జాతి సత్తా ప్రపంచానికి తెలియజేసిన వ్యక్తి చంద్రబాబు. ఆయన.. చేతిలో ఫైళ్లు పట్టుకొని న్యూయార్క్ వీధుల్లో తిరిగారు. ఆనాడు ఆయన విజన్-2020 అంటే ఎంతో మంది ఎగతాళి చేశారు. కానీ, ఇవాళ హైదరాబాద్‌ను చూస్తే.. ఆయన ఆనాడు చెప్పిన ప్రతి మాట నిజమని నమ్మాల్సిందే. ఐటీ అభివృద్ధికి చంద్రబాబు ఎంతో కృషి చేశారు. చంద్రబాబు ఒక ఎనర్జీ. ఆయన వద్ద ఎన్నో గొప్ప ఆలోచన లుంటాయి. ఆయన జీవితం చూస్తే.. అనేక ఇబ్బందులు ఎదుర్కొని పైకి ఎదిగిన వ్యక్తిని అన్నారు. 'కేవలం రాజకీయాలే కాదు.. వ్యాపార రంగాల్లోనూ అనుభవం ఉన్న వ్యక్తి. ఆయన మూడు సంస్థలు పెట్టి విఫలమైనా.. ఏమాత్రం అధైర్యపడకుండా పట్టుదలతో నాలుగో సంస్థ హెరిటేజ్‌ను స్థాపించారు. అనుకున్నది సాధించారు. రాజకీయాల్లో ఎన్నో ఎత్తుపల్లాలుంటాయి. ఆయన్ను అరెస్టు చేసిన సమయం నా జీవితంలో అత్యంత కష్టమైన సమయం. కానీ, ఆయన మాత్రం భయపడలేదు. ఆ సమయంలోనూ ప్రజల గురించే ఆలోచించారు. ప్రపంచం, దేశం మొత్తం ఆయన వైపు చూసే విధంగా చంద్రబాబు ఎదిగారు. పారిశ్రామికవేత్తగా, రాజకీయనేతగా అహర్నిశలూ శ్రమించారని అన్నారు. అందరూ 'ఎన్ఆర్ఐ' అంటారు. కానీ, మీరంతా 'మోస్ట్ రిలయబుల్ ఇండియన్స్'. 2019-24 వరకూ రాష్ట్రం పరువుపోతోందని అంతా బాధపడ్డారు. కలిసికట్టుగా పోరాడితేనే దుష్టశక్తులను వెళ్లగొట్టొచ్చని సమష్టిగా పనిచేశాం. మానవ వనరుల మంత్రిగా తెలుగువాళ్ల నైపుణ్యం పెంచే ప్రయత్నాలు చేస్తున్నాం. 'ఓమ్ క్యాప్' అనే సంస్థ ద్వారా మిడిల్ ఈస్ట్‌కు వెళ్లే తెలుగువారి అభ్యున్నతికి కృషి చేస్తున్నాం. సీఎం చంద్రబాబుతో కలిసి పని చేయడం మామూలు విషయం కాదు. ఇప్పుడు రాష్ట్రం కష్టాల్లో ఉంది. ఏపీ పునర్నిర్మాణం కోసం అంతా కలిసి పనిచేయాలి. మీ సహకారం, తోడ్పాటు రాష్ట్రానికి అవసరం. రానున్న ఐదేళ్లలో ఏపీ అంటే ఏమిటో ప్రపంచానికి చూపించాలనుకుంటున్నాం' అని మంత్రి లోకేశ్ అన్నారు.

# తెలంగాణలో నిలిచిన ఆరోగ్యశ్రీ సేవలు- ఇబ్బందుల్లో రోగులు



(రాపర్తి భాస్కర్ గౌడ్)

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, జనవరి 20:**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య శ్రీ సేవల బకాయిలు విడుదల చేయకపోవడం తో వైద్య సేవలు నిల్చి పోయాయి, దీంతో రోగులు వైద్య సేవలు పొందలేక రాష్ట్రవ్యాప్తంగా రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు,ఆసుపత్రులకు ప్రభుత్వం ఆరోగ్యశ్రీ సేవల బకాయిలు విడుదల చేయకపోవడంతో ఆస్పత్రుల యజమాన్యం సేవలను నిలిపివేస్తున్నట్టు ప్రకటన చేయడం వలన పేద రోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు, ఆరోగ్యశ్రీ సేవలు నిలిచిపోవడంతో ఆసుపత్రుల వద్ద ఇబ్బందులు పడుతున్న సామాన్య ప్రజలు, రోగులు ఆందోళన చెందుతున్నారు, ప్రభుత్వం స్పందించి తక్షణమే వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు,

# మళ్లీ సత్య లాంటి మంచి సినిమాలే తీస్తా

- దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ ఎమోషన్



**హైదరాబాద్,జనవరి20( వెలుతురు):**
టాలీవుడ్ దర్శకుడు రామ్ గోపాల్ వర్మ తెరకెక్కించిన 'సత్య' 1998లో విడుదలై బ్లాక్ బస్టర్ హిట్ సాధించిన విషయం తెలిసిందే. మళ్లీ 27 ఏళ్ల తర్వాత ఈ మూవీ మరోసారి థియేటర్స్‌లోకి వచ్చింది. ఈ నేపథ్యంలో.. వర్మ ఎమోషనల్ అవుతూ సోషల్‌మీడియాలో ఓ నోట్ షేర్ చేశారు. 'ఒక సినిమా తీయడమంటే బిడ్డకు జన్మనివ్వడంలాంటిదే. ముక్కలు ముక్కలుగా చిత్రీకరిస్తూ ఉంటాం. కాబట్టి ఫైనల్ అవుట్‌పుట్ ఎలా వస్తుందనేది తెలియదు. షూటింగ్ అయ్యాక దాన్ని చూసినవాళ్లు ఇది హిట్టనో, ఫట్టనో అంటారు. నేను మాత్రం సృష్టించిన అందాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తాను. ఎంతోమందికి ఇన్‌స్పిరేషన్‌గా నిలిచిన నా సినిమాను లక్ష్యం లేని నా ప్రయాణంలో ఓ అడుగుగా మాత్రమే భావించారు. రెండు రోజుల క్రితం వరకూ అదే అభిప్రాయంతో ఉన్నాను. నేను సత్య మూవీలోని విషాదం చూసి చలించిపోలేదు. నన్ను నేను చూసుకుని ఏడ్చాను. నన్ను నమ్మిన వారందరికీ చేసిన ద్రోహాన్ని తలుచుకుని అపరాధ భావనతో కుమిలిపోయాను. సక్సెస్, అహంకారం తలకెక్కించుకుని తాగుబోతు నయ్యాను. రంగీలా, సత్య హిట్ అవడంతో నా కళ్లు నెత్తికెక్కాయి. అప్పుడే నా విజన్‌ను కోల్పోయాను. ఎలాగో ఆ తప్పులను సరిదిద్దుకోలేను. కాబట్టి దర్శకుడిగా మొదటి స్థానంలో నిలబెట్టే సినిమాలే తీస్తాను. రెండు రోజుల క్రితం నా కన్నీళ్లు తుడుచుకుంటూ నాకు నేను ఇచ్చుకున్న మాట ఇది. 'సత్య' లాంటి సినిమా తీయలేకపోయినా.. అలాంటివి మీ ముందుకు తేవాలనే ఆలోచన కూడా క్షమించరాని నేరం. దీనర్థం నేను 'సత్య' లాంటి చిత్రాలు తీస్తానని కాదు. ఇందులో చూపించిన నిజాయితీ ఇక మీదట ప్రతి మూవీలో చూపిస్తాను. విలువైన సినిమాలే అందిస్తానని మాటిస్తున్నా' అని రాసుకొచ్చారు. ఈ పోస్ట్ చూసిన నెటిజన్లు వర్మ కొత్త వెర్షన్ చూసేందుకు ఆసక్తిగా ఉన్నారు.

# ప్రభుత్వ పథకాలపై భారాస నేతలు దుష్ప్రచారం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మండిపాటు



**హైదరాబాద్,జనవరి20( వెలుతురు):**
ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం వ్యవసాయ కూలీలకు రూ.12వేల ఆర్థిక సాయం అందిస్తున్నామన్నారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పథకాలపై భారాస నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. '2014 నుంచి 2023 వరకు రాష్ట్రంలో 6,121 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. వారి ఆత్మహత్యలకు కారణమైన గత ప్రభుత్వ నేతలు ఇప్పుడు మాట్లాడటం హాస్యాస్పదంగా ఉంది. రైతులకు డీలర్ల ద్వారా నాణ్యమైన విత్తనాలు అందిస్తున్నాం. గతంలో తూకంలోనూ లోపాలుండేవి. మూడు, నాలుగు కేజీలు అధికంగా తీసుకునేవారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వంలో అధికంగా తూకం వేయడానికి తావులేకుండా కఠిన నిబంధనలు అమలు చేశాం. ఇప్పుడు భారాస నేతలు ప్రతి జిల్లాకు వెళ్లి అసత్యాలు ప్రచారం చేస్తున్నారు. ఇది సరి కాదు. దేశవ్యాప్తంగా రైతులకు ఎప్పుడైనా మేలు జరిగిందంటే అది కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి (ఖీ।లజీనిబిర ఖీ।టటా) నాయకత్వంలో రైతు ప్రయోజనాలకు పెద్దపీట వేస్తూ ముందుకెళ్తాం. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే రూ. 61 వేల కోట్లు రైతుల ప్రయోజనాల కోసం ఖర్చు చేయడమే అందుకు నిదర్శనం' అని ఆది శ్రీనివాస్ తెలిపారు.

# రాష్ట్ర ప్రాజెక్టులకు ఆర్థిక సాయం, అనుమతులు ఇప్పించండి

- కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు విజ్ఞప్తి

**హైదరాబాద్,జనవరి20 వెలుతురు:**
తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన వివిధ ప్రాజెక్టులకు ఆర్థిక సహాయం, అనుమతులు ఇప్పించేందుకు సహకరించాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు కోరారు. సోమవారం ఒడిస్సా రాష్ట్రం కోణార్క్ లో జరుగుతున్న మూడవ జాతీయ మైనింగ్ మంత్రుల సమావేశంలో భాగంగా రాష్ట్రానికి సంబంధించిన ప్రాజెక్టుల ఆర్థిక అంచనాలు, అనుమతులతో కూడిన లేఖను కిషన్ రెడ్డికి కోణార్క్ లో డిప్యూటీ సీఎం అందజేశారు.

తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన కొన్ని ముఖ్యమైన అభివృద్ధి ప్రాజెక్టులను మీ పరిశీలనకు, అవసరమైన చర్యలు తీసుకోవడానికి మీకు తెలియజేయాలని కోరుకుంటున్నానని ఆలేఖలో డిప్యూటీ సీఎం కోరారు.

ప్రాంతీయ రింగ్ రోడ్ (RRR):
2016లో కేంద్ర రహదారుల మంత్రిత్వ శాఖ (MoRTH) ఈ ప్రాజెక్టును "సూత్రప్రాయంగా" ఆమోదించింది. 2022 జూలై 3న ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారు విజయ సంకల్ప సభలో 350 కిలోమీటర్ల ప్రాంతీయ రింగ్ రోడ్ నిర్మాణాన్ని ప్రస్తావించారు.
ప్రాజెక్టు వ్యయం: Rs.34,367.62 కోట్లు
వివరాలు: ఉత్తర మరియు దక్షిణ కారిడార్లకు కేంద్రం ఆర్థిక ఆమోదం ఇప్పటికీ ఇవ్వలేదు. భూమి సేకరణకు రాష్ట్ర ప్రభుత్వం 50% ఖర్చును భరించడానికి సిద్ధంగా ఉందని పేర్కొన్నారు.



రేడియల్ రోడ్ అభివృద్ధి :
హైదరాబాద్ మెట్రో కారిడార్‌లోని 10 కొత్త గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్ల అభివృద్ధి ద్వారా నగర విస్తరణకు ప్రణాళిక రూపొందించారు.
ప్రాజెక్టు వ్యయం: Rs.45,000 కోట్లు
మెట్రో రైల్ ఫేజ్-2 (Metro Rail Phase-II):
హైదరాబాద్ మెట్రో ఫేజ్-2కు సంబంధించి మొత్తం 76.4 కి.మీ మేర కొత్త కారిడార్లను అభివృద్ధి చేయాలని ప్రతిపాదించాము.
ప్రాజెక్టు వ్యయం: ?24,269 కోట్లు
మూసీ నది తీరాభివృద్ధి :
మూసీ నదికి పునరుజ్జీవన ప్రాజెక్టు, బాపు ఘాట్ వద్ద గాంధీ సరోవర్ అభివృద్ధి కోసం ప్రత్యేక చర్యలు.
ప్రాజెక్టు వ్యయం: =o.14,100 కోట్లు
గోదావరి-మూసీ నదుల అనుసంధానం:
గోదావరి నుంచి 5 టీఎంసీ నీటిని మళ్లించి మూసీ నదిని శుద్ధి చేయడం.
ప్రాజెక్టు వ్యయం: =o.7,440 కోట్లు
హైదరాబాద్ నగరానికి సీజంపి (జూవీా):
హైదరాబాద్ నగరానికి 7,444 కి.మీ పొడవునా సీవరేజ్ మాస్టర్ ప్లాన్ రూపొందించబడింది.
ప్రాజెక్టు వ్యయం: =o.17,212.69 కోట్లు
వరంగల్ అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ప్రణాళిక:
రాష్ట్రంలోని రెండో అతిపెద్ద నగరం వరంగల్ కోసం సమగ్ర డ్రైనేజీ ప్రణాళిక.
ప్రాజెక్టు వ్యయం: =o.4,170 కోట్లు
బందర్ పోర్ట్ నుండి హైదరాబాదు డ్రై పోర్టుకు గ్రీన్‌ఫీల్డ్ హైవే:
బందర్ పోర్ట్ మరియు హైదరాబాదు మధ్య ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణం.
ప్రాజెక్టు వ్యయం: =o.17,000 కోట్లు
సింగరేణి బొగ్గు బ్లాక్ కేటాయింపు (రాజజూ):
తెలంగాణలోని గోదావరి వ్యాలీ బొగ్గు బ్లాక్‌లను సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్‌కు కేటాయించాల్సిందిగా అభ్యర్థన.
సెమీకండక్టర్ మిషన్:
సెమీకండక్టర్ తయారీ కోసం హైదరాబాదు అనుకూలమైన కేంద్రంగా అభివృద్ధి చేయడంపై దృష్టి పెట్టడం.
మొత్తం వ్యయం: =o.1,63,559.31 కోట్లు
మీ సముచిత జోక్యంతో ఈ ప్రాజెక్టులకు మంజూరులను పొందడంలో రాష్ట్రానికి సహాయం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నానని ఆ లేఖలో పేర్కొన్నారు.

# గవర్నర్ ప్రతిభా పురస్కారాలు-2024' ప్రకటన

**హైదరాబాద్,జనవరి20 వెలుతురు:**
'గవర్నర్ ప్రతిభా పురస్కారాలు-2024' అవార్డులను తెలంగాణ గవర్నర్ కార్యాలయం ప్రకటించింది. ఈ అవార్డులకు ఎంపికైన 8 మంది జాబితాను వెల్లడించింది. వివిధ రంగాల్లో సేవలందించిన వ్యక్తులు, సంస్థలకు ఈ అవార్డులను ప్రదానం చేస్తారు. ఈ నెల 26న తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఈ అవార్డులను అందించనున్నారు. ఈ మేరకు గవర్నర్ కార్యాలయ ముఖ్యకార్యదర్శి దాన కిశోర్ ప్రకటన విడుదల చేశారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా నాలుగు రంగాలకు చెందిన వారికి ఏటా పురస్కారాలు ఇవ్వాలని తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ నిర్ణయించారు. పర్యావరణ పరిరక్షణ, దివ్యాంగుల సంక్షేమం, క్రీడలు, సాంస్కృతిక విభాగాల్లో గత ఐదేళ్లుగా ఉత్తమసేవలు అందిస్తున్న వారికి గవర్నర్ ప్రతిభా పురస్కారాలు ఇవ్వనున్నారు. సంస్థలు, వ్యక్తులకు వేర్వేరు కేటగిరీల్లో ఈ



అవార్డులు ఉంటాయి. అవార్డు కింద రూ.2 లక్షలు, జ్ఞాపిక ఇవ్వనున్నారు. అవార్డుకు ఎంపికైన వారిలో ..దుశర్ల సత్యనారాయణ, అరికపూడి రఘు, పారా ఒలింపిక్ విజేత జీవాంజి దీప్తి, ప్రొఫెసర్ ఎం.పాండురంగారావు, పి.బి.కృష్ణభారతికి సంయుక్తంగా, ధ్రువాంశు ఆర్గనైజేషన్, ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి, ఆదిత్య మెహతా ఫౌండేషన్, సంస్కృతి ఫౌండేషన్ ఉన్నాయి.

# 200 నకిలీ నోట్ల చెలామణి

- రద్దు చేయాలన్న ఆలోచన లేదన్న ఆర్‌బిఐ

**ముంబై,జనవరి20( వెలుతురు):**
ప్రస్తుతం మార్కెట్‌లో 500 మరియు 200 రూపాయల నోట్లు ఎక్కువగా చెలామణిలో ఉన్నాయి. దీనికి సంబంధించి రిజర్వ్ బ్యాంక్ కీలక ప్రకటన చేసింది. ఆర్‌బీఐ నోటిఫికేషన్ కూడా జారీ చేసింది. మార్కెట్లో నకిలీ 200 రూపాయల నోట్లు వస్తున్నాయని, నకిలీ నోట్లను అరికట్టేందుకు చర్యలు చేపడుతున్నామని ఆర్బీఐ తెలిపింది. కొందరు 200 రూపాయల నోట్లను రద్దు చేస్తున్నట్లు పుకార్లు సృష్టిస్తున్నారని, అలాంటిదేమి లేదని స్పష్టం చేసింది. ఇలాంటి వార్తలను ప్రజలు నమ్మవద్దని సూచించింది. 2000 రూపాయల నోట్లపై నిషేధం తర్వాత దేశంలో నకిలీ 200, 500 రూపాయల నోట్ల చెలామణి నిరంతరం పెరుగుతోందని ఆర్‌బిఐ తెలిపింది. ఇలాంటి పరిస్థితిని క్యాష్ చేసుకోవడానికి కేటుగాళ్లు రంగంలోకి దిగి నోట్లను రద్దు చేస్తున్నట్లు పుకార్లు సృష్టిస్తున్నారని ఆర్బీఐ తెలిపింది. లావాదేవీల సమయంలో ప్రజలు మరింత జాగ్రత్తగా ఉండాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా హెచ్చరించింది. ఇటీవల తెలంగాణలో 200 రూపాయల నోట్లకు కలర్ జిరాక్సులు తీయించి చలామణి చేస్తున్న ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

# సఫాయి అన్నకు సలాం కొట్టిన ఒకే ఒక్కడు కేసీఆర్

- కేసీఆర్ పాలనలో హ్యాపీగా కార్మికులు
- మూడుసార్లు జీతాలు పెంచిన దేవుడు కేసీఆర్
- అంగన్‌వాడీల జీతం రూ. 4500 ఉంటే రూ. 13650కు పెంచాం : మాజీ మంత్రి కేటీఆర్

**హైదరాబాద్,జనవరి2 వెలుతురు:**
ఈ రాష్ట్రంలో పని చేసే కార్మికుల అభివృద్ధి కోసం నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో కృషి చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ తెలిపారు. సఫాయి అన్న.. నీకు సలాం అన్న సీఎం ఈ దేశంలో ఎవరూ లేరు.. కేవలం కేసీఆర్ మాత్రమే అని కేటీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పార్టీ కార్మిక విభాగం క్యాలెండర్ ఆవిష్కరణ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. కేసీఆర్ హమాలీలు, ఆటో డ్రైవర్ల కోసమే కాదు.. అందరి కోసం పని చేశారు. కార్మికుల ఇబ్బందులు, చికాకులు పరిష్కరించేందుకు కేసీఆర్ ఎంతో కృషి చేశారు. జీహెచ్ఎంసీలో సఫాయి కార్మికులకు మూడు సార్లు జీతాలు పెంచారు. తెలంగాణ ఏర్పడక ముందు నాటి ప్రభుత్వాలు అంగన్‌వాడీ టీచర్లను గుర్రాలతో తొక్కించారు. కానీ కేసీఆర్ ప్రభుత్వం వారిని పెద్ద మనసుతో ఆశీర్వదించింది.




అంగన్‌వాడీల జీతం రూ. 4500 ఉంటే రూ. 13650కు పెంచారు. మినీ అంగన్‌వాడీలకు రూ. 2200 ఉంటే రూ.7800 చేశారు. ఇటీవల హైదరాబాద్ నగరంలో ఆశా వర్కర్ల పట్ల పోలీసుల అసభ్యంగా ప్రవర్తించారు. సీఎం రేవంత్ రెడ్డి మాదిరిగానే పోలీసులు కూడా ప్రవర్తించారు. ఆశావర్కర్లకు జీతాలు రూ. 2500 ఉంటే రూ. 9750 దాకా తీసుకువెళ్లాం. ఉపాధి హామీలో పని చేసే ఫీల్డ్ అసిస్టెంట్లకు కూడా జీతాలు పెంచినం. అన్ని రంగాల్లో పని చేసే కార్మికులను గుండెల్లో పెట్టుకున్నామని కేటీఆర్ తెలిపారు.

హోంగార్డుల విషయం బాధాకరం. మొన్న ఒక హోంగార్డు కలిసి కళ్లల్లో నీళ్లు పెట్టుకున్నడు. రూ. 9 వేలు ఉండే జీతాన్ని రూ. 25 వేలు చేసిండు కేసీఆర్.. ఆయన దేవుడు. ఎందుకు ఓడగొట్టారు. ఆయన ఉంటే మాకు ఇంకా లాభం జరిగేది. పోలీసులతో సమానంగా పే స్కేలు వచ్చేది.. మూడు పూటల అన్నం తింటున్నాం అంటే కేసీఆర్ పుణ్యమే అని ఆ హోంగార్డు చెప్పి బాధపడ్డాడని కేటీఆర్ గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కంటే రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 73 శాతం వేతనాలు పెంచారు. దేశంలో అత్యధిక జీతాలు పొందుతున్న ఉద్యోగులు తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులే. ఇది చిన్న విషయం కాదు. కాంట్రాక్టర్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు పీఆర్సీ వర్తింపజేశాం. అలాగే నాలుగున్నర లక్షల మంది బీడీ కార్మికులకు పెన్షన్లు ఇచ్చాం. 26 లక్షల మంది ప్రయివేటు డ్రైవర్లకు 5 లక్షల జీవిత బీమా ఇచ్చారు కేసీఆర్. వైద్య రంగం, మున్సిపల్ రంగంలో జీతాలు పెంచుకుంటూ పోయామని కేటీఆర్ తెలిపారు.

# తెలంగాణలో బీర్ల సరఫరా పునరుద్ధరణ

- ప్రకటన విడుదల చేసిన యూబి సంస్థ

**హైదరాబాద్,జనవరి20( వెలుతురు):**
తెలంగాణలో అతిపెద్ద బీర్ల తయారీ సంస్థ యునైటెడ్ బ్రూవరీస్ లిమిటెడ్ (యూబీఎల్) సంస్థ బీర్ల సరఫరాను పునరుద్ధరించింది. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేసింది. ప్రభుత్వ హామీతో బీర్ల సరఫరాను పునరుద్ధరిస్తున్నట్లు పేర్కొంది. ధరల పెంపు, బకాయిలపై ప్రభుత్వమే నిర్ణయం తీసుకుంటుందని తెలిపింది.గత రెండేళ్ల నుంచి రూ.702 కోట్ల బకాయిల్ని కార్పొరేషన్ విడుదల చేయకపోవడం, బీరు మూల ధరను సవరించాలని ఎన్నిసార్లు విన్నవించినా ప్రభుత్వం పట్టించుకోక పోవడంతో బీర్ల సరఫరాను యూబీఎల్ నిలిపివేసిన సంగతి తెలిసిందే. రాష్ట్రంలో ఆరు బీర్ల తయారీ



సంస్థలున్నా మార్కెట్లోకి వచ్చే వాటిలో 75 శాతం వాటా యూబీఎల్‌దే. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడింది. దీంతో మద్యం ధరల పెంపు అంశంపై హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి ఆధ్వర్యంలో ఓ కమిటీని ఏర్పాటు చేసింది. కమిటీ సిఫారసుల మేరకు నిర్ణయం తీసుకుంటామని ప్రభుత్వం హామీ ఇవ్వడంతో యూబీఎల్.. సరఫరాను పునరుద్ధరించింది.

# సంపాదకీయం..

## దావోస్ పర్యటనలతో సాధించేదేమిటి ?

దావోస్‌లో ప్రపంచ పెట్టుబడుల సదస్సుకు ఇరు తెలుగు రాష్ట్రాల సిఎంలు రేవంత్ రెడ్డి, చంద్రబాబు నాయుడులు వెళ్లారు. పెట్టుబడులే లక్ష్యంగా వీరు అడుగులు వేస్తున్నారు. హైదరాబాద్‌కు ఉన్న బ్రాండ్‌తో తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి తనవంతు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇది ఆయనకు రెండో పర్యటనగా కలసివస్తుందేమో చూడాలి. చంద్రబాబుకు ప్రపంచంలో సొంత బ్రాండ్ ఇమేజ్ ఉంది. అమరావతి కొత్త రాజధానిగా అవతరించినందున ఆయనకు సానుకూలత కాగలదు. అయితే ఇదంతా ఒక ఎత్తయితే.. సింగపూర్‌లా రాష్ట్రాలను అభివృద్ధి చేసేందుకు స్థానికంగా ఉన్న యువతకు ప్రోత్సాహం ఇవ్వాల్సి ఉంటుంది. స్థానిక వనరులు, స్థానిక యువతను ప్రోత్సహిస్తే ఆదాయవనరులు కూడా పెరగగలవు. కానీ మేక్ ఇన్ ఇండియా అంటున్న ప్రధాని కూడా పెద్ద ఎత్తున ఈ రకమైన ప్రోత్సాహం ఇవ్వడం లేదు. దేశీయంగా యువతకు ఉపాధి కల్పించడానికి బ్యాంకులను ప్రోత్సహించాలి. విరివిగా రుణాలు ఇవ్వాలి. వ్యవసాయం, వ్యవసాయాధిరత పరిశ్రమలు, కోళ్లు, పశువులు, గొర్లు, మేకల పెంపకం వంటి వాటికి అవసరమైతే వడ్డీరహిత రుణాలను ఇవ్వగలగాలి. యువత విదేశాలవైపు చూడకుండా ఉండాలంటే ఇలాంటి స్వయం ఉపాధి రంగాలను ప్రోత్సహించాల్సి ఉంటుంది. విదేశీ కంపెనీలను, పెట్టుబడులను ఆహ్వానించి పెద్ద ఎత్తున ఏదో చేయాలన్న ఆలోచన కూడా సరికాదు. ప్రభుత్వ రంగాన్ని, ఉద్యోగులను కుదించడం, సంక్షేమాన్ని వదిలేసి యూజర్ ఛార్జీలు వసూలు చేయడం ఇలాంటి వాటిని కొత్తగా పాలసీలు, విజన్ పేరుతో అమలు చేసేందుకు ఎపిలో కూటమి ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. రెగ్యులేటరీ కమిషన్లు, ప్రైవేటీకరణకు వీలుగా ప్రత్యేక వ్యవస్థలు ఏర్పాటు చేయబోతు న్నారు. తెలుగుదేశం కూటమి ప్రభుత్వ పాలనలో అన్నిటిలోనూ ప్రపంచబ్యాంకు విధానాలు గోచరిస్తున్నాయన్న విమర్శలు వస్తున్నాయి. స్వర్ణాంధ్ర విజన్ 2047, వివిధ రంగాలపై తీసుకొచ్చిన సుమారు 22 పాలసీల్లో గతంలో ప్రపంచబ్యాంకు ఏదైతే చెప్పిందో వాటిని మళ్లీ వేర్వేరు రూపాల్లో తిరిగి తెస్తోందన్న ఆరోపణలు ఉన్నాయి. అయితే అవి ఎలా వున్నా.. స్థానికంగా ఉన్న వనరులతో స్థానిక యువతను ప్రోత్సహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలి. తక్కువ పెట్టుబడులతో పెద్ద మొత్తంలో ఉపాధికి అవకాశాలను అన్వేషించాలి. విదేశీ పెట్టుబడులు అనగానే ముఖ్యంగా విద్యుత్, నీటిని వ్యాపారం చేయడం, అడిగిన వారికి భూములు అప్పగించడం, పట్టణ ప్రాంతాల్లో పెద్దపెద్ద వ్యాపార సంస్థలకు అనువుగా అర్బన్ ల్యాండ్ సీలింగ్ చట్టాన్ని సవరించడం, వ్యవసాయంలో యాంత్రీకరణ పెంచడం, ప్రభుత్వ ఉద్యోగాల సంఖ్యను తగ్గించడం, విదేశీ వ్యాపార సంస్థలకు ఎటువంటి అడ్డంకులూ లేకుండా చేయడం వంటి అంశాలు తునమీదకు వస్తున్నాయి. మరీ ముఖ్యంగా వ్యవసాయ భూములను పారిశ్రామిక ప్రాంతాలుగా మార్చడం, ఆహార పంటల స్థానంలో వాణిజ్య పంటలు పెంచడం, ఆహార ఉత్పత్తులను తగ్గించడం ఇవన్నీ కూడా ఆందోళనకర అంశాలు మారుతున్నాయి. ప్రధానంగా వ్యవసాయ భూములను బలవంతంగా లాక్కుని కార్పోరేట్లకు కట్టబెడు తున్నారు. ఇలాంటి పరిస్థితి పోవాలి. కొత్తగా తీసుకొచ్చే పరిశ్రమలు, పారిశ్రామిక పాలసీల్లో లక్షల మందికి ఉపాధి కల్పన ఉంటుందని పేర్కొంటున్నారు. కానీ ఎక్కడా అలాంటిదేమీ కనిపించడం లేదు. విదేశీ పెట్టుబడులకు దాసోహమంటూ ఇక్కడి వనరులను దోచిపెడుతున్న పాలకులు దేశీయంగా యువత ముందుకు వస్తే మాత్రం..ఓ పైసా వడ్డీకూడా తగ్గించడం లేదు. ఉచిత విద్యుత్ ఇవ్వరు. భూమలు ఇవ్వరు. నీరు ఇవ్వరు. దీనిని బట్టి ప్రపంచీకరణ ప్రభావంతో దేశంలో విదేశీయుల పెత్తనం పెరగిపోవడం ఖాయం. అదే సమయంలో ఉత్పాదకతలో సాంకేతికతను పెంచాల్సి ఉంది. ఆధునీకరణ పేరిట ఇప్పటికే ఉన్న ఉపాధి పోతుంటే కొత్త ఉపాధి వస్తుందని మభ్యపెట్టడం తప్ప మరొకటి కాదు. వ్యవసాయంలో యాంత్రీకరణ, పారిశ్రామిక ఆధునీకరణ అవసరమే. అయితే అది ఉన్న ఉపాధిని దెబ్బతీయకుండా చూసుకోవాలి. సంస్కరణల్లో భాగంగా ఉద్యోగాలను ప్రైవేటుపరం చేయడం ద్వారా ఖర్చును తగ్గించుకోవాలని కేంద్ర రాష్ట్రాల ప్రభుత్వాలు చూస్తున్నాయి. తమపై భారం లేకుండా చూడాలని చూస్తున్నారు. జీతాలు, పెన్షన్లు తగ్గించుకోవాలన్న క్రమంలో ప్రైవేట్ పెట్టుబడులకు పెద్దపీట వేస్తున్నారు. దావోస్ లాంటి సదస్సులు ఇందుకు వేదికగా మారుతున్నాయి. ప్రభుత్వం ప్రైవేటు ఇండిస్ట్రియల్ పార్కులు తెచ్చి రైతులు నేరుగా వారికి భూములు అప్పగించొచ్చనీ ప్రకటించడమే కాకుండా రాయితీలూ ఇస్తామని ప్రభుత్వం చెబుతున్నది. గతంలో తీసుకొచ్చిన సరళీకరణ విధానాల్లో పారిశ్రామిక అవసరాలకు తగిన విధంగా భూములు కేటాయింపులు జరపాలనేది కీలకమైన షరతు. దీన్ని ఇప్పుడు పాలసీ రూపంలో ముందుకు తీసుకొచ్చారు. అయితే ఇదంతా చేసే బదులు ఎవరికి వారు స్వయం ఉపాధి రంగాన్ని ఎంచుకుంటే బ్యాంకు రుణాలు, నీటి సదుపాయాలు, విద్యుత్ సౌకర్యాలు ఇస్తే దేశీయంగానే చిన్నచిన్న పరిశ్రమలు స్థాపన సులువు కాగలదు. దానికి దావోస్ లాంటి సదస్సులకు వెళ్లడం, వెంపర్లాడడం, బతిమాడం వంటివన్నీ చేయకుండానే లక్ష్యం నెరవేర్చుకోగలం. కేవలం ఉన్న మానవ వనరులను,సహజ వనరులను ఉపయోగించుకుంటే మంచిది. అలాంటి ప్రయత్నాలు మొదలు కావాలి. ఎన్‌డిఎ భాగస్వామిగా ఉన్న చంద్రబాబు లాంటి వారు ఇలాంటి ప్రయత్నాలు చేయాలి. దేశీయంగా రుణాలను ఇచ్చేందుకు పారదర్శక విధానం అమలు కావాలి. తక్కువ వడ్డీలకు రుణాలు ఇచ్చేలా పాలసీలను రూపొందించాలి. అప్పుడే ఉపాధి పెరుగుతుంది. పరిశ్రమలు వస్తాయి. స్వయం ఉపాధి పెరుగుతుంది. ద్రవ్యోల్బణం తగ్గుతుంది. దావోస్ పర్యటనలతో డబ్బు వృధా చేసుకునే బదులు దేశీయ ఆలోచనలతో ముందుకు నడవడం అవసరం.

# పెద్ద ప్రాజెక్టులను గద్దల్లా తన్నుకుపోతున్న కార్పోరేట్లు

- వారికి అనుకూలంగా రాష్ట్రాల్లో ప్రభుత్వ పాలసీలు
- ప్రజల బలిదానాలు, భూ దానాలు అన్నీ వృధా

**విశాఖపట్టణం,జనవరి20( వెలుతురు):**

పెద్దపెద్ద ప్రాజెక్టులను ఎంతో ఉదాత్త ఆశయంతో, ప్రజల బలిదానా లతో, భూముల అప్పగింతతో ప్రారంభించినా..చివరకు అవి కొందరు పెట్టుబడిదారులు గద్దల్లా తన్నుకు పోతున్నారు. చిన్న పుల్లకూడా తీయని వ్యక్తులు వాటికి అధిపతులు అవుతున్నారు. తాజాగా మారిటైం పాలసీ పేరుతో సముద్రతీరం మొత్తం ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే విధానాలను ఎపి పాలకులు రూపొందిస్తున్నారు. ఇప్పటికే పోర్టులు, తీర ప్రాంత రోడ్లు అదానీ చేతుల్లోకి వెళ్లిపోయాయి. ఎంతో పెట్టుబడి లక్ష్యంతో ఏర్పాటు చేసిన గంగవరం పోర్టు కూడా ఆదానీ తన్నేసుకు పోయారు. పెట్టుబడిదారులు సునయాసంగా ప్రభుత్వాలను బుట్టలో వేసుకుని పెట్టిన పరిశ్రమలను తన్నుకు పోతున్నారు. దీంతో వారికి స్థాపక ఖర్చు, కష్టం లేకుండా పోతోంది. ఇక మారిటైం పాలసీ అమలు చేస్తే రాష్ట్రానికి మిగిలేదేమీ లేకపోగా పోర్టులు తీసుకున్నవారి వస్తువులు రవాణా చేసేందుకు సదుపాయాలకు అవసరమైన రాయితీలు కల్పించేందుకు మాత్రమే ఆ పాలసీ ఉపయోగపడే విధంగా ఉంది. లాజిస్టిక్స్ పార్కులు కూడా వీటికి అనుబంధంగానే ఏర్పాటు చేస్తున్నారు. మొత్తంగా రాష్ట్ర ప్రజలకు ప్రభుత్వం చేసేదేమీ కనిపించకపోగా పాలసీల పేరుతో ప్రజల ముక్కుపిండి వసూలు చేయడం, ఉన్న వనరులను కార్పొరేట్లకు కట్టబెట్టడం అనేది సుస్పష్టంగా కనిపిస్తోంది. ÷ాష్ట్రంలో వందకోట్ల పైబడి విలువైన కంపెనీలు ప్రభుత్వ లెక్కల ప్రకారమే 2800కిపైగా ఉన్నాయి. ఒకవైపు కార్పొరేట్లకు రాయితీలు కల్పిస్తూ ప్రజలకు సహజ ఆదాయవనరుగా ఉన్న భూమిని మాత్రం ఎవరి చేతి నుండి వారే నేరుగా కార్పొరేట్ల చేతుల్లో పెట్టే విధంగా చట్టాల్లో మార్పులు తీసుకొస్తున్నారు. 2013 భూసేకరణ చట్టానికి రాష్ట్రంలో 2018లో సవరణలు తీసుకొచ్చారు. అంతకుముందే 2009లో ల్యాండ్ రిఫార్మ్స్ సవరణ చట్టాన్ని తీసుకొచ్చారు. ఇవి చాలదన్నట్లు ఇటీవల నెగోషియబుల్ పాలసీ తీసుకొచ్చారు. ఇంకొంచం ముందుకెళ్లి రీసెటిల్‌మెంట్ పాలసీని పరిచయం చేస్తున్నారు. ఈ మొత్తం పాలసీలన్నిటిలోనూ భూములను అడిగిన వారికి కోరుకున్నతంత కట్టబెట్టడమే ప్రధానంగా ఉంది.రిశ్రమలకు అవసరమైన విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన ప్లాంట్లను కూడా ప్రైవేటు భూముల్లోనే ఏర్పాటు చేసేందుకు మరో పాలసీ తీసుకొచ్చారు. దీనికి గ్రీన్ ఎనర్జీ అని పేరు పెట్టారు. పెద్దఎత్తున విద్యుత్ ఉత్పత్తి పెరిగిందని, ఆదా చేస్తున్నామని చెబుతూనే బయట మార్కెట్ నుండి అదనపు ధరకు విద్యుత్





కొనుగోలు చేసి ఆ భారాన్ని ప్రజలపై ట్రూఅప్, ఎఫ్‌పిపిఎస్‌ఎ పేరుతో వేస్తున్నారు. గత 10 సంవత్సరాల కాలంలో విద్యుత్ ఎ÷-లాంట్లకు రాష్ట్ర వ్యాప్తంగా 1.20 లక్షల ఎకరాలు కట్టబెట్టారు. వాటిని తీసుకున్న వారు మాత్రం తాకట్టు పెట్టి కోట్ల రూపాయలు రుణాలు తీసుకుంటున్నారు. క నీటి అవసరాలు తీర్చే పేరుతో తొలిసారిగా జలవనరుల ప్రాజెక్టుల్లో ప్రైవేటు పెట్టుబడులను ఆహ్వానించినట్లు వాటర్ పాలసీలో పేర్కొన్నారు. నీటి రెగ్యులేటరీ కమిషన్ ఏర్పాటు చేయనున్నారు. ఇప్పుడు విద్యుత్‌లాగే ఇక నీటికి కూడా వినియోగ ఖర్చు ప్రాతిపదికగా డబ్బు వసూలు చేస్తారు. చంద్రబాబునాయుడు తొలిసారి సంస్కరణలు అమలు చేసిన సమయంలో విద్యుత్‌తోపాటు నీటిని కూడా వినియోగ వస్తువుగా మార్చాలనేది కీలకాంశంగా పేర్కొన్నారు. 2008లోనే అన్ని పట్టణ ప్రాంతాల్లో మీటర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని తీర్మానాలు చేయించారు. దాని ఫలితంగా పట్టణ ప్రాంతాల్లో నీటి మీటర్లు బిగించారు. వీటి నిర్వహణ పేరుతో రెగ్యులేటరీ కమిషన్ ఏర్పాటు చేసి నీటి వ్యాపారాన్ని స్థిరీకరించనున్నారు. అంటే ప్రైవేటు వ్యక్తులు కట్టే ప్రాజెక్టులు రైతుల కోసమా వ్యాపారం కోసమా అనేది ఇట్టే అర్థం చేసుకోవచ్చు. ఫుడ్ ప్రాసెసింగ్ పేరుతో నీటిని తక్కువగా వినియోగించే హార్టికల్చర్ సాగును ప్రోత్సహించాలని మరో పాలసీని తీసుకొచ్చారు. ప్రపంచబ్యాంకు, ఐఎంఎఫ్ షరతులు అమలు చేసిన శ్రీలంక, బంగ్లాదేశ్ ఆహార సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలనేది అందులో కీలక షరతు. అలాగే ఆహార ఉత్పత్తులు తగ్గించి ప్రాసెసింగ్‌కు అవసరమైన పంటలు పండించడం షరతుల్లో కీలకమైంది. ఇప్పుడు ఈ షరతునే పాలసీ రూపంలో ముందుకు తీసుకొచ్చారు. దీనివల్ల ఆహార ఉత్పత్తులు తగ్గి ఆహార సంక్షోభం ఏర్పడటం, అది ఆర్థిక సంక్షోభాన్ని సృష్టించడం అ÷-జగ్గ÷ంటైనాతోపాటు అనేక దేశాల్లో ఎదుర్కొన్న ప్రధాన సమస్య. 2017లో తీసుకొచ్చిన ఆధునిక యాంత్రీకరణ విధానం కూడా ప్రపంచబ్యాంకు షరతుల్లో భాగమే. చిన్న కమతాలను తగ్గించి కార్పొరేట్ వ్యవసాయం చేయడం కోసం ఈ షరతును బలవంతంగా రుద్దింది. అభివృద్ధి చెందిన దేశాల్లో అమలవుతున్న ఈ పద్ధతి మనలాంటి అభివృద్ధి చెందుతున్న దేశాల్లో అదీ చిన్న కమతాలున్న చోట సాధ్యం కాదు. చిన్న కమతాలను తగ్గించడమంటే రైతులను, వాటిపై ఆధారపడి బతుకుతున్న వారికీ ఉపాధి లేకుండా చేసి బయటకు తరిమి వేయడమే !ఒకవైపు పెద్దపెద్ద కంపెనీలతో ఉపాధి వస్తుందని చెబుతూనే మరోవైపు ఎవరికివారే ఎంటర్‌ప్రెన్యూర్ అనడం అర్థం కాని విషయంగా మారింది. భవిష్యత్‌లో ఉద్యోగాలు ఎవరికివారే చూసుకోవాలనే విధంగా చెబుతున్నారు. ప్రతిపనికీ యూజర్‌ఛార్జీ వసూలు చేయడం, ప్రతిసేవకూ లెక్కగట్టి ఛార్జీలు వసూలు చేయడం. అందులో భాగంగానే యూజర్ ఛార్జీలు, ఆస్తివిలువ ఆధారిత పన్నులు, వీధిలైట్ల నిర్వహణ ప్రైవేటీకరణ, శానిటేషన్ ఖర్చులు వసూలు చేయడం, తాగునీటికి ఛార్జీలు, డిఅండ్‌ఓ ట్రేడ్ లైసెన్సులు పెంచడం, కాలనీ అసోసియేషన్లు ఇవన్నీ కూడా సంస్కరణల్లో భాగమే వాటినే ఇప్పుడు కొత్తగా అమలుకు సిద్ధమయ్యారు. ప్రభుత్వం పూర్తిగా తన బాధ్యతల నుండి తప్పుకుని ప్రజలే పాలించుకుని, వారే పన్నులు విధించుకుని వారే నిర్వహించుకునే విధంగా షరతులు పెట్టింది. వాటిని ఇప్పుడు అన్ని పాలసీల్లో అమలు చేస్తున్నారు.

# విశాఖ ప్లాంట్‌కు ప్రైవేటీకరణ ముప్పు తొలగలేదు

- 1144 వేల కోట్ల ప్యాకేజీ పేరుతో కేంద్రం నయవంచన
- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు డి వెంకన్న ఆరోపణ

**విశాఖపట్టణం,జనవరి20( వెలుతురు):**

విశాఖ స్టీల్ ప్లాంట్‌కు ప్రైవేటీకరణ ముప్పు తొలగలేదని, 11,440 వేల కోట్ల రూపాయల సహాయం అందిస్తున్నట్టు ప్రకటించి కేంద్రం ప్రభుత్వ నయ వంచనకు పాల్పడుతుందని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు డి వెంకన్న పెర్కోన్నారు. విశాఖ ఉక్కుకు సహాయం పేరుతో కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణకు ప్రాణం పోస్తోందని అగ్రహారం వ్యక్తం చేశారు. నాలుగు నెలలుగా జీతాలు లేక ఉద్యోగులు విలవిల లాడుతున్నా ఒక్క మాట కూడా మాట్లాడని కూటమి నేతలు ఇప్పుడు కేంద్రం నుంచి ప్యాకేజీని తామే సాధించామని సంబరాలు జరుపుకుంటున్నారని తెలిపారు. పెద్ద ప్యాకేజీని అందిస్తున్నట్టు చెబుతున్న కేంద్రం ఈ సొమ్ము వినియోగానికి సవాలక్ష నిబంధనలు పెట్టిందన్నారు. ఈ మేరకు సోమవారం అయిన ఓ ప్రకటన విడుదల చేసారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ఊపిరి నిలబడాలంటే ప్యాకేజీలు సరిపోవని అన్నారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ చేయడం లేదని ప్రకటించాలన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ కి సొంత ఇనుప గనులు కేటాయించాలి సొంత బొగ్గు గనులు ఉండాలి రైల్వే వ్యాగిన్స్ కేటాయించాలి. మూసి వేసిన బ్లాస్ట్ ఫర్నేస్ ని ప్రారంభించాలి. సెప్టెంబర్ నుండి బకాయి పడిన ఉద్యోగుల వేతనాలు చెల్లించాలి. ప్రైవేటు కంపెనీల అప్పులు మాఫీ చేస్తున్నట్లు విశాఖ స్టీల్ అప్పులను మాఫీ చేయాలి. గంగవరం పోర్టులో అదానీ అడ్డంకులు తొలగించాలి. కూటమి ఎంపీల మద్దతుతో ఊపిరి పోసుకున్న మోడీ ప్రభుత్వ ఇకనైనా ఆంధ్రప్రదేశ్ ప్రజలను మోసం చేయడం అపాలని వెంకన్న డిమాండ్ చేసారు,మేక పోతును బలి ఇచ్చే ముందు దాన్ని ముస్తాబు చేసినట్టే అందువల్ల ఇందులో ఒక్క పైసా కూడా ఉద్యోగుల ఈ ప్యాకేజీ సొమ్ము నుంచి జీతాలు చెల్లించడానికి వీలు లేదన్నారు. కేవలం 0.5 మిలియన్ టన్నుల కెపాసిటీ కలిగిన కర్ణాటకలోని విశ్వేశ్వరయ్య స్టీల్ ఎ÷-లాంట్ కు 15 వేల కోట్ల రూపాయల సహాయాన్ని అందించిన కేంద్ర ప్రభుత్వ దానికి ఎటువంటి షరతులూ విధించ లేదన్నారు. కానీ దానికి పదిహేను రెట్లు విశాఖ స్టీల్ ఎ÷-లాంట్ పెద్దదని తెలిపారు అంటే 7.3 మిలియన్ టన్నుల కెపాసిటీ వున్న విశాఖ ఉక్కుకు మాత్రం కేవలం 11,440 కోట్ల రూపాయల సహాయం అందిస్తూ సవాలక్ష నిబంధనలు విధించిందని తెలిపారు. పైగా ముడి సరుకులు కొనడానికి కూడా ప్యాకేజీ సొమ్ము వినియోగించరాదని, స్పష్ట మైన ఆదేశాలు ఉన్నాయన్నారు,÷ంింద్రం అందిస్తున్న ఈ ప్యాకేజీ వెనుక వున్న మతలబును మడత పెట్టి కూటమి నాయకులు ప్రజలను నిలువునా ముంచే యడానికి సిద్ధపడు తుందని అన్నారు. కేవలం విశాఖ ఉక్కును కొనుక్కునే ప్రైవేట్ పార్టీ సౌలభ్యం కోసమే కేంద్రం ఈ ప్యాకేజీ ని ప్రకటించిందన్న విషయం తెలుసుకున్న నాడు తెలుగు ప్రజలు గుండెలు బాదు కోవలసి




వస్తుందని అన్నారు. కేంద్రం ప్రకటించిన సాయం కేవలం అంకెల గారడీ తప్ప విశాఖ ఉక్కు రివైవల్ కు ఏ మాత్రం ఉపయోగ పడే అవకాశం లేనే లేదన్నారు.గతంలో ఉక్కు మంత్రిత్వ శాఖ ఇచ్చిన రు.500 కోట్లు ఈక్విటీ, ఆర్థిక శాఖ ఇచ్చిన రు.1,140 కోట్ల రుణాన్ని కలుపుకొని ఇప్పుడు రు.11,440 కోట్ల ప్యాకేజీని కేంద్రం ప్రక టించిందన్నారు. అంటే ఇప్పుడు కేంద్రం ప్రకటించిన ప్యాకేజీ మొత్తంలో గతంలో ఇచ్చిన 1640 కోట్లను కలిపేసిందని తెలిపారు అంటే ఇప్పుడు ఇవ్వనున్నది రూ.9800 కోట్లు మాత్రమే. ఇది కూడా ఇప్పటికిప్పుడు కేంద్రం ఇవ్వదన్నారు మార్చి నెలాఖరు లోపల రు.6,800 కోట్లు మాత్రం విడుదల చేస్తారని, ఇందులో సుమారు రు.5 వేల కోట్లు బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలకు గాను చెల్లించడానికే. ఉపయోగించ వలసి ఉంటుందని అన్నారు ఈ విధంగా కేంద్రం ఇప్పుడు,ఇవ్వనున్న రూ.9800 కోట్లలో 2025 డిసెంబరు నాటికి 7,350 కోట్లు రూపాయలు కేవలం బ్యాంకులకే కట్టల్సి ఉంటుందని తెలిపారు. ఇది కాకుండా పాత బాకీల చెల్లింపులు అంటూ రు.1400 కోట్లు టాటా మరో రు.500 కోట్లు వీఆర్ఎస్ కింద చెల్లించి 600 మంది ఉద్యోగుల్ని ఇంటికి -పంపించేయాలని చూస్తుందని తెలిపారు ఈఏడాది చివరకు ఎలాగూ 1200 మంది ఉద్యోగులు పదవీ విరమణ చేయబోతున్నారని తెలిపారు. వారికి రు. 1500 కోట్లు వరకూ చెల్లించాలని అన్నారు. దీంతో దాదాపు 2 వేల మంది ఉద్యోగులు బైయటకు వెళ్లి పోతారని తెలిపారు. మరో 2000 మంది కాంట్రాక్టు కార్మికుల్ని ఈ ఏడాది చివరి కల్లా తొలగించాలని పక్రియ వెంటనే ప్రారంభించాలన్న ఆదేశాలు కూడా కేంద్రం ఇచ్చేసిందన్నారు. ఈమేరకు ఇర్ఛార్జి సీఎండీ సర్సేనా అప్పుడే 2 వేల మంది కాంట్రాక్టు కార్మికులకు ఉద్వాసన పలకడానికి కసరత్తు ప్రారంభించేసారని అన్నారు. కేంద్రం ప్రకటించిన 11,440 కోట్ల ప్యాకేజీకి ఇవన్నీ షరతులు అన్న విషయాన్ని ప్రజా ప్రతినిధులు గుర్తు పెట్టుకోవాలి. కానీ ఇక్కడి ప్రజా ప్రతినిధులు ప్యాకేజీ సూపర్ అంటూ ప్రజల్ని మోసం చేస్తున్నారని తెలిపారు. ఇక కేంద్రం ప్రకటించిన రు.11,440 కోట్లలో నాలుగు నెలలగా జీతాలు లేకుండా. అలమటిస్తున్న ఉద్యోగులకు ఒక్క రూపాయి కూడా ఇవ్వడానికి వీలు లేదని హుకుం జారీ అయ్యిందన్నారు అంతే కాదు ముడి సరుకులు కొనడానికి (వర్కింగ్ క్యాపిటల్) కూడా ఈ సొమ్మును వినియోగించడానికి వీలు లేదన్నారు. ప్యాకేజీ సొమ్ము మొత్తం స్జబెర్స్ పాత బకాయిలు తీర్చడానికి, బ్యాంకు బకాయలు కట్టడానికి, వీఆర్ఎస్ చెల్లింపులకు మాత్రమే ఖర్చు చేయాలని తెలిందన్నారు. అయితే మరి వర్కింగ్ కాపిటల్ లేకుండా వచ్చే ఆగష్టు నాటికి విశాఖ ఉక్కు ఎలా నడుస్తాయో కేంద్రంలోని పెద్దలకే తెలియాలి. ముడి సరుకుల కొనుగోలుకు అవసర మయ్యే పర్కింగ్ కాపిటల్క్ ఒక్క రూపాయి కూడా కేటాయించ లేదన్నారు.కావలసిన స్వంత ఘనుల విషయం ప్రస్తావించ లేదన్నారు ఇక విశాఖ ఉక్కు కోసం వేల ఎకరాల భూముల్ని ఇచ్చిన నిర్వాసితుల గురించి అసలు ప్రస్తావనే లేదన్నారు. వారికి ఇవ్వాల్సిన ఉద్యోగాల గురించి ఎటువంటి ప్రకటనా లేదన్నారు. పైగా ఇప్పటికే కాంట్రాక్టు ఉద్యోగాలు చేస్తున్న నిర్వాసితుల్ని తొలగించే పక్రియను మొదలెట్టేశారని ముఖ్యంగా విశాఖ ఉక్కులో నూరు శాతం పెట్టుబడుల ఉపసంహరణకు 2021లో కేంద్ర కాబినెట్ చేసిన తీర్మానాన్ని ఇప్పటికీ రద్దు చేయలేదన్నారు. అంటే విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేయబోవటం లేదనే భరోసా లేనే లేదన్నారు.2021 తీర్మానం రద్దు కానంత వరకూ విశాఖ ఉక్కు మెడపై ప్రైవేటీకరణ కత్తి ఉన్నట్టేనని తెలిపారు ఉద్యోగులకు జీతాలు ఇవ్వకుండా, ఉన్న ఉద్యోగుల్ని భారీగా తొలగించి, స్వంత ఘనులు ఇవ్వకుండా, వర్కింగ్ కాపిటల్ లేకుండా, పెట్టుబడుల ఉపసంహరణ తీర్మానాన్ని రద్దు చేయకుండా విశాఖ ఉక్కు రివైవల్ ఎలా అవుతుందో? కూటమి పెద్దలు ప్రజలకు వివరించాలి కోరారు.ఇంత పెద్ద మొత్తంలో ప్యాకేజీ ఇచ్చినా విశాఖ ఉక్కు నష్టాల్లో వుంది గనుక దీన్ని ప్రైవేట్ పరం చేయడం తప్పడం లేదని చెప్పడానికి మాత్రమే ఈప్యాకేజీ పాచికను కేంద్రం విసిరిందని అన్నారు ఇది వంచనా కాదా? ఈ వాస్తలను తెలుసు కోకుండా కూటమి పెద్దలు సంబరాలు చేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు.

# హౌసింగ్ బోర్డ్ ను సృష్టించింది ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వమే..

- కాంగ్రెస్ ప్రభుత్వంలో వేలాది ఇండ్లు నిర్మించింది...
- అధికారంలోకి రాగానే హౌసింగ్ బోర్డ్ స్థలాలు వేలం వేసిన ఘనత టిడిపి ప్రభుత్వానిదే...
- నేటి ఎమ్మెల్యే నాడు టిడిపిలో మున్సిపల్ వైస్ చైర్మన్ కాదా?
- కాంగ్రెస్ పార్టీ వాళ్లను దొంగలంటూ సంబోధించడం తగదు....
- టిడిపి నుండి టిఆర్ఎస్ లో చేరి కాంగ్రెస్ ప్రభుత్వం పై విమర్శలు చేయడం సబబు కాదు
- ఖాళీ స్థలాలు కనిపిస్తే కబ్జా చేద్దామని ప్రయత్నిస్తున్నారా?
- కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి...



**కూకట్ పల్లి జనవరి 20 వెలుతురు:**

పేద, మధ్యతరగతి వారికి తక్కువ ధరకే వాయిదాల పద్ధతిలో ఇల్లు కేటాయించి రాష్ట్రంలో లక్షలాది మందికి సొంత ఇంటి కల నెరవేర్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిది అని కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి అన్నారు. తాజాగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించిన తీరుపై సతీష్ రెడ్డి స్పందిస్తూ సోమవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో ఆయన మాట్లాడుతూ నిబంధన అతిక్రమించి అక్రమంగా నిర్మించిన నిర్మాణాలపై చట్ట ప్రకారం ప్రభుత్వ అధికారులు చర్యలు తీసుకుంటే ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కు ఏలాంటి ఇబ్బంది వచ్చిందని ఆయన ప్రశ్నించారు. 1969లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కూకట్ పల్లి ప్రాంతంలో హౌసింగ్ బోర్డ్ ద్వారా 1300 ఎకరాలకు పైగా స్థలాన్ని సేకరించి 1979లో అప్పటి ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి హయంలో భరత్ నగర్ నుండి మొదలుకొని కూకట్ పల్లి కాలనీలో నిర్మాణాల ప్రారంభించారని పేర్కొన్నారు. ఆ తర్వాత తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత టిడిపి హాయంలో ఒక్క నిర్మాణం సైతం నిర్మించలేదన్నారు. అంతేకాక ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హాయంలో మలేషియన్ టౌన్షిప్ పేరిట నిర్మించిన ఐజయం సంస్థకు 37 ఎకరాలు కేటాయించింది నిజం కాదా అని ప్రశ్నించారు. ఆలయాలు, మసీదులు, చర్చ్ లకు ప్రభుత్వం అధికారికంగా స్థల కేటాయింపులు జరుపదని, హౌసింగ్ బోర్డ్ స్థలం ప్రభుత్వ ధర నిర్ణయించిన నిబంధనల ప్రకారం డబ్బులు చెల్లిస్తే కేటాయించే అవకాశం ఉందన్నారు. ఎమ్మెల్యేకు ఇంకా టిడిపి వాసన పోలేదని, టిడిపిలో గెలుపొంది టిఆర్ఎస్ లోకి వెళ్లి ఇంకా టిడిపి నాయకులతో సన్నిహితంగా ఉన్న మీరు కాంగ్రెస్ ప్రభుత్వం పై విమర్శించే అర్హత ఉందా అని ప్రశ్నించారు. పేద ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని చూసి ఓర్వలేక ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ లో కొనసాగుతున్న ఎమ్మెల్యేలను రాజీనామా చేయాలని డిమాండ్ చేయడం పక్కన బెట్టి దమ్ముంటే ముందు ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి తిరిగి గెలిచే దమ్ముందా అని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికే రాష్ట్రంలో బిఆర్ఎస్ పార్టీ అధికారం కోల్పోయి కొన ఊపిరితో ఉందని అందుకే ఎమ్మెల్యే కృష్ణారావు కి మతి భ్రమించి కాంగ్రెస్ ప్రభుత్వంపై దొంగలు అంటూ పరుష పదజాలంతో మాట్లాడడం ఆయన దివాళ కోరు రాజకీయాలకు నిదర్శనం అన్నారు. భవిష్యత్తులో బిఆర్ఎస్ పార్టీ దుకాణం బందు కావడం ఖాయమని భావించి 1999లో అభివృద్ధి చేశానని చెబుతూ తిరిగి టిడిపిలోకి వెళ్తారా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం పై ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అసభ్య పదజాలంతో విమర్శిస్తే భవిష్యత్తులో రాజకీయ పుట్టగతులు ఉండవని సతీష్ రెడ్డి హెచ్చరించారు.

## అమ్మకానికి హౌసింగ్ బోర్డు స్థలాలు.. కోట్ల రూపాయలు ప్రజాధనం వృధా...

### వేలం పాటను అడ్డుకుంటాం ..ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు..



కూకట్ పల్లి జనవరి 20 వెలుతురు: గడిచిన సంవత్సర కాలంలో రేవంత్ రెడ్డి సర్కార్ అభివృద్ధిని అటుకెక్కించి ప్రభుత్వ స్థలాలను అమ్మకానికి పెట్టి కోట్ల రూపాయలు ప్రజాధనం వృధా చేస్తున్నారని కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కూకట్ పల్లి కె.పి.హెచ్.బి కాలనీలోని ఎన్నో సంవత్సరాలుగా ఉన్న వేణుగోపాల స్వామి ఆలయ మండపాన్ని హౌసింగ్ బోర్డ్ అధికారులు సీజ్ చేసిన విషయాన్ని తెలుసుకొని స్థానిక కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు తో కలిసి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు వేణుగోపాల స్వామి ఆలయాన్ని సోమవారం పరిశీలించారు. అదేవిధంగా హౌసింగ్ బోర్డు లోని జిహెచ్ఎంసి ఆధీనంలో ఉండే రమ్య గ్రౌండ్ పార్కు స్థలాన్ని సైతం హౌసింగ్ బోర్డ్ అధికారులు బోర్డులు పెట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా తెలంగాణ రాష్ట్రంలో మాజీ మంత్రి కేటీఆర్ సహకారంతో ప్రజల సౌకర్యార్థం కె.పి.హెచ్.బి కాలనీలో మహిళా పార్కులు, చిల్డ్రన్ పార్కులను , ఆట స్థలాలను క్రికెట్ గ్రౌండ్ లను ఏర్పాటు చేశామని దానికి విరుద్ధంగా రేవంత్ రెడ్డి సర్కార్ హౌసింగ్ బోర్డ్ స్థలాలను అమ్మకానికి పెట్టి కోట్ల రూపాయలు దండుకోవడం దారుణమన్నారు. హౌసింగ్ బోర్డ్ స్థలాలలో ప్రజాప్రయోజనార్థం 10% భూములను గుడి, పాఠశాలలకు, పార్కులకు కేటాయించాలని ఎలాంటి కేటాయింపులు చేయకుండా వేలం పాటలు ఏ విధంగా వేస్తారని ప్రశ్నించారు. ఎన్నో సంవత్సరాలుగా ఉంటున్న దేవాలయ మండపానికి ఎవరికీ చెప్పకుండా ఎలా సీజ్ చేస్తారని కనీసం పంచనామా జరపకుండా ఆలయ సిబ్బందికి కమిటీకి చెప్పకుండా అధికారులు ఎలా సీల్ చేశారో తెలపాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ధోరణి మార్చుకోకపోతే ఈనెల 24 వ తారీఖున జరిగే వేలం పాటను అడ్డుకోవడానికి బిఆర్ఎస్ పార్టీ సిద్ధంగా ఉందని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బాబురావు, సతీష్ అరోరా, డివిజన్ అధ్యక్షులు కృష్ణారెడ్డి, సాయిబాబా చౌదరి, శ్యామల రాజు, రాజేష్, పవన్, పి.ఎల్ ప్రసాద్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ జెండా దిమ్మె పోలును తొలగించి కాంగ్రెస్ దిమ్మెకు జాతీయ జెండా

### అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు...



**కూకట్ పల్లి జనవరి 20 వెలుతురు:**

తన సొంత ఖర్చుతో గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తే ఆ విగ్రహం వద్ద ఉన్న జాతీయ జెండా ను ఎలా తొలగిస్తారని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు జిహెచ్ఎంసి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కెపిహెచ్బి కాలనీ ఒకటవ రోడ్డులోని గాంధీ విగ్రహం వద్ద జాతీయ జెండా దిమ్మె కు ఎగిరేయకుండా దిమ్మె పోలు ను జిహెచ్ఎంసి అధికారులు కట్ చేశారు దాని పక్కనే ఉన్న కాంగ్రెస్ దిమ్మెకి జాతీయ జెండాను పెట్టడంతో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు జిహెచ్ఎంసి అధికారులను ప్రశ్నించారు. అధికారుల ధోరణి మార్చుకోకపోతే బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు చూస్తూ ఊరుకోరని ఇకనైనా పక్కన ఉన్న కాంగ్రెస్ దిమ్మెను తొలగించి విగ్రహం ఏర్పాటు చేసిన రోజు ఉన్న పాత దిమ్మకు జాతీయ జెండాను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అధికారులను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్ బాబురావు, సతీష్ అరోరా, కృష్ణారెడ్డి, రాజేష్ రాయ్ , సాయి, పాతూరి గోపి, ఎర్రబెల్లి సతీష్ రావు, వెంకటేష్ చౌదరి, పృథ్వి తదితరులు పాల్గొన్నారు.



## గీత కార్మికుల సమస్యలపై చలో కలెక్టరేట్ కు కదిలిన గీత వృత్తిదారులు

- గీత కార్మికులకు ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

**రామన్నపేట వెల్దురు న్యూస్ జనవరి 20**

కల్లుగీత కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని భువనగిరిలో జరిగిన కళ్ళు గీత కార్మికుల కలెక్టరేట్ ముట్టడికి రామన్నపేట నుండి గీత కార్మికులు హాజరు కావడం జరిగింది. ఈ సందర్భంగా కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బావండ్లపల్లి బాలరాజు, మండల కార్యదర్శి పులి బిక్షం మాట్లాడుతూ, గీత కార్మికులకు ప్రమాద నివారణకు కంట మహేశ్వర రక్షణ కవచం వృత్తి చేసే వారందరికీ ఇవ్వాలని గీత కార్మికులకు ద్విచక్ర వాహనాలు అందివ్వాలని, ప్రమాద బాధితులకు పెండింగ్ ఎక్సిగేషన్ డబ్బులు వెంటనే చెల్లించి ఎన్నికల హామీ ప్రకారం 10 లక్షలు పెంచాలని తాడి కార్పొరేషన్ నుండి ఇచ్చే సహాయం నిలిపివేయడంతో, అనేకమంది ఇబ్బందులు పడుతున్నారు, దాన్ని కొనసాగించాలని ఎన్నికల హామీ ప్రకారం పెన్షన్ 4 వేలకు పెంచాలని నందనంలో నీరా తాటి,ఈత ఉత్పత్తుల ప్రాజెక్టు ప్రారంభించాలి. గ్రామాల్లో బెల్ట్ షాపులో నిరోధించాలని ప్రతి సొసైటీకి చెట్ల పెంపకానికి 5 ఎకరాల భూమి అందివ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గీత కార్మిక సంఘం జిల్లా కమిటి సభ్యులు ఎర్ర రవీందర్, కూనూరు మల్లేశం, నాయకులు పల్లె సత్యం,పబ్బు వెంకన్న,గంగాదేవి ఆంజనేయులు, గడ్డమీద సత్తయ్య,పప్పు శేఖరు,పబ్బు మల్లయ్య,బోయపల్లి ప్రవీణ్ కుమార్, కునూరు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## హోప్ ఆఫ్ హంగర్ సంస్థ సేవలు అభినందనీయం

- కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్.



**కూకట్ పల్లి జనవరి 20 వెలుతురు:**

హోప్ ఆఫ్ హంగర్ చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయమని ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ అన్నారు. హోప్ ఆఫ్ హంగర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ పీజేఆర్ నగర్ లో నివసిస్తున్న జెట్టి కంసమ్మ అనే నిరుపేద మహిళకు వీల్ చైర్, కుట్టు మిషన్ పని నేర్చుకుని మిషన్ కొనుక్కునే ఆర్థిక స్తోమత లేని మేరీ అనే మహిళకు కార్పొరేటర్ చేతుల మీదుగా వారికి కుట్టు మిషన్ అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ తమ డివిజన్ లోని పేద ప్రజలకు సేవ చేస్తున్న హోప్ ఆఫ్ హంగర్ సంస్థ వ్యవస్థాపకురాలు ఆలేఖ్య, వారి బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో కూడా సేవా కార్యక్రమాలు ఇలాగే కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ధాతి రమేష్, షకీల్ మున్నా, వాలి నాగేశ్వరరావు, పి.సూరిబాబు, వెంకటేశ్వరరావు, మల్లీశ్వరి, రవికిరణ్, అమూల్య తదితరులు పాల్గొన్నారు.

## క్రిస్టియన్, మైనార్టీల అభ్యున్నతి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం...

- శేరి సతీష్ రెడ్డి



**కూకట్ పల్లి జనవరి 20 వెలుతురు:**

క్రిస్టియన్ మైనార్టీల అభ్యున్నతి కేవలం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని కూకట్ పల్లి నియోజకవర్గం మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి అన్నారు. సోమవారం కేపీహెచ్బీ కాలనీలో క్రిస్టియన్ మైనార్టీ కార్యాలయాన్ని ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా శేరి సతీష్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ క్రిస్టియన్ మైనార్టీ ఫైనల్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్ ఆశీర్వాదంతో కూకట్ పల్లి నియోజకవర్గ ఇన్చార్జ్ బండి రమేష్ పర్యవేక్షణలో ఈ కార్యాలయాన్ని ప్రారంభించుకున్నట్లు తెలిపారు. అలాగే ప్రతి డివిజన్ లో క్రిస్టియన్ కమిటీలు నియమించి క్రిస్టియన్, మైనార్టీలు కాంగ్రెస్ పార్టీకి వారధిగా ఉండాలని కోరుకున్నారు. అనంతరం క్రిస్టియన్ మైనార్టీ కోఆర్డినేటర్ క్రిష్టఫర్ ని ఆయన సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు హౌసి టోచర్, జాన్, ఫణీంద్ర కుమార్, కెపిహెచ్బి డివిజన్ అధ్యక్షులు ప్రవీణ్ కుమార్, అర్ ఏ పాల్, మయూరి, పొడుగు అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి, డ్రైనేజీ సమస్యలు పరిష్కరించండి

- జలమండలి యం.డి కి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు వినతి



**కూకట్ పల్లి జనవరి 20 వెలుతురు:**


వేసవి కాలం రానున్న నేపథ్యంలో కూకట్ పల్లి నియోజకవర్గంలో నెలకొన్న తాగునీటి సరఫరా సమస్యలతో పాటు పొంగిపొర్లుతున్న డ్రైనేజ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ అండ్ సీవరేజ్ బోర్డు ఎం.డి అశోక్ రెడ్డిని కోరారు. ఈ మేరకు నియోజకవర్గ పరిధిలోని బీ ఆర్ ఎస్ కార్పొరేటర్లతో కలిసి సోమవారం వినతి పత్రాన్ని అందజేశారు. నియోజకవర్గంలో గత ప్రభుత్వ హయాంలో మంజూరైన పనులను కొంతమేరకు చేపట్టి మిగతా పనులను పెండింగులో పెట్టారనీ సత్వరమే పెండింగ్ పనులను పూర్తి చేయాలని కోరారు. పలు ప్రాంతాల్లో తాగునీటిలో మురుగునీరు కలిసి సరఫరా అవుతుందని దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కూకట్పల్లి డివిజన్ జలమండలి అధికారులకు స్థానిక సమస్యలపై ఎక్కటికప్పుడు పిర్యాదు చేస్తున్నప్పటికీ నిధుల కొరతతో పనులు జరగడంలేదని తెలిపారు. నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు నిధులను మంజూరు చేయాలని కోరారు. గత పదేళ్ల కాలంలో నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో తాగునీటి పైప్లైన్ ఆధునీకరణ, రిజర్వాయర్ల నిర్మాణం వంటివి పూర్తి చేయడం జరిగిందన్నారు. అరకొరగా మిగిలిన చిన్నపాటి పనులను కూడా ప్రస్తుత పరిస్థితుల్లో పూర్తి చేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. జలమండలి ఎండీ ప్రత్యేక చొరవ తీసుకుని కూకట్పల్లి నియోజకవర్గంలో తాగునీటి సమస్యను పరిష్కరించి వేసవికాలంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు.

# ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు బహిరంగ చర్చకు సిద్ధమా..?

● **కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు శివ చౌదరి..**

**కూకట్ పల్లి జనవరి 20 వెలుతురు:**

హౌసింగ్ బోర్డ్స్ ప్రభుత్వ స్థలాలు కబ్జాలకు గురై పార్కుల్లో అక్రమ కట్టడాలు వెలుస్తున్నాయి, దానిపై చర్యలు చేపట్టలేని ఎమ్మెల్యే వితండవాదం చేస్తున్నారని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు బహిరంగ చర్చకు రావాలని కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు శివ చౌదరి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం హౌసింగ్ బోర్డ్ స్థలాలను వేలం వేయడానికి నిర్ణయించిన నేపథ్యంలో ఎమ్మెల్యే కృష్ణారావు చేసిన వ్యాఖ్యలపై శివ చౌదరి స్పందిస్తూ సోమవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో ఆయన మాట్లాడుతూ ప్రజా అవసరాలకు ఉంచిన ప్రభుత్వ స్థలాల్లో అక్రమ కట్టడాలు అక్రమ షెడ్లు నిర్మించింది మీ అనుచరులు కాదా..? అని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వ స్థలమైన రమ్యా గ్రౌండ్ లో అక్రమ కట్టడాలకు పూనుకుంది ఎవరు..? పాఠశాల అంటూ గత ప్రభుత్వంలో హడావుడి చేసింది మీరు కాదని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన వెంటనే బిఆర్ఎస్ నాయకులు ఎందుకు వెనకడుగు వేశారు...?అమలు చేయవలసిన కబ్జాకు అంతరాయం కలిగిందా..? అని అన్నారు. కూకట్ పల్లి నియోజకవర్గం గోపాల్ నగర్ లో తొమ్మిది ఎకరాల పార్కు స్థలం కబ్జాకు గురైందన్నారు. గోపాల్ నగర్ లో ఒక గుడి, బడి లేదు10 సంవత్సరాల్లో మీరు ఏం సాధించారని ఆవేదన వ్యక్తం



చేశారు. ప్రభుత్వ స్థలాల్లో, పార్కుల్లో అక్రమ కట్టడాలు, కబ్జాల చెర నుంచి మీరు ప్రభుత్వ భూములను కాపాడటంలో, ప్రభుత్వ భూములను కాపాడి ప్రజా వినియోగం తీసుకురావడంలో మీరు పూర్తిగా విఫలమయ్యారని అన్నారు. భూములు కబ్జా కాకుండా ప్రజా వినియోగం కోసమే వేలం వేస్తుంటే మీకు కలిగిన ఇబ్బంది ఏమిటి..? అని ఆయన ప్రశ్నించారు. బంగారు తెలంగాణ అంటూ మాయమాటలు చెప్పి గత ప్రభుత్వంలో కోకాపేట భూములు, నాగోల్ ప్రభుత్వ భూముల్లో వెంచర్ల వేసి ప్లాట్లు అమ్ముకొని. ఓఆర్ఆర్ రోడ్లను కూడా అమ్ముకున్న దుస్థితి మీదన్నారు. గత పది సంవత్సరాల్లో చెరువులు కబ్జాలు విపరీతంగా పెరిగాయని కూకట్పల్లి నియోజకవర్గంలో చెరువులు కబ్జాలకు గురయ్యాయి దానిపై మీరు చర్యలు చేపట్టక పోగా మీ అనుచరులు ద్వారానే దందా నడిపించి ఏమీ తెలియనట్లుగా మైకు దొరికిన వెంటనే ఏదో ఒకటి మాట్లాడాలని మాట్లాడడం హాస్యాస్పదకంగా ఉందన్నారు. పేదలపై ప్రేమ ఉన్న మీరు గత పది ఏళ్లలో ఒక్కరికి కూడా ఒక్క రేషన్ కార్డు కూడా అందించలేకపోయారు. పేదలకు ఇల్లు కట్టించలేకపోయారు ఇళ్ల స్థలాలు ఇవ్వలేకపోయారు. ఒక ఎమ్మెల్యేగా ఉండి కార్పొరేటర్ల చేతిలో ఉండి కూడా కెపిహెచ్బి లో ఉన్న 630 ఎల్ఐజి ఫ్లాట్స్ ఓనర్స్ కు, హౌసింగ్ బోర్డ్ కు మధ్య ఉన్న సమస్యను గత పది సంవత్సరాల్లో పరిష్కారం చూపలేకపోయారు. పైగా సమస్యలను జటిలం చేస్తున్నారనీ మండిపడ్డారు. నిజమైన పేదల పక్షపాతి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్, వీరి సమక్షంలో పేదలకు రేషన్ కార్డులు, ఇళ్ల స్థలాలు, ఇల్లు మంజూరు అవుతున్నాయని ప్రతి సమస్య పరిష్కరింపబడుతుందన్నారు. నేటి కాంగ్రెస్ పాలనలో బంగారు తెలంగాణ దిశగా అడుగులు వేస్తున్నాం అన్నారు.

# శిథిలమైపోతున్న బాగ్ లింగంపల్లి హౌసింగ్ బోర్డు దుకాణాలను కాపాడాలి

## - సిపిఎం డిమాండ్

(రాపర్తి భాస్కర్ గౌడ్)

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, జనవరి 20:**

బాగ్ లింగంపల్లిలో శిథిలమైపోతున్న హౌసింగ్ బోర్డ్ దుకాణాలను కాపాడాలని సోమవారం నాడు ముషీరాబాద్ సీపీఎం జోన్ కమిటీ ఆధ్వర్యంలో ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించారు, ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ బాగ్ లింగంపల్లి లో తెలంగాణ హౌసింగ్ బోర్డ్ కు సంబంధించిన 51 దుకాణాలు పదిహేనేళ్ల క్రితం మూతపడ్డాయి, ఆ దుకాణాలను ఎవరికి కేటాయించకుండా పెండింగ్ లో పెట్టడంతో భవనాలు నిర్వహణ లేక పూర్తిగా శిథిలమై పోతున్నాయి, కొన్ని ఆక్రమణలకు గురవుతున్నాయి. ప్రజాధనంవృధాఅయిపోతున్నది.హౌసింగ్ బోర్డ్ దుకాణాలతో జనంతో కళకళలాడే బాగ్ లింగంపల్లి ప్రధాన రహదారి శిథిల భవనాలతో బోసిపోయినట్టుగా మారిపోయింది. హౌసింగ్ బోర్డ్ కు దుకాణాల కిరాయి దారులకు మధ్య ఏర్పడిన సమస్య కారణంగా2009-10 సంవత్సరంలో దుకాణాలు



మూసివేయబడ్డాయని ఆయన తెలిపారు,కిరాయి దారులకే ఆ దుకాణాలను కేటాయించాలని గత కాంగ్రెస్ ప్రభుత్వంలో నిర్ణయం జరిగినప్పటికీ నేటికీ అమలు కాలేదు, తదనంతరం వచ్చిన బిఆర్ఎస్ ప్రభుత్వం ఈ సమస్యను ఎటు తేల్చకుండా నాన్చుతూ వచ్చింది. హౌసింగ్ బోర్డు కు ప్రతినెల అద్దెల కింద ఈ దుకాణాలు నుండి 40 వేల ఆదాయం వచ్చేది. దుకాణాల మూసివేతతో ఆదాయం రాకపోగా రిపేర్లు చేయడానికి నిధులు లేవు,ఆక్రమణ నుండి కాపాడలేక కాపాడుకోలేని దుస్థితిలో హౌసింగ్ బోర్డ్ ఉన్నదని ఆరోపణలు చేశారు, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఈ సమస్యపై ఇప్పటివరకు ఎలాంటి చర్య తీసుకోలేదు, ఈ దుకాణాల కేటాయింపు పై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే తగు నిర్ణయం తీసుకోవాలని సిపిఎం డిమాండ్ చేస్తున్నదని ఆయన తెలిపారు,దశాబ్దాల కాలం పాటు ఈ దుకాణాలకు కిరాయిదారులుగా కొనసాగిన వారికి, దుకాణాలకు తగిన రేటు నిర్ణయించి వారికే కేటాయించే విషయం ప్రభుత్వం పరిశీలించాలని సిపిఎం డిమాండ్ చేదుతుందని అన్నారు, ఈ మీడియా సమావేశంలో సిపిఎం పార్టీ నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం. దశరథ్, ముషీరాబాద్ జోన్ కార్యదర్శి రాపర్తి వెంకటేష్ ,జోన్ కార్యదర్శి వర్గ సభ్యులు కే ,రమేష్ తదితరులు పాల్గొన్నారు,

# గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలి

● **డిసిసి ఉపాధ్యక్షుడు మందుగుల బాలకృష్ణ**

**సంస్థాన్ నారాయణపురం మండలం వెలుతురు జనవరి 20:**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని నూతన రేషన్ కార్డులు,ఇందిరమ్మ ఆత్మీయ భరోసా,ఇందిరమ్మ ఇండ్లు,రైతు భరోసా పథకాలను ఈ నెల 26 న అందించుటకు ఏర్పాట్లు చేస్తున్నారు.గత కొన్ని రోజులుగా గ్రామాల్లో ప్రజలు ఆందోళనకు గురి అవుతున్నారు.కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మందుగుల బాలకృష్ణ మాట్లాడుతూ రెండు,మూడు రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వం పిలుపు మేరకు నిర్వహిస్తున్న గ్రామసభల ద్వారా తెల్ల రేషన్ కార్డులు,ఇందిరమ్మ ఆత్మీయ భరోసా,ఇందిరమ్మ ఇండ్లు,రైతు భరోసా పథకాలను ప్రజలు రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎలాంటి అపోహలకు గురికాకుండా అర్హులైన పేదలందరూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి అని చెప్పారు.ఇప్పుడు కొత్త రేషన్ కార్డుల కోసం వచ్చిన జాబితాలో పేర్లు రానివాళ్లు ఎలాంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదని. ప్రభుత్వం మంత్రులు పదేపదే చెపుతున్నారు. సి.ఏం రేవంత్ రెడ్డి,ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆదేశాలను పాటిస్తూ దారిద్ర రేఖకు దిగువన ఉన్న పేద కుటుంబాలు గ్రామ సభల ద్వారా



ఈ నాలుగు పథకాలను లబ్ధి పొందాలని అధికారులకు సహకరిస్తూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దీన్ని ప్రజలు గమనించి అర్థము చేసుకొని ప్రభుత్వానికి సహకరించాలని పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నాము. సంక్షేమ పథకాల లో లబ్ధిదారుల లిస్టులో పేర్లు రానివారు ఈ నాలుగు గ్యారెంటీలకు గ్రామ సభలో దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం సూచించిందని ప్రజలు రైతులు గమనించి దరఖాస్తు చేసుకోవాలని పత్రికాముఖంగా మీకు తెలియపరుస్తున్నాము. అసత్య ప్రచారాలను నమ్మవద్దని ప్రభుత్వ అధికారుల దగ్గరికి వెళ్లి గ్యారెంటీ పథకాలను పొందే విధంగా కృషి చేస్తాం. ఈ సమావేశంలో డిసిసి కార్యదర్శి ఏపూరి సతీష్ ,మాజీ సర్పంచ్ కోన్ రెడ్డి నరసింహ,సీనియర్ కాంగ్రెస్ నాయకులు జెక్కిడి బాల్ రెడ్డి కిసాన్ కాంగ్రెస్ మండల శాఖ అధ్యక్షులు వద్యా జగ్రం ,పి.ఏ.సి.ఎస్ డైరెక్టర్ ఉప్పల కృష్ణ,మాజీ సర్పంచ్ సరిపల్లి సత్యనారాయణ,ఈద శంకరయ్య,రేవనపల్లి బిక్షపతి,వద్ద్య రాజు,మహేశ్వరం విగ్నేశ్వర్,ఉప్పల రాజయ్య ,రాసమల్ల గాలయ్య, మెంగాయాదయ్య ,ఎండి ముత్తుజ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర పోలీస్ క్రీడలకు 5వ జోనల్ పోలీస్ పోలీసు క్రీడాకారుల ఎంపిక



**వెలుతురు న్యూస్ సూర్యాపేట జనవరి 21**

జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ఐపిఎస్ ఆదేశాల మేరకు ఎంపిక.క్రీడలకు అడ్మిన్ అదనపు ఎస్పి నాగేశ్వరరావు, ఏ ఆర్ అదనపు ఎస్పీ జనార్ధన్ రెడ్డి లు పర్యవేక్షణ చేశారు..5వ జోనల్ పోలీస్ సూర్యాపేట, నల్గొండ జిల్లాల పోలీసు సిబ్బందికి క్రీడలు నిర్వహించి తెలంగాణ రాష్ట్ర స్థాయి స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్-2025 కు పోలీసు క్రీడాకారులను ఎంపిక చేయడం జరిగినది. జిల్లా స్థాయిలో ఎంపిక కాబడిన సూర్యాపేట, నల్గొండ జిల్లాల పోలీసు క్రీడాకారులకు ఈరోజు సూర్యాపేట జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్ నందు క్రీడా పోటీలు



నిర్వహించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినారు. ఎంపిక కాబడిన ఉమ్మడి జిల్లా పోలీసు క్రీడాకారుల జట్లు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. పురుషులు, మహిళల విభాగాల్లో కబడ్డీ, వాలీబాల్, కోకో జట్లు, జావెలిన్ త్రో, హై జంప్, లాంగ్ జంప్, షాట్ పుట్, ఫట్ బాల్, బ్యాట్మెంటెన్, పరుగు పందాలు, టగ్ ఆఫ్ వార్ పోటీలకు జట్లు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమం నందు ఏ ఆర్ డి ఎస్ పి నరసింహ చారి, నల్గొండ ఆర్ ఐ లు హరిబాబూ, శ్రీనివాస్ ఆర్ఎస్ఐ లు సురేష్, రాజశేఖర్, ఎం.అశోక్, కె.అశోక్, సాయిరామ్ సిబ్బంది ఉన్నారు.

# చౌటుప్పల్ చిరు వ్యాపారులను కాపాడుకుంటాం

- ఐ.ఎన్.టి.యు.సి నాయకులు



**చౌటుప్పల్ మండలం వెలుతురు జనవరి 20:**

చౌటుప్పల్ మున్సిపాలిటీలో శ్రీ లక్ష్మీనరసింహ చిరు వ్యాపారుల సంఘం బోదుల యాదగిరి ఆధ్వర్యంలో ఐ.ఎన్.టి.యు.సి నాయకులకు ఘనంగా సన్మానించడం జరిగినది.ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఐ.ఎన్.టి.యు.సి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోయ రామచంద్రం పాల్గొని మాట్లాడుతూ చౌటుప్పల్ సర్వీస్ రోడ్డు ఇరువైపులా గత 30సంవత్సరాలుగా చిరు వ్యాపారులు పండ్లు కూరగాయలు,పువ్వులు,బట్టలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారు.త్వరలో కొత్తగా నిర్మించే ఫ్లైఓవర్ కారణంగా రోడ్డుకు ఇరువైపులా చిరువాపారుల కుటుంబాలు రోడ్డున పడే అవకాశం ఉంది. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి మీ సమస్యను పరిష్కారం చూపుతం అన్నారు.ఈ కార్యక్రమంలో చిరు వ్యాపారులు ఐ.ఎన్.టి.యు.సి యాదాద్రి భువనగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి సామకూర రాజయ్య,బ్లాక్ అధ్యక్షులు కంచర్ల జంగయ్య,చౌటుప్పల్ మున్సిపల్ అధ్యక్షులు ముత్యాల గణేష్ మండల ప్రధాన కార్యదర్శి మహమ్మద్ చాంద్ పాషా, చౌటుప్పల్ మండల మైనార్టీ అధ్యక్షులు ఎండి ఆరిఫ్ లను చిరు వ్యాపారులు సన్మానించడం జరిగినది.

# అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలి


● **సిపిఐ ఆధ్వర్యంలో అధికారులకు వినతి**



**సంస్థాన్ నారాయణపురం మండలం వెలుతురు జనవరి 20:**

సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో సిపిఐ మండల శాఖ ఆధ్వర్యంలో అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు ఇవ్వాలని ఆర్డీవో, ఎమ్మార్వో కి వినతిపత్రం అందజేశారు.ప్రజా పాలనలో మండలంలోని చాలామంది అర్హులైన వారికి రేషన్ కార్డులో పేర్లు లేకపోవడంతో ఆందోళనలో ఉన్నారు.ప్రజాపాలనలో వేళల్లో దరఖాస్తులు తీసుకున్నారు. తక్కువ మందితో అర్హుల జాబితా రావడం చూసి ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రేపటి నుంచి జరిగే గ్రామ సభల లోనే అర్హులైన వారి జాబితాను తయారుచేసి ఆమోదించిన తర్వాత కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయాలని అన్నారు. అదేవిధంగా రైతు భరోసా కూడా అర్హులైన రైతులందరికీ వర్తింపజేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి బచ్చనగోని గాలయ్య, మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, సహాయ కార్యదర్శి చిలువేరు అంజయ్య, జిల్లా కౌన్సిల్ సభ్యులు కలకొండ సంజీవ, పొట్ట శంకరయ్య, వీరామల్ల యాదయ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ బీరప్ప స్వామి దేవాలయానికి ఆర్థిక సాయం అందజేసిన పి ఎ సి ఎస్ మాజీ చైర్మన్ ఏరుకొండ రవీందర్ గౌడ్



**ఆత్మకూర్ వెలుతురు జనవరి 20:**

ఆత్మకూర్ జ్యోతి న్యూస్ ఆత్మకూరు మండలంలోని శ్రీ బీరప్ప స్వామి విగ్రహ ప్రతిష్టాపన కు ఆత్మకూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మాజీ చైర్మన్ ఏరుకొండ రవీందర్ గౌడ్ తన వంతు సహాయంగా 30 వేల ఆర్థిక సాయం అందజేశారు. రవీందర్ గౌడ్ మాట్లాడుతూ యాదవుల కులస్తులకు బీరన్న దేవాలయానికి ఆర్థిక సాయం అందజేయాలని కోరిన వెంటనే నా వంతు సహాయ సహకారాలు అందిస్తానని చెప్పారు. ఆత్మకూరు మండలంలోని మూడు గ్రామాలకు ఆత్మకూరు గూడెప్పాడు తిరుమలగిరి గ్రామస్తులకు ఉపయోగపడే విధంగా బీరన్న దేవాలయాన్ని నిర్మిస్తున్నామని కమిటీ చైర్మన్ మంతుర్తి రవి అన్నారు. వైస్ చైర్మన్ మిరియాల కుమార్, సహకార్యదర్శి కాడ వేన రమేష్, కమిటీ సభ్యులు సాంబయ్య, ఓదెలు, రవీందర్, ఐలుకోమురు, నాగన్న, సతీష్ రవి, కుమార్, రాజకుమార్, తదితరులు ఉన్నారు.

# కంకణాల ఇంట వివాహ వేడుకకు బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్ గారికి ఆహ్వానం..

● **కేటిఆర్ గారికి శుభలేఖను అందజేసిన బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కంకణాల వెంకట్ రెడ్డి**

**చింతపల్లి వెలుతురు జనవరి 20**



నల్లగొండ: కంకణాల వారి ఇంట 2025 ఫ్రిబ్రవరి 02 న బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కంకణాల ప్రవీణ వెంకట్ రెడ్డి గార్ల కుమార్తె సౌమ్య అనిల్ వెంకట్ రెడ్డిల వివాహ వేడుకకు కుటుంబ సమేతంగా హాజరై వధూవరులను ఆశీర్వదించాలని కోరుతూ..బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు కి బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కంకణాల వెంకట్ రెడ్డి వివాహ శుభలేఖను అందజేశారు.

# అమెరికా లో జరిగిన దుండగుల కాల్పుల్లో మృతి చెందిన రవితేజ

- హైదరాబాద్ అష్ట లక్ష్మి ఏరియా గ్రీన్ హిల్స్ లో నివాసం ఉంటున్న మృతి కుటుంబం
- మృతుడి స్వగ్రామం యాదాద్రి భువనగిరి జిల్లా కొయ్యలగూడెం




( రాపర్తి భాస్కర్ గౌడ్)

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, జనవరి 20:**
అమెరికా వాషింగ్టన్ లో హైదరాబాద్ కు చెందిన విద్యార్థి కొయ్యడ రవితేజ అక్కడి దుండగులు జరిపిన కాల్పుల్లో మృతి చెందిన సంఘటన జరుగగా రవితేజ కుటుంబ సభ్యులకు తీరని శోకాన్ని మిగిలింది, కాగా రవితేజ కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం రవితేజ 2022 సంవత్సరం లో మాస్టర్స్ చేయడానికి అమెరికా వెళ్ళాడు. అక్కడ రవితేజ పార్ట్ టైమ్ జాబ్ చేస్తూ ఉన్నాడు. ఇదే క్రమంలో రవితేజ పని చేస్తూ ఉన్న పిజ్జా షాపింగ్ మాల్ కు వచ్చిన దుండగులు డబ్బులు తీసుకుని వెళ్లే క్రమంలో రవితేజ ను గన్స్ తో కాల్పులు జరుపడం తో అక్కడే మృతి చెందారు, దీంతో రవితేజ కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది, కాగా రవితేజ కుటుంబం హైదరాబాద్ లోని అష్ట లక్ష్మీ ఏరియా గ్రీన్ హిల్స్ కాలనీ లో నివసిస్తున్నారు, రవితేజ తండ్రి కొయ్యడ చంద్ర మౌళి స్వగ్రామం యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెం గ్రామంకాగా వారు ప్రసుత్తం హైదరాబాద్ అష్ట లక్ష్మీ ఏరియా గ్రీన్ హిల్స్ కాలనీ లో నివసిస్తున్నారు, చంద్ర మౌళి ప్రైవేట్ ఉద్యోగ్యం చేస్తూ రవితేజను ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు ఎంతో కష్టపడి పనిచేశాడు కానీ విధి ఆడిన నాటకంలో రవితేజ ప్రాణాలను కోల్పోయాడు. కాగా రవితేజ మృతి నేపథ్యంలో ఆయన కుటుంబ సభ్యులు తీవ్ర శోకసంద్రంలో మునిగారు,

# శివ దీక్ష స్వాములచే అభిషేకం




**చౌటుప్పల్ వెలుతురు జనవరి 20:**
చౌటుప్పల్ మండలం అంకిరెడ్డిగూడెం గ్రామంలోని శ్రీ శ్రీ ఉమామహేశ్వర ప్రాచీన దేవాలయం శివదీక్ష స్వాముల సన్నిధిలో సోమవారం రోజు పంచామృత అభిషేకం నిర్వహించి పూజలు చేయడం జరిగింది. సన్నిధానం గురు స్వామి బత్తుల జంగయ్య గౌడ్, శివ స్వాములు గురిజా బాలరాజు శివస్వామి, చేపూరి వెంకటేశ్వర్లు శివస్వామి బర్మ లింగస్వామి శివస్వామి, గుండు మల్లప్ప శివస్వామి, గోసెట్టి సాయి శివస్వామి, భీమగోని లాలు ప్రసాద్ శివస్వామి, మోడెపు మహేష్ శివస్వామి, గురిజా శివ ప్రసాద్ శివస్వామి, బత్తుల భరత్ గౌడ్ శివస్వామి, భక్తులు గోశెట్టి యాదప్ప, గుండుప్రవీణ్, మోడెపు సురేష్, పందులవంశీ, బుషిగంపల నరేష్, పాల్గొన్నారుద

# పాఠశాలల్లో మౌలిక భాషాగణిత సామర్థ్యాలు పెంపొందించాలి!



**సూర్యాపేట వెలుతురు జనవరి 20:**
DSC 2024 ద్వారా నూతనంగా నియామకం కాబడిన సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయినీ,ఉపాధ్యాయులకు మౌలిక భాషాగణిత సామర్థ్యాల మీద ఒకరోజు శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సూర్యాపేట జిల్లా విద్యా శాఖ తరపున జిల్లా గుణాత్మక విద్య సమన్వయ సెక్టోరియల్ అధికారి శ్రీ దేవరశెట్టి జనార్ధన్ గారు,కోర్స్ డైరెక్టర్ గా సూర్యాపేట మండల విద్యాశాఖ అధికారి శ్రీ శేషగాని శ్రీనివాస గౌడ్ గారు సూర్యాపేట మండలంలోని కాంప్లెక్ ప్రధానోపాధ్యాయులు శ్రీ దైద పాపయ్య గారు, శ్రీ జెల్ల ప్రసాద్ గారు,శ్రీ జె.యాకయ్య గారు,శ్రీ కె.వెంకటేశ్వర్లు గారు మరియు మండల విద్యా వనరుల కేంద్రం రిసోర్స్ పర్సన్లు కటకం నరసింహస్వామి దొంగరి మహేష్,కస్తూరి కిషన్ ప్రసాద్,బి.కరుణ మరియు కాంప్లెక్స్ రిసార్ట్స్ పర్సన్లు సఫియా,వీణ,అన్నపూర్ణ, జలగం లింగయ్య తదితరులు పాల్గొన్నారు.



# మంద జగన్నాథం గారి యాది లో......

- మంద జగన్నాధం గారికి నాకు మధ్య ఎంతో వ్యక్తిగత అనుబంధం ఉంది
- ఆయన మన మధ్యన లేకపోవడం ఎంతో బాధాకరం
- జగన్నాధం గారి ఆత్మకు శాంతి చేకూరాలని దేవుడిని ప్రార్థిస్తున్నా
- తెలంగాణ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లే ప్రయత్నంలో తెలంగాణ గొంతును పార్లమెంటులో బలంగా వినిపించిన వ్యక్తి
- తెలంగాణ రాష్ట్ర సాధనలో మంద జగన్నాథం గారికి ఉన్న కమిట్మెంట్ ఎంతో గొప్పది
- తెలంగాణ రాష్ట్ర సాధన ఏర్పాటు విషయంలో మందా జగన్నాథం గారి పేరు చరిత్రలో నిలిచిపోతుంది
- వారి కుటుంబ సభ్యులకు ఎల్లవేళలా అండగా ఉంటాం
- కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి

**హైదరాబాద్ వెలుతురు జనవరి 20:**
ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన నాగర్ కర్నూల్ మాజీ ఎంపీ మంద జగన్నాథం గారి చిత్రపటానికి నివాళులు అర్పించారు గౌరవ మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి హైదరాబాద్ సాగర్ రింగ్ రోడ్ లోని కేకే గార్డెన్ లో మంద జగన్నాథం గారి దశదిన కర్మ కార్యక్రమంలో పాల్గొని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మంద జగన్నాథం గారి తో ఆయనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. 2009 నుండి 2014 వరకు తెలంగాణ రాష్ట్ర సాధనలో భాగంగా పార్లమెంటులో జగన్నాథం గారితో కలిసి ఉద్యమం లో కొట్లాడిన తీరు గొప్పదన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు పట్ల ఆయన కమిట్మెంట్ అసాధారణమైనదని అన్నారు. కుటుంబం ధైర్యం కోల్పోవద్దని



కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు...




# బిజెపి పార్టీ పటిష్టతకు కృషి చేయాలి

- మల్కాజ్ గిరి పార్లమెంటు సభ్యులు ఈటెల రాజేందర్

**వెలుతురు నారాయణఖేడ్ జనవరి 20 :**
నారాయణఖేడ్ నియోజకవర్గం పెద్ద శంకరంపేట్... రానున్న స్థానిక సంస్థల ఎన్నికల దృష్టిలో ఉంచుకొని గ్రామీణ ప్రాంతాలలో భారతీయ జనతా పార్టీని పటిష్టత కోసం నాయకులు కార్యకర్తలు కృషి చేయాలని మల్కాజ్ గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ అన్నారు.. సోమవారం హైదరాబాద్ లోనీ ఆయన నివాసంలో పెద్ద శంకరంపేట మండల బిజెపి అధ్యక్షుడు కోణం విట్టల్.. నారాయణఖేడ్ నియోజకవర్గ బిజెపి నాయకులు పత్రి రామకృష్ణ సంజీవరెడ్డి లు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు.. ఈ సందర్భంగా ఈటెల రాజేందర్ వారితో మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో బూత్ స్థాయి వరకు భారతీయ జనతా పార్టీని పటిష్ట పరచాలని సూచించారు.. స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామీణ ప్రాంతాలలో బిజెపి పార్టీ నాయకులు కార్యకర్తలు అత్యధిక



స్థానాలను గెలుపొందేలా కృషి చేయాలి అన్నారు.. భారతదేశ అభివృద్ధి భారతీయ జనతా పార్టీతోనే సాధ్యమవుతుందని .. కేంద్ర ప్రభుత్వ పథకాలను గ్రామాలలో ప్రజలందరికీ వివరించాలని పిలుపునిచ్చారు..



# నెరవేరిన కోహీర్ ప్రజల చిరకాల కల

- హర్షం వ్యక్తం చేస్తున్న కోహీర్ ప్రజలు..

**జహీరాబాద్ వెలుతురు జనవరి 20:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం పరిధిలోని కోహీర్ మేజర్ గ్రామ పంచాయతీని మున్సిపాలిటీగా ఏర్పాటు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడంతో కోహీర్‌లోని పలు పార్టీల నాయకులు సంబురాలు చేసుకొన్నారు. మున్సిపాలిటీ కోసం కృషి చేసిన ప్రతిఒక్కరికీ వారు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మీర్ ముజఫర్ హుస్సేన్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు, మొహమ్మద్ హమీద్ అలీ మరియు ఎంఐఎం నాయకుడు మొహమ్మద్ రఫియుద్దీన్ మాట్లాడుతూ... కోహీర్ అధిక జనాభా కలిగిన పట్టణం అయినప్పటికీ, గ్రామ పంచాయతీగా ఉండటం వల్ల అభివృద్ధి పరంగా చాలా వెనుకబడి ఉందని అన్నారు. గ్రామ పంచాయతీకి అందుబాటులో ఉన్న నిధులు సరిపోకపోవడంతో, కోహీర్ ను మునిసిపాలిటీగా మార్చాలనే డిమాండ్ గత కొన్ని సంవత్సరాలుగా ప్రజల నుండి ఉందని



వారన్నారు. ప్రజల చిరకాల కల ఈ రోజు నెరవేరిందని ఆనందం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వం ప్రస్తుతం తీసుకున్న నిర్ణయం ప్రకారం కోహీర్ ఇప్పుడు అభివృద్ధి వైపు పయనిస్తుందని ఆశభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రివర్యులు శ్రీధర్ బాబు, దామోదర్ రాజ్ నరసింహ, జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షెట్కర్, జహీరాబాద్ శాసనసభ్యులు కొనింటి మాణిక్ రావు, జహీరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఎ. చంద్రశేఖర్, శాసనమండలి సభ్యుడు అమీర్ అలీ ఖాన్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు ముహమ్మద్ అలీ షబ్బీర్, ఎం ఐ ఎం శాసనసభ్యులు అక్బరుద్దీన్ ఒవైసీ,రాష్ట్ర సెట్విన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు డాక్టర్ ఉజ్వల్ రెడ్డి, మాజీ టిజిఐడిసి చైర్మన్ మహమ్మద్ తన్వీర్ లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రధానోపాధ్యాయుడిపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

**నల్ల బ్యాడ్జీలతో ఉపాధ్యాయ సంఘాల నాయకులు నిరసన**



**జహీరాబాద్ వెలుతురు జనవరి 20:**
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాములుపై దాడి చేసిన నిందితులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని కోరుతూ సోమవారం రంజోల్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద గజిటెడ్ హెచ్ ఎం నానుసింగ్ రాథోడ్ ఆధ్వర్యంలో AIITA, GTA, PRTU ఉపాధ్యాయ సంఘాల నాయకులు నల్ల బ్యాడ్జీలు ధరించిన నిరసన కార్యక్రమం చేపట్టారు. ప్రధానోపాధ్యాయుడికి జరిగిన అవమానాన్ని నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా నేడు నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్టు వారు తెలిపారు. ఈ రోజు చేపట్టిన నిరసన కార్యక్రమంలో ప్రభుత్వ టీచర్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ సల్లాఉద్దీన్, ఐటా అధ్యక్షులు ఖాజా నిజామోద్దీన్, పిఆర్టియు పట్టణ అధ్యక్షులు శ్రీశైలం, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# పేదల వైద్యానికి సీఎం సహాయ నిధి భరోసా

- డాక్టర్ సిద్ధం ఉజ్వల్ రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు...



**జహీరాబాద్ వెలుతురు జనవరి 20:**
సీఎంఆర్ఎఫ్ పేదల వైద్యానికి భరోసా కల్పిస్తుందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ సిద్దం.ఉజ్వల్ రెడ్డి అన్నారు. సోమవారం జహీరాబాద్ మండలం సత్వార్ గ్రామానికి చెందిన లబ్ధిదారుడు కె.గోవర్ధన్ కి ముఖ్య మంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైనా 60 వేల రూపాయల చెక్కును వారు సోసైటి చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి, చిరాగ్ పల్లీ మాజీ సర్పంచ్, యూత్ కాంగ్రెస్ నాయకులతో కలిసి పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పేద ప్రజలు డబ్బులు లేక కార్పోరేట్ ఆసుపత్రులలో చికిత్సలు తీసుకోవడానికి ఉన్న ఇబ్బందులు తొలగించి వారిని ఆదుకునేందుకు సీఎంఆర్ఎఫ్ తోడ్పాటు అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సత్వార్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# ఆపదలో ఉన్న వారికి అండగా సీఎం సహాయ నిధి

- తట్టు నారాయణ, జహీరాబాద్ మండల అధ్యక్షులు





**జహీరాబాద్ వెలుతురు జనవరి 20:**
ఆపదలో ఉన్న వారికి సీఎం సహాయ నిధి అండగా నిలుస్తుందని జహీరాబాద్ మండల అధ్యక్షులు తట్టు నారాయణ అన్నారు. సోమవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మాణిక్ రావు ఆదేశానుసారంగా వారు బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు నామ రవికిరణ్, పట్టణ ముఖ్య నాయకులతో కలిసి జహీరాబాద్ పట్టణంలోని వివిధ వార్డులకు చెందిన మొత్తం 7 మంది లబ్ధిదారులకు గాను 2 లక్షల 18 వేల 5 వందల విలువ గల చెక్కులను లబ్ధిదారులకు అందజేయడం జరిగింది. ఈ రోజు చెక్కులు అందుకొన్న వారి పూర్తి వివరాలు :1.చిన్న హైదరాబాద్ కు చెందిన వందనకి రూ.16,500లు, 2.శాంతి నగర్ కు చెందిన సంజీవ్ రెడ్డి కి రూ.15,000లు,3.శాంతి నగర్ కు చెందిన మొహమ్మద్ ముబ్బషీర్ కి రూ.36,000లు, 4.అర్యనగర్ కు చెందిన దశ్రత్ కి రూ.21,000లు, 5.పస్తపూర్ కు చెందిన మోగులప్పకి రూ.10,000లు, 6.వతన్ బాగ్ కు చెందిన లయిక్ కి రూ.60,000లు, 7.హెూతి కే కు చెందిన సతీష్ కి రూ.42,000లు యున్నారు. ఈ సందర్భంగా చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ఎమ్మెల్యే మాణిక్ రావు కు, స్థానిక బిఆర్ఎస్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ పట్టణ అధ్యక్షుడు మహమ్మద్ యాకూబ్, మాజీ కౌన్సిలర్ అబ్దుల్లా, సీనియర్ నాయకులు తులసిదాస్ గుప్తా, మహిళా నాయకురాలు ఉల్లిగడ్డ పద్మజ, పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు శివప్ప, అలీమ్, పాండు ముదిరాజ్, అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 9వ వార్డు అభివృద్ధికి కృషి

- కౌన్సిలర్ సవిత హనుమండ్లు




**వెలుతురు నారాయణఖేడ్ జనవరి 20 :**
నారాయణఖేడ్ పట్టణంలోని తొమ్మిదవ వార్డు అభివృద్ధిని ఎమ్మెల్యే సంజీవరెడ్డి సహకారంతో వేగవంతం చేస్తున్నామని వార్డ్ కౌన్సిలర్ సవిత హనుమాండ్లు అన్నారు. సోమవారం పట్టణంలో 9వ వార్డులో జరుగుతున్న సిసి రోడ్డు పనులు పరిశీలించి మాట్లాడారు. నారాయణఖేడ్ పట్టణంలో కొనసాగుతున్న సిసి రోడ్లలో 9 వ వార్డులో 50 లక్షలతో పూర్తిగా అన్ని వీధుల్లో కవర్ అయ్యేలా సిసి రోడ్ల నిర్మిస్తున్నామని చెప్పారు. అంతేకాకుండా ఈనెల 26 నుండి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న నాలుగు సంక్షేమ పథకాల్లో భాగంగా కొత్త రేషన్ కార్డులో దరఖాస్తులతో పాటు, రేషన్ కార్డులో కొత్త పేర్ల నమోదు కార్యక్రమాన్ని ఈనెల 23 తారీకున 9వ వార్డులో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇట్టి అవకాశాన్ని లబ్ధిదారులు వినియోగించుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# తిరుమలలో యధావిధిగా దర్శనాలు

- ఉత్తరద్వార దర్శనాలు ముగియడంతో నిత్య కౌంకర్యాలు

**తిరుమల,జనవరి20( వెలుతురు):**



శ్రీవారి ఆలయంలో సోమవారం నుంచి యధావిధిగా కౌంకర్యాలు, భక్తులకు దర్శనాలు ప్రారంభమయ్యాయి. ఆదివారం అర్ధరాత్రి వైకుంఠ ద్వారాలు మూతపడ్డాయి. పదిరోజుల పాటు టీటీడీ అధికారులు భక్తులకు వైకుంఠ ద్వార దర్శనం కల్పించారు. ఈ పది రోజుల్లో దాదాపు 6 లక్షల 83 వేల 304 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకుని.. ఉత్తరద్వార ప్రవేశం చేశారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఈ నెల పదో తేదీన వైకుంఠ ద్వారాలను తెరిచిన విషయం తెలిసిందే. గతేడాది తరహాలోనే పది రోజుల పాటు వైకుంఠ ద్వార దర్శనాలు కల్పించారు. చివరిగా ఆదివారం అర్ధరాత్రి ఏకాంతసేవతో వైకుంఠ ద్వారాలను మూసివేశారు. ఇక సోమవారం నుంచి యధావిధిగా శ్రీవారి దర్శనాలు ప్రారంభ మయ్యాయి. తిరిగి ఈ ఏడాది డిసెంబర్ 30వ తేదీన వైకుంఠ ఏకాదశి రావడంతో టీటీడీ అధికారులు భక్తులకు వైకుంఠ ద్వార దర్శనాలు కల్పించనున్నారు. కాగా ఆదివారం చివరి రోజు కావడంతో వైకుంఠ ద్వార దర్శనం చేసుకునేందుకు భక్తులు భారీగా తిరుమలకు తరలి వచ్చారు. కేవలం దర్శనం టికెట్లు, టోకెన్లు ఉన్న భక్తులకు మాత్రమే వైకుంఠ ద్వార దర్శనం కల్పించారు. ఈ మేరకు ముందుగానే భక్తులకు టోకెన్లు, టికెట్లను కూడా టీటీడీ అధికారులు జారీ చేశారు. గత తొమ్మిది రోజులుగా టోకెన్లు, టికెట్లు ఉన్న భక్తులకు మాత్రమే వైకుంఠ ద్వార దర్శనం టీటీడీ కల్పిస్తోంది. ఈ నేపథ్యంలో శని, ఆదివారాలకు సంబంధించి 50వేల టోకెన్లను టీటీడీ ముందస్తుగా జారీ చేసింది. అలాగే ఆన్‌లైన్‌లో 15 వేల ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లను కూడా జారీ చేసింది.ఆదివారంతో శ్రీవారి వైకుంఠ ద్వారా దర్శనం ముగియనుండటంతో తిరుమలలో అనూహ్యంగా భక్తుల రద్దీ పెరిగింది. ఈనెల 10 నుంచి 19 వరకు అంటే దాదాపు పది రోజుల పాటు శ్రీవారి ఆలయంలో భక్తులకు టీటీడీ వైకుంఠ ద్వార దర్శనం కల్పించింది. రోజుకు 70 వేల మందికి వైకుంఠ ద్వార దర్శనం కల్పించేందుకు టీటీడీ అధికారుల ఏర్పాట్లు చేశారు. మరోవైపు టీటీడీ ఉద్యోగులకు, వారి కుటుంబసభ్యులకు కూడా ఒక ఉద్యోగికి ఐదు ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లను జారీ చేశారు. అలిపిరి చెక్ పాయింట్ వద్ద కిలో మీటర్ల మేర వాహనాలు బారులు తీరాయి. భద్రతా సిబ్బంది కూడా తనిఖీలను వేగవంతం చేసి కార్లను తిరుమలకు పంపించారు.

# జనవరి 23న జహీరాబాద్ లో మెగా జాబ్ మేళా

- మాజీ మంత్రి ఫరిదోద్దీన్ జ్ఞాపకర్తం జాబ్ ఫెయిర్ -కెరీర్ ఎక్సపో 2025..
- రానున్న 100 కు పైగా కంపెనీల ప్రతినిధులు...
- ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకొండి..
- మహమ్మద్ తన్వీర్, మాజీ టిజిఐడిసి చైర్మన్ వెల్లడి...






**జహీరాబాద్ వెలుతురు జనవరి 20:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణములోని ఫ్రెండ్స్ ఫంక్షన్ హాలో ఈ నెల 23న జాబ్ ఫెయిర్ -కెరీర్ ఎక్సపో 2025 కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు టిజిఐడిసి మాజీ చైర్మన్, స్వర్గీయ మాజీ మంత్రి మొహమ్మద్ ఫరీదోద్దీన్ తనయుడు మహమ్మద్ తన్వీర్ విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మా నాన్న ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ మాజీ మంత్రి, ఎమ్మెల్సి స్వర్గీయ మహమ్మద్ ఫరిదోద్దీన్ జ్ఞాపకర్తం జహీరాబాద్ ప్రాంతపు నిరుద్యోగ యువతీ యువకులకు ఈ నెల 23న జాబ్ ఫెయిర్ – కెరీర్ ఎక్సపో 2025 కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా వివిధ రంగాలకు చెందిన 100 కు పైగా కంపెనీ లలో చదువుకున్న నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పన కల్పిస్తునట్లు వారు తెలిపారు. ఈ జాబ్ మేళా జనవరి 23న గురువారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని డెక్కన్ బ్లాస్టర్ ఛైర్మన్ మన్నాన్ ఖాన్ పర్యవేక్షణలో, ఏఐఎంఐఎం సీనియర్ నాయకుడు, సామాజిక కార్యకర్త మొహమ్మద్ ఇమ్రాన్ మొహియొద్దీన్ నేతృత్వంలో జరుపనున్నట్లు తెలిపారు. ఇందులో సుమారు వందకు పైగా కంపెనీలు పాల్గొంటారని అన్ని రకాల కంపెనీలు ఎక్కువగా పాల్గొంటున్నట్లు, యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తాయని బ్యాంకింగ్, ఫార్మా, వ్యవసాయం, అకౌంట్స్, ఇంజనీరింగ్, ఉపాధ్యాయ ఉద్యోగులు, అమ్మకాలు ఫార్మసిటీ లాంటి అన్ని ప్రొఫెషనల్ కోర్సులు లాజిస్టిక్ ఉద్యోగాలు ఎక్కువగా కంపెనీలు ఆఫర్ లెటర్స్ తో పాల్గొనబోతున్నాయని వివరించారు. ఈ అవకాశాన్ని జహీరాబాద్ చుట్టుపక్కల నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా వారు కోరారు. ఈ విలేకరుల సమావేశంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు మొహమ్మద్ ఖుత్బోద్దీన్, మోతి రామ్ నాయక్, ఎండి జహంగీర్ ఖురేషి, పి. రాములు నేత, ఎంఏ బాసిత్, ఇబ్రాయిల్ బాబీ, వినోద్ కుమార్, బాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ప్రియుడిని చంపిన ప్రియురాలికి ఉరిశిక్ష

- తిరువనంతపురం స్థానిక కోర్టు సంచలన తీర్పు
- ఆమె నేరాన్ని తక్కువగా చేయరాదని భావించిన కోర్టు

**తిరువనంతపురం,జనవరి20( వెలుతురు):**
కేరళ రాజధాని తిరువనంతపురం కోర్టు మరో కీలక తీర్పు వెల్లడించింది. ప్రియుడిని చంపిన కేసులో ప్రియురాలికి ఉరిశిక్ష విధిస్తూ సంచలన తీర్పు ఇచ్చింది. 2022లో కేరళలో విషం కలిపిన కూల్‌డ్రింక్ ఇచ్చి ప్రియుడు శరోన్ రాజ్‌ను ప్రియురాలు గ్రీష్మ చంపిన ఘటన సంచలన సృష్టించింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. పూర్తి ఆధారాలు సేకరించి కోర్టుకు సమర్పించారు. ఆధారాలను పరిశీలించిన తిరవనంతపురం కోర్టు.. గ్రీష్మకు ఉరిశిక్ష విధిస్తూ కోర్టు వెలువరించింది. అంతేకాదు.. శరోన్ రాజ్ ను చంపేందుకు గ్రీష్మకు సహకరించిన బంధువుకు మూడేళ్ల జైలు శిక్ష విధించింది. కేరళలో బాయ్‌ఫ్రెండ్‌ను 2022లో చంపిన గ్రీష్మ అనే యువతికి స్థానిక నెయ్యట్టింకర అదనపు జిల్లా సెషన్స్ కోర్టు మరణ శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది. ఈ కేసులో మూడవ నిందితుడు, ఆమెకు సహకరించిన ఆమె మేనమామ నిర్మలకుమారన్ నాయర్‌కు కోర్టు మూడు సంవత్సరాల కారాగార శిక్ష విధించింది. విద్యాపరమైన తన విజయాలు, గత నేర చరిత్ర లేకపోవడం, తన తల్లిదండ్రులకు ఏకైక కుమార్తెను కావడం వంటి కారణాలను పేర్కొని తనకు శిక్ష విధించడంలో కనికరం చూపాలని 24 ఏళ్ల దోషి కోర్టును అభ్యర్థించింది. అయితే, ఆమె క్రూర నేరానికి పాల్పడి, సాక్ష్యాలను చెరిపివేసి, దర్యాప్తును తప్పుదోవ పట్టించిందని, ఆమె వయస్సును పరిగణనలోకి తీసుకోలేమని కోర్టు తన 586 పేజీల తీర్పులో స్పష్టం చేసినట్లు ప్రాసిక్యూటర్ వెల్లడించారు. తనతో రిలేషన్‌షిప్ ముగించేందుకు శరణ్ రాజ్ (23) ఒప్పుకోలేదని పెస్టిసైడ్ కలిపిన డ్రింక్ తాగించి అతనిని గ్రీష్మ చంపేసింది. ఆ ఘాతుకం జరిగిన సమయానికి ఆమె వయస్సు 22 సంవత్సరాలు. ఇక ప్రాసిక్యూషన్ నేరాన్ని రుజువు చేయడానికి సందర్భోచిత, డిజిటల్, శాస్త్రీయ అంశాలపై ఆధారపడిందని కోర్టు పేర్కొన్నది. దోషి దశలవారీగా ఈ నేరం సాగించడానికి కుట్ర పన్నిందని, ఆమెకు నేర నేపథ్యం ఉందని, గతంలో ఆ యువకుని హత్యకు ప్రయత్నించిన ఆమె దర్యాప్తును తప్పుదోవ






పట్టించేందుకు అరెస్టు తరువాత తన ప్రాణం తీసుకునేందుకు ప్రయత్నించిందని కూడా కోర్టు పేర్కొన్నది. కాగా, ఇది అత్యంత అరుదైన కేసు అని, నిందితులకు ఉరిశిక్ష విధించాలని వాదించినట్లు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ విఎస్ వినీత్ కుమార్ మీడియాతో చెప్పారు. ఇది ఆదర్శప్రాయమైన ఒక తీర్పుగా ఆయన పేర్కొన్నారు. 2022లో గ్రీష్మ తన ప్రియుడు శరణ్ రాజ్‌కు పారాక్వాట్ అనే పెస్టిసైడ్ కలిపిన ఆయుర్వేద టానిక్‌తో విషం ఇచ్చింది. దానితో అతని శరీరంలోని పలు అవయవాలు విఫలం కావడంతో 11 రోజుల తరువాత అతను చనిపోయాడు. తమిళనాడుకు చెందిన ఆర్మీలో పని చేసే ఒక వ్యక్తితో తన పెళ్లి ఖాయం కావడంతో రాజ్‌తో తన అనుబంధాన్ని ముగించాలని ఆమె అనుకుంది. కానీ తమ సంబంధం ముగింపునకు అతను నిరాకరించడంతో హత్యకు గ్రీష్మ పథకం వేసింది. హతుడు శరణ్ రాజ్ తిరువనంతపురం జిల్లా పరశ్శల వాసి. హత్యతో సహా భారతీయ న్యాయ సంహితలోని వివిధ సెక్షన్ల కింద గ్రీష్మ దోషిగా తేలింది. ఆమె మేనమామ నిర్మలకుమారన్ నాయర్ సాక్ష్యాలను ధ్వంసం చేసిన కేసులో దోషిగా తేలాడు. అయితే, కస్టడీలోకి తీసుకున్న అతని తల్లి సాక్ష్యాధారాలు లేకపోవడంతో నిర్దోషిగా విడుదల అయింది. కేసు దర్యాప్తును పర్యవేక్షించిన అప్పటి ఎస్పి డి శిల్ప కోర్టు తీర్పును స్వాగతిస్తూ, పోలీస్ దర్యాప్తు బృందం సమష్టి కృషికి ఇది విజయం అని అన్నారు.

# ఏడాదిలో ఏం చేశావ్ రేవంత్ రెడ్డి?

- మరోమారు అసహనం వ్యక్తం చేసిన కెటిఆర్

**హైదరాబాద్,జనవరి20( వెలుతురు):**
ఈ ఏడాది కాలంలో రూ. లక్షా 40 వేల కోట్లు అప్పు చేసి ఏం పీకినవ్ రేవంత్ రెడ్డి..? అంటూ మరోమారు కెటిర్ తన అసహన భాషలో మాట్లాడారు. ఏడాదిలో ఏంచేశారని అడగడానికి ఆయన తన వల్గర్ లాంగ్వేజీలో ప్రశ్నించారు. ఒక కొత్త ఇటుక పెట్టినవా, ఒక కొత్త పైప్ లైన్ వేసినావా, ఒక కాలువ తవ్వినవా, ఒక కార్మికుడికి లాభం తెచ్చవా, ఒక ఆడబిడ్డకు రూ.2500 ఇచ్చావా, తులం బంగారం ఇచ్చవా..? ఏం పీకినవ్ సంవత్సరంలో అని రేవంత్ రెడ్డిని కేటీఆర్ నిలదీశారు. తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ కార్మిక విభాగం క్యాలెండర్ ఆవిష్కరణ సందర్భంగా కేటీఆర్ ప్రసంగించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చాలా హామీలు ఇచ్చింది.. హామీల అమలు కోసం నిలదీస్తే మీకు జీతాలు ఇచ్చుడే ఎక్కువ అని ఉద్యోగులను బెదిరిస్తున్నారు. కేసీఆర్ అప్పులపాలు చేసిపోయారు అని చెబుతుండ్రు. ఈ తప్పుడు ప్రచారాన్ని, పనికిమాలిన వెధవ ప్రచారాన్ని తిప్పికొట్టాల్సిన బాధ్యత మనపైనే ఉంది. వాళ్లు మాట్లాడే మాటలు పచ్చి బక్వాస్ మాటలు, బోగస్ మాటలు. ఎలా అంటే.. 2014లో రాష్ట్రం ఏర్పడినప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మనకు అప్పుజెప్పారు. మన రాష్ట్రం మీద ఉన్న అప్పు ఆనాడురూ. 72 వేల కోట్లు. తలసరి ఆదాయం రూ. లక్షా 14 వేలు. రూ. 369 కోట్లు రెవెన్యూ మిగులు ఉండే. మనం దిగిపోయినాడు.. తలసరి ఆదాయం రూ. 3 లక్షల 56 వేలకు తీసుకుపోయిండు కేసీఆర్. రెవెన్యూ మిగులు రూ. 5,944 కోట్లతో కాంగ్రెస్‌కు అప్పజెప్పాం. కేసీఆర్ సంపదను పెంచిండు. పాతబాకీలు కట్టుకుంటూ.. అన్ని సమస్యలను పరిష్కరించుకుంటూ.. చేసిన అప్పు మొత్తం 4 లక్షల 17 వేల కోట్లు. ఇది అప్పు కాదు పెట్టుబడి. అనేక ఇరిగేషన్ ప్రాజెక్టులను కట్టిండు.. కాళేశ్వరం, పాలమూర రంగారెడ్డి, సీతారామ, దామరచర్ల విద్యుత్ కేంద్రం, మెడికల్ కాలేజీలు, రైతు వేదికలు నిర్మించి సంపదను సృష్టించిండు. కేసీఆర్ మన భవిష్యత్ కోసం పెట్టుబడి పెట్టిండు అని కేటీఆర్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే హామీలన్నీ అమలు చేస్తామని భట్టి విక్రమార్కతో పాటు అందరూ మాట్లాడారు. కానీ చేసిందేమీ లేదు. రిటైర్ ఉద్యోగులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇస్తలేరు. డీఏలు పెండింగ్‌లో ఉన్నాయి. పీఆర్సీకి దిక్కు లేదు. ఎప్పుడైనా మనం ఆస్తులు, అప్పులు చూడాలి. ఒక్క ఏడాదిలో రేవంత్ రెడ్డి ఒక లక్షా 40 వేల కోట్ల అప్పు చేసిండు. కేసీఆరేమో ఏడాదికి రూ. 40 వేల కోట్లు అప్పు చేసి అభివృద్ధి కోసం ఖర్చు పెట్టిండు. కానీ రేవంత్ రెడ్డి చేసిన లక్షా 40 వేల కోట్ల అప్పుతో.. కొత్త ఇటుక పెట్టావా.. కాల్వ తవ్వినావా.. రైతుబంధు పెంచావా.. 2500 ఇచ్చావా.. తులం బంగారం ఇచ్చావా.. స్కూటీ ఇచ్చావా.. మరి ఏం పీకినవ్ వన్ ఇయర్‌లో.. మరి లక్షా 40 వేల కోట్లు ఎక్కడ పోయాయి రేవంత్ రెడ్డి..? కేసీఆర్ సాగునీరు తెచ్చిండు, మంచినీరు మంచిగా చేసిండు. రోడ్లు బాగు చేసిండు. సంక్షేమం చేసిండు. కార్మికులను కర్షకులను మంచిగా చూసుకుండు. ఒక్కటి మాత్రం రేవంత్ చేసిండు.. ఢిల్లీకి మూటలు మాత్రం జోరుగా మోసిండు.. వేల వేల కోట్లు పంపి కుర్చీని కాపాడుకుంటున్నాడు అని కేటీఆర్ ఆరోపించారు.

# యాదాద్రీశుడి ఆదాయం రూ.4,17,13,596



**యాదగిరిగుట్ట,జనవరి20( వెలుతురు):**
యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.4,17,13,596 లు చేకూరింది.గత 47 రోజులుగా వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు హుండీలలో సమర్పించిన నగదు, నగల కానుకల లెక్కింపు పర్వం దేవస్థానం చేపట్టింది. కొండకింద ఆధ్యాత్మిక వాడలోని శ్రీసత్య నారాయణస్వామి వ్రత మండపంలో సోమవారం చేపట్టిన లెక్కింపులో ఆలయ ఉద్యోగులు,కల్యాణకట్ట సిబ్బంది,అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు,భక్తులు,మహిళా సేవ సమాఖ్య బృందాలు పాల్గొన్నాయి. కొనసాగిన లెక్కింపులో నగదు రూ.4,17,13,596, మిశ్రమ బంగారం 229 గ్రాములు, వెండి7,050 గ్రాములు చేకూరినట్లు ఈవో భాస్కరరావు తెలిపారు. ఎస్పీఎఫ్ జవాన్లు,సీసీ కెమెరాల నిఘా మధ్య ఉదయం నుంచి సాయంత్రం వరకు లెక్కింపు పర్వం కొనసాగింది.

# బీడీ కార్మికుల ఆందోళన

**నిజామాబాద్,జనవరి20( వెలుతురు):**
బీడీ కార్మికులకు కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం జీవన భృతి నెలకు 4016 చెల్లించాలని కోరుతూ మెండోరాలో తెలంగాణ బీడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం బీడీ కార్మికులు ఆందోళన చేశారు. స్థానిక మార్కెట్ నుంచి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎంపీడివో కార్యాలయం ముందు ధర్నా చేశారు. ఎంపిడీవో వనజ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ముత్తేన్న మాట్లాడు తు ఎన్నిక ల సమయం లో హామీ ఇచ్చి ఏడాది గడిచిన జీవన భృతి ని పెంచలేదని అన్నారు. ?4016 కు పెంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే పిఎఫ్ కల్గి ఉన్న బీడీ కార్మికులందరికి జీవన భృతి చెల్లించాలని అన్నారు. కార్మిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని ధర్నా

**నిజామాబాద్,జనవరి20( వెలుతురు):**
మెండోరా మండలం సోన్ పేట్ లో గ్రామభివృద్ధి కమిటీ కి చెందిన ఎకరం భూమిని ప్రభాకర్ అనే వ్యక్తి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని పేర్కొంటూ గ్రామస్తులు సోమవారం మెండోరా తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. గ్రామానికి చెందాల్సిన భూమి గ్రామానికే కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ విషయం పై పోలీస్ స్టేషన్ లో సంప్రదించిన ఎస్ ఐ ప్రభాకర్ కు మద్దతుగా మాట్లాడుతున్నాడని విన్నవించారు. అక్రమ రిజిస్ట్రేషన్ పై చర్యలు తీసుకోని గ్రామభి వృద్ధి కమిటీ పేరా ఎకరం భూమి ని రిజిస్ట్రేషన్ చేయాలని కోరారు. తహసీల్దార్ సంతోష్ రెడ్డి కి వినతి పత్రం అందజేశారు. ఆర్మూర్ గ్రామీణ సీఐ శ్రీధర్ రెడ్డి, ముప్కాల్ ఎస్ఐ రజనీకాంత్ లు వచ్చి ఆందోళన చేస్తున్న వారితో మాట్లాడి ఆందోళన విరమించారు.

# కాంగ్రెస్ నేతల పల్లె నిద్ర

**నిజామాబాద్,జనవరి20( వెలుతురు):**
స్థానిక ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు ఆదేశాల మేరకు పోచారం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు వేముల కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం చేపడుతున్న పలు సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు, పథకాల గురించి గ్రామంలో కలియ తిరుగుతూ ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మేకల రమేష్ కళాలి అశోక్ గౌడ్ రాజు జగన్ రెడ్డి గ్రామ యూత్ అధ్యక్షుడు ఆసిఫ్ మూడ రాజు తదితరులు పాల్గొన్నారు

# మైనింగ్‌కు వ్యతిరేకంగా గ్రామస్థుల పోరుబాట


- మైలారం గ్రామంలో ఆందోళనకు దిగిన స్థానికులు
- ఆందోళనకారుల అరెస్ట్‌తో గ్రామంలో ఉద్రిక్తత

**నాగర్ కర్నూల్,జనవరి20( వెలుతురు):** నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూర్ మండలం మైలారంలో గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. 'మైనింగ్ వద్దు.. గుట్ట ముద్దు' అనే నినాదంతో రైతులు నేటి నుంచి రిలే నిరాహార దీక్షలకు సన్నద్ధమయ్యారు. దీంతో పోలీసులు ముందస్తుగా పలువురు రైతులు, స్థానికులను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తమ గ్రామానికి చెందిన రైతులను అక్రమంగా అరెస్ట్ చేశారని, వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ? గ్రామస్తులు పెద్ద ఎత్తున మహిళలు, రైతులు రోడ్డుపైకి చేరి నిరసనకు దిగారు. అరెస్టు చేసిన రైతులను వెంటనే విడుదల చేయకపోతే ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించారు. పురుగుల మందు డబ్బాతో రోడ్డుపై బైఠాయించి ఆందోళన ఉధృతం చేశారు. గ్రామంలోనికి పోలీసులను రానీయకుండా ముళ్లకంచెలు వేశారు. మైలారం గ్రామస్తులు చేపట్టిన ఈ ఆందోళనకు మద్దతు తెలపడానికి హైదరాబాద్ నుండి బయలుదేరి వచ్చిన పౌరహక్కుల నేతలు ప్రొఫెసర్ హరగోపాల్, గడ్డం లక్ష్మణ్ లను కూడా పోలీసులు వెల్దండ వద్ద అడ్డగించి అరెస్టు చేసి పీఎస్‌కు తరలించారు. దీంతో మైలారం గ్రామంలో ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. మైనింగ్ కు వ్యతిరేకంగా గ్రామస్తుల నిరసన కొనసాగుతోంది. అయితే రైతులు, గ్రామస్తులను పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో తీవ్ర ఉద్రిక్తతలకు దారి తీసింది. అక్రమ అరెస్టులు ఆపాలంటూ గ్రామస్తులు డిమాండ్ చేసారు. గ్రామానికి పోలీసులు రాకుండా కంచె ఏర్పాటు చేశారు. మైలారం గ్రామంలో ఉండే గుట్టపై క్వార్ట్జ్ ఖనిజాలను మైనింగ్ చేసేందుకు అనుమతులు లభించాయి. ఈ నేపథ్యంలో గత కొంత కాలంగా అక్కడ మైనింగ్ జరుగుతోంది. అనుమతుల నియమాలకు వ్యతిరేకంగా ఈ మైనింగ్ జరుగుతోందని పేర్కొంటూ గ్రామస్తులు గత కొద్ది రోజులుగా ఆందోళన చేపట్టారు. మైనింగ్‌పై ఎలాంటి ప్రజాభిప్రాయ సేకరణ జరగలేదని, గ్రామ తీర్మానం కూడా ఫేక్‌గా సృష్టించి మైనింగ్ జరుపుతున్నారని గ్రామస్తులు ఆందోళన చేస్తున్నారు. ఈ ఆందోళన నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షించేందుకు ఇటీవల హైదరాబాద్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. దీనికి ప్రొఫెసర్ హరగోపాల్ కూడా సంఘీభావం తెలిపారు. దీంతో సోమవారం నుంచి రిలే నిరాహారదీక్షలు చేపట్టాలని గ్రామ సభ తీర్మానించింది. దీనికి హరగోపాల్‌ను ముఖ్య అతిధిగా పిలిచారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు సోమవారం తెల్లవారుజాము 4 గంటలకు గ్రామానికి వచ్చి నిరసనకారులను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ క్రమంలో గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది. మహిళలు గ్రామంలో రోడ్డుకు అడ్డంగా కంచె వేసి పోలీసులు రావద్దంటూ మహిళలు పురుగుల మందు డబ్బాలు పట్టుకుని నిరసన చేపట్టారు. చాలా కాలంగా మైనింగ్‌కు వ్యతిరేకంగా గ్రామస్తులు పోరాటం చేస్తున్నా.. ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఈ క్రమంలో మైలారం గ్రామంలో సోమవారం తెల్లవారుజాము నుంచి ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది. మైలారం మైనింగ్ వెలికితీత కార్యక్రమాన్ని నిలిపివేయాలని గత మూడు నెలలుగా ఆ గ్రామస్తులు శాంతియుత పోరాటం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం మైలారం గ్రామ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో రైతులు, ప్రజలు రిలే నిరాహార దీక్షలకు పూనుకున్నారు. దీంతో పోలీసులు గ్రామానికి చేరుకొని మహిళలను, రైతులను అరెస్ట్ చేశారు. అలాగే అచ్చంపేటలో ఉన్న మైలారం గ్రామ పరిరక్షణ కమిటీ అధ్యక్షుడిని కూడా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీంతో గ్రామంలో ఉద్రిక్తత వాతావరణం నెలకొన్నది.



## రాహుల్‌గాంధీకి ఊరట

- క్రిమినల్ కేసు విచారణను నిలిపివేసిన సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ,జనవరి20( వెలుతురు):** కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి భారీ ఊరట లభించింది. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా, బీజేపీపై చేసిన వ్యాఖ్యలకు గానూ దాఖలైన పరువు నష్టం కేసులో ఆయనపై క్రిమినల్ విచారణను సుప్రీంకోర్టు నిలిపివేసింది. 2018 లో బెంగళూరులో జరిగిన విలేకరుల సమావేశంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షాపై రాహుల్ గాంధీ అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. అమిత్ షా ఓ హత్య కేసులో నిందితుడని రాహుల్ ఆరోపించారు. ఆ ఘటనలో రాహుల్‌పై క్రిమినల్ డిఫమేషన్ కేసు బుక్ చేశారు. రాహుల్ వ్యాఖ్యలపై బీజేపీ కార్యకర్త నవీన్ ఝా పరువునష్టం కేసు దాఖలు చేశారు. దీనిపై ట్రయల్ కోర్టు విచారణ జరిపింది. విచారణ సందర్భంగా వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలన్న రాహుల్ అభ్యర్థనను కోర్టు తిరస్కరించింది. దీంతో రాహుల్.. జార?ండ్ హైకోర్టును ఆశ్రయించారు. అయితే, ఈ విషయంలో జోక్యం చేసుకోవడానికి జార?ండ్ కోర్టు నిరాకరించింది. దీంతో రాహుల్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. క్రిమినల్ పరువునష్టం కేసుకు సంబంధించి ట్రయల్ కోర్టులో తనపై విచారణను రద్దు చేయాలని క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన దేశ అత్యున్నత న్యాయస్థానం.. ట్రయల్ కోర్టులో ఈ కేసు విచారణపై స్టే విధించింది. ఈ మేరకు జార్ఖండ్ ప్రభుత్వానికి, బీజేపీ నేత నవీన్ ఝాకు నోటీసులు జారీ చేసింది. నాలుగు వారాల్లోగా సమాధానాలు ఇవ్వాలని న్యాయస్థానం ఆదేశించింది.

## సైఫ్ కేసులో కోర్టులో ఇద్దరు లాయర్ల మధ్య గొడవ

**ముంబై,జనవరి20( వెలుతురు):**



బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్‌పై దాడి చేసిన వ్యక్తిని ముంబై పోలీసులు అరెస్టు చేశారు. ఆదివారం మధ్యాహ్నం ముంబై మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ముందు నిందితుడిని హాజరుపరిచారు. ఈ సందర్భంగా కోర్టులో నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. నిందితుడు షెహజాద్ మహమ్మద్ తరఫున వాదించేందుకు ఇద్దరు లాయర్లు గొడవపడ్డారు. దీంతో న్యాయమూర్తి వారిద్దరి మధ్య సయోధ్య కుదిర్చారు. ఇంతకూ ఏం చేశారంటే.. సైఫ్ అలీఖాన్‌పై కత్తితో దాడిచేసిన కేసులో నిందితుడు షరీఫుల్ ఇస్లాం షెహజాద్ మహమ్మద్ రోహిల్లా అమీన్ ఫకీర్ (30)ను ఆదివారం తెల్లవారుజామున అరెస్టు చేశారు. బంగ్లాదేశ్‌కు చెందిన అతడిని థాణేలో అటవీ ప్రాంతంలో ఉన్న ఒక లేబర్ క్యాంప్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. అక్కడి నుంచి ముంబైకి తరలించారు. అనంతరం భారీ బందోబస్తు నడుమ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరపరిచారు. నిందితుల బోనులో నిలబడి ఉన్న షెహజాద్‌ను.. పోలీసులపై ఏమైనా ఫిర్యాదులు ఉన్నాయా అంటూ న్యాయమూర్తి ప్రశ్నించారు. దానికి అతడు వ్యతిరేకంగా సమాధానం ఇచ్చాడు. ఈ క్రమంలో షెహజాద్ వద్దకు వెళ్లిన ఓ లాయరు.. అతని తరఫున తాను వాదిస్తానంటూ వకాలత్ పత్రంపై సంతకం చేస్తున్నాడు. అంతలోనే మరో న్యాయవాది కూడా నిందితుని వద్దకు వెళ్లి తాను వకాల్తా పుచ్చుకుంటానంటూ సంబంధిత పత్రాలపై సంతకం కోసం ప్రయత్నించాడు. దీంతో ఇద్దరు లాయర్లు కోర్టు హాలులోనే వాదులాడుకున్నారు. దీంతో జోక్యం చేసుకున్న న్యాయమూర్తి.. ఇద్దరూ ఒక టీమ్‌గా అతని తరఫున వాదనలు వినిపించవచ్చని తెలిపారు. దానికి ఆ ఇద్దరు లాయర్లు కూడా సమ్మతించారు. కాగా, నిందితుడికి న్యాయస్థానంలో హాజరుపర్చగా ఐదు రోజుల పోలీస్ కస్టడీకి పంపిందని, ఈ దాడి వెనుక అంతర్జాతీయంగా ఏదన్నా కుట్ర ఉందా అన్న కోణంలో కేసు దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు. బంగ్లాదేశ్ నుంచి ఐదు నెలల క్రితం భారత్‌కు అక్రమంగా వచ్చిన నిందితుడు తన పేరును విజయ్ దాస్‌గా మార్చుకున్నాడు. తర్వాత హౌస్ కీపింగ్ సహా చిన్నచిన్న పనులు చేసేవాడు. ఆ ఇల్లు నటుడు సైఫ్ అలీఖాన్‌దని తనకు తెలియదని, కేవలం చోరీ కోసమే అందులో ప్రవేశించినట్టు నిందితుడు తెలియజేసినట్టు పోలీస్ వర్గాలు వెల్లడించాయి.

## మైలారం గ్రామంలో ఉద్రిక్తత పరిస్థితులు

- పోలీసులు, గ్రామస్థులకు మధ్య వాగ్వాదం
- ప్రొఫెసర్ హరగోపాల్‌తోపాటు పలువురి అరెస్టు

**నాగర్‌కర్నూల్,జనవరి20( వెలుతురు):** నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూర్ మండలం మైలారం గ్రామంలో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. మైనింగ్‌కు వ్యతిరేకంగా గ్రామస్తులు పోలీసులను ఊరిలోకి రానీయకుండా అడ్డుకుంటున్నారు. ముళ్ల కంపలు వేసి మహిళలు, గ్రామస్తులు నిరసన తెలిపారు. పోలీసులకు, గ్రామస్తులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకోవడంతో ఓ మహిళ స్పృహతప్పి పడిపోయింది. మైలారం గ్రామస్తులకు, రైతులకు మద్దతు తెలిపినందుకు ప్రొఫెసర్ హరగోపాల్ పలు సంఘాల నాయకు లతో కలిసి వెళ్లగా పోలీసులు వారిని అక్రమంగా అరెస్ట్ చేశారు. కాగా, మాట తప్పి మోసం చేసిన కాంగ్రెస్ పార్టీపై అన్ని వర్గాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇన్నా ళ్ల ప్రభుత్వానికి, ప్రజలకు, ప్రతిపక్షాలకు వారధిలా ఉన్న హరగోపాల్ వంటి వ్యక్తులను అరెస్ట్ చేయడాన్ని యావత్ ప్రజానీకం ఖండించింది.



# కారణం లేకుండానే కేసులో ఇరికించారు

- ఆర్జీకర్ ఆస్పత్రి కేసులో దోషి సంజయ్ వాదన

**కోల్‌కతా,జనవరి20( వెలుతురు):** దేశవ్యాప్తంగా పెను సంచలనం రేపిన ఆర్జీకర్ ఆస్పత్రి వైద్యురాలిపై హత్యాచారం కేసులో దోషి సంజయ్ రాయ్ కోర్టులో తన వాదనను వినిపించాడు. శిక్ష ఖరారు చేయడానికి ముందు తన వాదనను వినిపించుకోవడానికి జడ్జి అతడికి అవకాశం కల్పించారు. తాను ఏ నేరం చేయలేదని ఈ సందర్భంగా సంజయ్ కోర్టుకు వెల్లడించాడు .'నేను ఈ నేరం చేయలేదు. ఏ కారణం లేకుండానే నన్ను ఇందులో ఇరికించారు. నన్ను దోషిగా నిలబెట్టారు. ఈ కేసుకు సంబంధించి పలు ఆధారాలు ధ్వంసమ య్యాయని నేను విన్నాను. నన్ను ఇరికించారో, లేదో దానిని బట్టి మీరే నిర్ణయించుకోండి. నాతో బలవంతంగా కాగితాలపై సంతకాలు చేయించారు. నేను అమాయకుడిని. నేను ఎప్పుడూ రుద్రాక్ష ధరిస్తాను. నేను నేరం చేసి ఉంటే.. అవి ఘటనాస్థలంలోనే ఊడిపోయి ఉండేవి. నాకు మాట్లాడే అవకాశం ఇవ్వలేదు. మీరు ఇవన్నీ చూశారని అన్నాడు. కోల్‌కతాలోని ఆర్జి కర్ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌లో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం చేసి హత్య చేసిన కేసులో దోషిగా తేలిన సంజయ్ రాయ్‌ను కోర్టు దోషిగా తేల్చింది. అయితే, సోమవారం సీల్దా కోర్టు అదనపు జిల్లా మరియు సెషన్స్ న్యాయమూర్తి అనిర్బన్ దాస్ మీరు ఏదైనా చెప్పాలనుకుంటున్నారా అని ప్రశ్నించగా.. సంజయ్ రాయ్ మాట్లాడుతూ.. వారు నన్ను బలవంతంగా పత్రాలపై సంతకం చేయించారు.. నేను నిర్దోషిని అని పేర్కొన్నాడు. ఏ కారణం లేకుండా నన్ను ఈ కేసులో ఇరికించారు అని నిందితుడు సంజయ్ రాయ్ పేర్కొన్నాడు. నేను ఎప్పుడూ రుద్రాక్ష గొలుసు ధరిస్తానని ముందే చెప్పాను.. నేను నేరం చేసి ఉంటే, అది నేరం జరిగిన ప్రదేశంలో విరిగిపోయేది.. పోలీసులు, సీబీఐ అధికారులు నన్ను మాట్లాడనివ్వలేదు.. చాలా కాగితాలపై నన్ను బలవంతంగా సంతకం చేయించుకున్నారు.. అలాగే, వాళ్లు నాకు మాట్లాడే అవకాశం ఇవ్వలేదని కోర్టులో సంజయ్ రాయ్ చెప్పాడు. ఇక, సంజయ్ రాయ్ స్టేట్‌మెంట్‌లకు జడ్జి అనిర్బన్ దాస్ సమాధానమిస్తూ.. నాతో మాట్లాడేందుకు దాదాపు సగం రోజుల సమయం ఇచ్చాను.. మూడు గంటల పాటు నీ మాటలు విన్నాను.. నా ముందు సమర్పించిన అభియోగాలు, సాక్ష్యాలు, పత్రాలు, సాక్షులు అన్నీ పరిశీలించా.. వాటి ఆధారంగానే నిన్ను దోషిగా గుర్తించాను అని పేర్కొన్నారు. మీరు ఇప్పటికే దోషిగా నిరూపించబడ్డారని వెల్లడించారు.



# జగన్ బెయిల్ రద్దు కేసులో కీలక పరిణామం

- ధర్మాసనాన్ని మార్చిన సుప్రీం కోర్టు
- విచారణ 27వ తేదీకి వాయిదా

**న్యూఢిల్లీ,జనవరి20( వెలుతురు):** జగన్ బెయిల్ రద్దుకు సంబంధించి ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామరాజు దాఖలు చేసిన పిటిషన్ పై సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. జగన్ కేసులను విచారిస్తున్న ధర్మాసనాన్ని సుప్రీంకోర్టు రిజిస్ట్రీ మరోసారి మార్చింది. ప్రస్తుతం జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ పంకజ్ మిత్తల్ ధర్మాసనం ఈ కేసులను విచారణ జరుపుతుంది. సుప్రీంకోర్టు నిర్ణయంతో జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ సతీశ్ చంద్రశర్మ ధర్మాసనానికి జగన్ కేసుల ట్రయల్ విచారణను మారింది. 12 ఏళ్లుగా ట్రయల్ అడుగు కూడా ముందుకు కదలలేదని డిప్యూటీ స్పీకర్ రఘురామరాజు తరఫు న్యాయవాది వాదించారు. అయితే సీబీఐ తరపు సీనియర్ న్యాయవాది మరో కేసులో వాదనలు వినిపిస్తున్నందున ఈ కేసుకు సంబంధించి వచ్చే వారానికి వాయిదా వేయాలని సీబీఐ తరపు న్యాయవాది కోరడంతో కేసు విచారణను వచ్చే సోమవారం చేపడతామని జస్టిస్ వీవీ నాగరత్న, జస్టిస్ సతీష్ చంద్ర శర్మ ధర్మాసనం తేల్చింది. పదేళ్లుగా కేసు విచారణ కొనసాగుతున్నప్పటికి ఒక్క డిశ్చార్జి అప్లికేషన్?కేడా డిస్పోస్? చేయలేదని రఘురామ తరుపు న్యాయవాది సుప్రీంకోర్టుకు తెలుపుతూ.. ఈ విషయంలో సీబీఐ, నిందితులు ఇద్దరు కుమ్మక్కయ్యారని అనుమానం వ్యక్తం చేశారు. డిశ్చార్జి పిటిషన్లపై వాదనలు విన్న ఐదుగురు జడ్జిలు ఎలాంటి నిర్ణయం వెల్లడించకుండానే ట్రాన్స్ఫర్? అవుతున్నారనని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఇంతవరకు ఒక్క డిశ్చార్జ్ అప్లికేషన్‌పై తుది నిర్ణయం వెలువడకపోవడంతో కుట్రకోణం దాగి ఉందనే సందేహంతో రఘురామ తరపు న్యాయవాది వాదనలు వినిపించారు. గత పదేళ్లుగా జగన్ బెయిల్‌పై ఉన్నారని.. సుప్రీం కోర్టు, హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినప్పటికీ ట్రయల్‌లో జాప్యం జరుగుతూనే ఉందని.. కేసులో వాదనలు వినిపించేందుకు కొంత సమయం కావాలని సీబీఐ తరపు న్యాయవాది కోరారు.



## కవితమ్మ డాక్టర్‌కు చూపించుకుంటే మంచిది

- పసుపుబోర్డు వ్యాఖ్యలపై రఘునందన్ రావు సెటైర్లు

**సంగారెడ్డి,జనవరి20( వెలుతురు):**



పసుపు బోర్డు తమ వల్లే వచ్చిందన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితపై బీజేపీ ఎంపీ రఘునందన్ రావు సెటైర్లు వేశారు. కవిత మంచి డాక్టర్ కు చూపెట్టుకుని తర్వాత మాట్లాడాలని సూచించారు. జైల్లో ఉన్నప్పుడు కవిత ఆరోగ్యం బాగోలేదని వార్తలు వచ్చాయి... చెల్లె కవిత ఇప్పటికి ఆస్పత్రుల చుట్టూ తిరుగుతుంది... మంచి డాక్టర్ కి చూపిస్తే ఆమె ఆరోగ్యం బాగుపడుతుంది. ఆ తర్వాత ప్రెస్ మీట్ పెడితే బాగుంటుందని రఘునందన్ రావు అన్నారు. పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు కేటీఆర్ కి రైతులు ఎందుకు గుర్తుకు రాలేదని రఘునందన్ రావు ప్రశ్నించారు. ఎర్రవల్లి ఫామ్ హౌస్ చుట్టూ ఉన్న గ్రామాల్లో రైతులు ఆత్మహత్య చేసుకున్నప్పుడు కేటీఆర్ ఎందుకు స్పందించలేదు. అధికారం పోయాక రైతులపై కేటీఆర్ కి ప్రేమ పెరిగి రైతు ధర్నాలు చేస్తున్నాడని విమర్శలు చేశారు. కాంగ్రెస్ పార్టీ హయాం లోనే అంబేద్కర్ కి అవమానం జరిగింది. కాంగ్రెస్ ఐదున్నర దశాబ్దాలు అధికారంలో ఉండి ఏనాడూ అంబేద్కర్ ని గౌరవించలేదు.కేవలం అంబేద్కర్ జయంతి, వర్ధంతులు తప్ప కాంగ్రెస్ పార్టీ చేసింది ఏమి లేదు. 1950 లో నామినేటెడ్ ప్రధానిగా ఉన్నప్పుడే జవహర్ లాల్ నెహ్రూ రాజ్యాంగానికి తూట్లు పొడిచారు. రెండోసారి ప్రధానిగా ఇందిరాగాంధీ ఎమ్జ్గం÷న్సీ తీసుకువచ్చి రాజ్యాంగాన్ని తుంగలో తొక్కారని రఘునందన్ రావు విమర్శించారు.

## రోడ్డుప్రమాదంలో ఇద్దరు హైదరాబాదీల మృతి

**తిరుపతి,జనవరి20( వెలుతురు):** తిరుపతి జిల్లా రేణిగుంట-కడప ప్రధాన రహదారిలో రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. తిరుమల శ్రీవారి దర్శించుకుని హైదరాబాద్ వెళు తుండగా ప్రమాదం జరిగింది. రేణిగుంట-కడప ప్రధాన రహదారిలోని కుక్కల దొడ్డి వద్ద ప్రైవేట్ బస్సును కారు ఢీకొనడంతో ఈ ఘటన సంభవించింది. కారులో ప్రయాణిస్తున్న భార్యాభర్తలిద్దరూ అక్కడకక్కడే మృతి చెందారు. హైదరాబాద్ లోని పటాన్ చెరువుకు చెందిన సందీప్ (45) అంజలీదేవి(40)గా పోలీసులు గుర్తించారు. విషయం తెలుసుకున్న రేణిగుంట ఎస్ఐ అరుణ్ కుమార్ రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని, మృతదేహాలను ఆసుపత్రికి తరలిస్తున్నారు.



# ఓటు దీటైన ఆయుధం

*'బుల్లెట్ కంటే బ్యాలెట్ శక్తివంతమైనది' అంటారు అబ్రహాం లింకన్. ఓటు ప్రజాస్వామ్యానికి పునాది. దేశ, రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయించే సాధనం. ప్రజల భవిష్యత్తును నిర్ణయించే శక్తిమంతమైన ఆయుధం. ఉన్నతమైన పాలకులను ఎన్నుకునేందుకు రాజ్యాంగం (ఆర్టికల్ 326) మనకు కల్పించినదీ ఓటు హక్కు. డబ్బు, మద్యం, ఇతర ప్రలోభాలకు లొంగని ఓటు నిజమైన ప్రజాస్వామ్యాన్నిస్తుంది. ఓటుకు కుల, మత, ప్రాంత, లింగ, జాతి, భాష అనే భేదం తగదు. ఇంతటి మహెూన్నతమైన ఓటు ఎందుకు నిరుపయోగమవుతోంది? ఈ అవగాహనే ప్రజల్లో, ముఖ్యంగా యువతలో కలిగించాలనేది 'జాతీయ ఓటర్ల దినోత్సవం' ఉద్దేశ్యం.*



ఓటు విలువ తెలియజేసి, వారి హక్కును సద్వినియోగపరుచుకునే అవగాహన కల్పించేందుకు ప్రతి ఏటా జనవరి 25న జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. ఈ సందర్భంగా ప్రత్యేక కథనం.

'యువ ఓటర్ల సాధికారత, భవిష్యత్తు' పై దృష్టి పెట్టాలి అనేది ఈ సంవత్సరం థీమ్. యువత వారి ఓటు విలువను అర్థంచేసుకుని గుర్తించాలని.. వారి ఓటు వినియోగించుకోవటంలో ప్రజాస్వామ్యయుతంగా వ్యవహరించేందుకు ప్రోత్సహించాలనేది ఈ థీమ్ ఉద్దేశ్యం.

మొట్టమొదట మన దేశంలో 2011 జనవరి 25న ఓటర్ల దినోత్సవాన్ని జరుపుకున్నాం. అసలు ఓటు అంటే ఏమిటి.. ఎందుకు వెయ్యాలి.. దానివలన ఉపయోగమేమిటి అనే విషయాలు ఎంతమందికి తెలుసు? 'ఓటు విలువనూ తెలుసుకోండయ్యా / పూట తిండికీ లొంగవద్దయ్యా' లాంటి పాటలు విని ఆనందిస్తామే కానీ ఆచరిస్తున్నామా..? కనీసంగా ఆలోచిస్తున్నామా? మన అలసత్వం వల్లనే ప్రజాస్వామిక విలువలు దిగజారిపోతున్నాయన్నది నిజం. కొన్ని దశాబ్దాలుగా ఓటు అమ్మకపు సరకుగా మారిపోయింది. లాంఛన ప్రాయంగా మొదలైన అవినీతి.. లంచాల రూపుదాల్చింది. గుట్టుచప్పుడు కాకుండా గూట్లో పెట్టి వెళ్ళే స్థాయి నుంచి, ఓటుకింత అని లెక్కగట్టి బహిరంగంగా ఓటరు చేతికి ఇచ్చే స్థాయికి దిగజారింది.

నిర్మాణంలో నిర్దిష్టత..: ఓటు శక్తిమంతమైనదని చెప్పుకోవడమే కానీ సామాన్యునికి దాని లోతుపాతుల అవగాహన లేదు. దాంతో ఎన్నికల్లో అనేక అవకతవకలు జరుగుతున్నాయి. వాస్తవానికి ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్స్ వేసేటప్పుడే సెక్యూరిటీ డిపాజిట్ పే చేస్తారు. అప్పుడే అభ్యర్థి ఆదాయం, ఆస్తులు, అప్పులు, ఎడ్యుకేషన్ క్వాలిఫికేషన్స్, క్రిమినల్ కేసుల వివరాలతో కూడిన అఫిడవిట్ కూడా సబ్‌మిట్ చేయాలి. ఈ వివరాలన్నీ ప్రజలకు తెలిసేలా పబ్లిక్ డొమైన్స్‌లో ఉంచాలి. ఇవన్నీ తెలిసినప్పుడే వివేకంతో సరైన అభ్యర్థిని ఎన్నుకునే అవకాశం ఉంటుంది ప్రజలకు. ఒకవేళ ప్రతి ఒక్కరికీ అలా తెలుసుకునే సౌలభ్యం లేకపోతే https://affidavit.eci.gov.in అనే వెబ్‌సైట్‌లో వారి వివరాలు చూడవచ్చు. నేటి పరిస్థితుల్లో ఈ నిబంధనలన్నీ సరిగా అమలు జరిగేలా యువత నడుం బిగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

డెమోక్రసీ ఇన్ యాక్షన్..: ఓటు వేశామంటే అధికారికంగా చట్టబద్ధమైన మన పనులు నిర్వహించాల్సిన బాధ్యత ఎన్నికైన వారికి ఉందని మనం గ్రహించాలి. ఎవరి ఓటు వారి వాయిస్ కావాలి. అది ధీటుగా ఉండాలేగానీ మొరటుగా ఉండకూడదు. కానీ రానురాను ఇంగితం మరచి.. గద్దెనెక్కించిన ప్రజల బాధలను విడిచి.. ఒకరి మీద ఒకరు అసభ్యకరంగా దూషించుకుంటున్న అప్రజాస్వామ్యాన్ని ప్రతిసారీ చూస్తున్నాం. బ్యాలెట్ బాక్సుల సమయంలో బలమైన వర్గం వచ్చి ప్రజలపై దౌర్జన్యం చేసి, వారికి అనుకూలమైన పార్టీకి ఓటు వేసేవారు. వీటిని అధిగమించాలనే ఉద్దేశ్యంతోనే 1982లో ఇవిఎం (ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్)లు, వివిపాట్‌లు ప్రవేశించాయి. ఇవిఎం ఓట్లను స్టోర్ చేసి, లెక్కిస్తుంది. ఓటును సరిగా వేశామా లేదా అని మనం నిర్ధారించుకునేందుకు వివిపాట్ (ఓటర్ వెరిఫైబుల్ పేపర్ ఆడిట్ ట్రయల్) లు సహకరిస్తాయి.

ఏది కూడదో అవే చేతలు..: ఇంత పకడ్బందీగా ఉన్న ఎన్నికల నిర్మాణం అమలులో భ్రమలే మిగిలాయి. ఏది కూడదో అవన్నీ సజావుగా జరిగిపోతున్నాయి. వాస్తవానికి ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు (అప్పటికి అధికారంలో ఉన్నవారు కూడా) ప్రభుత్వ వాహనాలు, వస్తువులు ఉపయోగించకూడదు. ప్రభుత్వ ఖర్చుతో ప్రకటనలు, ప్రచారాలు చేయకూడదు. ఎలక్షన్ కోడ్ రిలీజ్ అయిన తర్వాత పథకాలు, ప్రాజెక్టులను ప్రకటించకూడదు. ఆర్థికపరమైన తాయిలాలు ఇవ్వకూడదు. అతిక్రమించిన వారికి ఎలక్షన్ కమిషన్ షోకాజ్ నోటీసులు ఇవ్వటం, తొలగించటం లాంటివి చేసే అవకాశం ఉంది. ఎలక్షన్ కోడ్ అమలులో ఉన్నప్పుడు రూ. 50,000 లకు మించి నగదు గానీ, రూ 10,000లకు పైగా విలువైన వస్తువులుగానీ సంబంధిత డాక్యుమెంట్స్ లేకుండా ప్రయాణీకుల దగ్గర ఉండకూడదు. ఇవన్నీ సక్రమంగా ఉండేలా చూసే బాధ్యత ఎలక్షన్ కమిషన్‌దే.

సంక్షేమాల సంక్షోభం..: సంక్షేమ పథకాల ఊదరగొట్టుతనం అంతకంతకూ పెచ్చరిల్లుతోంది. అలాంటప్పుడు చూస్తూ ఊరుకోవటం మన అవివేకం కాదా? ప్రజలు నిలదీయాలి.. సంక్షేమాల సంక్షోభాన్ని తిప్పికొట్టాలి! అంతేకాదు మన అభిప్రాయాలు సోషల్‌మీడియాలో పోస్టుల రూపంలోనే కాక ఎలక్షన్ కమిషన్ తీసుకొచ్చిన 'సీ విజిల్' యాప్ ద్వారానూ పరిష్కరించుకోవచ్చు. అభ్యర్థి నియమాన్ని ఉల్లంఘించినప్పుడు పౌరులు ఎవరైనా సరే ఫొటోగానీ, వీడియోగానీ తీసి ఈ యాప్ ద్వారా ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేయొచ్చు. ఫిర్యాదు ఇచ్చిన వారి వివరాలు గోప్యంగానే ఉంటాయి.

సద్వినియోగ పరుచుకుందాం..: ఓటు వేసే రోజు ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు సెలవు ప్రకటిస్తాయి. ఓటు వేయడం మనందరి బాధ్యత. ఎన్నికల సంఘం 85 ఏళ్ళ కన్నా ఎక్కువ వయసున్న వారికి, వికలాంగులకు ఇంటి నుండే ఓటు వేసే అవకాశం కల్పించింది. దీనికోసం ఫారమ్ 12డి ని పూర్తి చేసి, ఎన్నికల సంఘానికి సబ్‌మిట్ చేయాలి. పోలింగ్ ఆఫీసర్, పోలీస్, ఫొటోగ్రాఫర్, ఇద్దరు అధికారుల టీమ్ ఇంటికి వచ్చి, ఓటు వేయించి డాక్యుమెంటేషన్ పూర్తిచేయాల్సి ఉంటుంది. విధి నిర్వహణ సరిగా లేకనే అనేకచోట్ల పెద్దవారిని యువకులు, పోలీసులు చేతులపై మోసుకెళ్ళటం చూస్తున్నాం.

వేలిమీది చుక్క.. వేగుచుక్క..: ఓటు వేసేటప్పుడు బ్యాలెట్ బాక్స్ దగ్గరకు వెళ్ళే ముందు ఓటరు ఎడమ చేతి చూపుడు వేలిపై ఇండెలిబుల్ ఇంకుతో గుర్తుపెడతారు. వెండి నైట్రేట్‌తో తయారైన ఇంకు అది. దాదాపు రెండు రోజుల వరకు చెరగదు. ఓటు ఒక్కసారి మాత్రమే వేయాలనేందుకు ఇండికేషన్ ఈ చూపుడు వేలిపై సూచిక. ఓటును దుర్వినియోగపరిచేవారిని గుర్తించేందుకే ఆ ఇండెక్స్ ఇండికేషన్. అందరం మన ఓటును సరిగా వినియోగించుకుందాం.

ఇసి వైఖరి..!: మన దేశం గణతంత్ర దేశంగా మారడానికి ఒక్కరోజు ముందు అంటే 1950, జనవరి 25న (ఎలక్షన్ కమిషన్) ఎన్నికల సంఘం ఏర్పాటైంది. రాజ్యాంగంలోని నిబంధనల ప్రకారం ఏర్పడిందే ఇసి. ఇది ప్రభుత్వ నియంత్రణకు లోబడాల్సిన అవసరం లేని స్వతంత్ర వ్యవస్థ. నిష్పక్షపాతంగా, స్వేచ్ఛగా ఎన్నికలను నిర్వహించాల్సిన బాధ్యత కమిషనుకుంది. కేంద్ర, రాష్ట్ర పరిధుల్లో పార్లమెంటు, అసెంబ్లీ, ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్ ఎన్నికలు కమిషనే నిర్వహిస్తుంది. మున్సిపాలిటీ, జిల్లా పరిషత్, గ్రామ పంచాయితీ ఎన్నికలను రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్వహిస్తుంది. దేశంలో 543 నియోజకవర్గాలు ఉన్నాయి. ఒక్కో పార్లమెంటు నియోజకవర్గానికి ఒక ఎంపి, రాష్ట్రంలోని ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గాలకి ఒక్కో ఎంఎల్ఏ ప్రజల చేత ఎన్నుకోబడతారు. చదువురాని వాళ్ళు కూడా గుర్తుపట్టేందుకు వీలుగా ప్రతిపార్టీకి ఎన్నికల గుర్తులు కేటాయిస్తారు. మొదట ఓటరు వయోపరిమితి 21 సంవత్సరాలుండేది. దీనిని 1989లో 61వ రాజ్యాంగ సవరణ ద్వారా 18 ఏళ్లకు తగ్గించారు. ఎన్నికల నిర్వహణ అప్పట్లో బ్యాలెట్ బాక్సుల ద్వారా.. ప్రస్తుతం ఇవిఎంల ద్వారా జరుగుతోంది. అయితే ఈ ఏడున్నర దశాబ్దాల కాలంలో ఎన్నికల ప్రక్రియలో అనేక సామాజిక, సాంకేతిక మార్పులు చోటు చేసుకున్నాయి. బ్యాలెట్ బాక్సుల ఓటింగ్ నుంచి ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల దశ కొనసాగుతోంది.

## హామీలు అమలు చేతకాక నిరసనలు అడ్డుకోవడం సిగ్గుచేటు - జగదీశ్‌రెడ్డి



**హైదరాబాద్,జనవరి20( వెలుతురు):**
రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి పాలన చేతకాక, ఇచ్చిన హామీలను నెరవేర్చలేక ప్రజల నిరసనను అడ్డుకుంటున్నారని సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ సర్కార్ రైతులకు ఇచ్చిన ఎన్నికల హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నల్లగొండలో బీఆర్‌ఎస్ పార్టీ తలపెట్టిన రైతు మహాధర్నాకు పోలీసులు అనుమతి నిరాకరించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రజాస్వామ్యంలో ప్రజల పక్షాన పని చేయటం పార్టీల హక్కు అని తెలిపారు. తెలంగాణలో అప్రకటిత ఎమర్జెన్సీ పరిస్థితులు కనిపిస్తున్నాయన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ ఏ కార్యక్రమం తీసుకున్నదని ప్రభుత్వం అడ్డుకుంటున్నదని ఆరోపించారు.కేటీఆర్ ఏ కార్యక్రమం చేపట్టినా రేవంత్ రెడ్డికి ఎందుకు వణుకు పుడుతుందని ప్రశ్నించారు. నీళ్లు లేక పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. కండ్లముందే పంటలు ఎండిపోతుంటే రైతులు పంట చేలకు నిప్పు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులను మోసం చేసినందుకు బీఆర్‌ఎస్ పార్టీ రైతు దీక్షలు రాష్ట్ర వ్యాప్తంగా చేస్తుంది. రేపు నల్గొండలో సభ నిర్వహిస్తామంటే ఈ రోజు పోలీసులు అనుమతి నిరాకరించారు. చేసిన వాగ్దానాలు అమలు చేయాలని ప్రజాస్వామ్యయుతంగా పోరాడుతుంటే అనుమతులు నిరాకరించడం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. పోలీసుల తీరును తప్పు పడుతూ కోర్టుకు వెళ్లైనా ధర్నా చేపడుతామని స్పష్టం చేశారు. గతంలో కూడా కుంటి సాకులు చెప్పి అనుమతులు నిరాకరిస్తే కోర్టుకు వెళ్లి మరీ శాంతియుతంగా ధర్నా చేపట్టిన విషయాన్ని గుర్తు చేశారు. కేటీఆర్ ఎక్కడికి వెళ్లినా శాంతియుతంగానే ప్రజలు కూడా నిరసన కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా, ఎంత అడ్డుకున్నా రేపటి దీక్ష కొనసాగుతుందని స్పష్టం చేశారు.

## మళ్లీ తెలంగాణలో పడిపోతున్న ఉష్ణోగ్రతలు



**హైదరాబాద్,జనవరి20( వెలుతురు):**
తెలంగాణ వ్యాప్తంగా చల్లని గాలులు వీస్తున్నాయి. పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కే పరిమితం అయ్యాయి. చలి విపరీతంగా ఉండడంతో ఆయా ప్రాంతాల ప్రజలు వణికిపోతున్నారు. వృద్ధులు, చిన్న పిల్లలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలు ప్రాంతాల్లో పొగమంచు కూడా దట్టంగా కురుస్తోంది. దీంతో వాహనదారులు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు వారం రోజుల తర్వాత సోమవారం ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కే పరిమితం అయ్యాయి. హైదరాబాద్ నగర శివార్లతో పాటు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం ఉదయం వరకు నగర శివార్లలోని మొయినాబాద్‌లో 9.4 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదు కాగా, కుమ్రం భీం ఆసిఫాబాద్, ఆదిలాబాద్, సంగారెడ్డి, నిర్మల్ జిల్లాల్లో పలు చోట్ల 6.5 డిగ్రీల నుంచి 9 డిగ్రీల సెల్సియస్ మధ్య ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. రాబోయే మూడు రోజుల పాటు పలు ప్రాంతాల్లో ఈ ఉష్ణోగ్రతలు కొనసాగే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. 5 నుంచి 10 డిగ్రీల సెల్సియస్ మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. ఈ మూడు రోజుల్లో పొద్దున్నే పొగమంచు దట్టంగా కురిసే అవకాశం ఉందని, వాహనదారులు జాగ్రత్తలు పాటించాలని అధికారులు సూచించారు.

## జగిత్యాల ప్రభుత్వ దవాఖానాలో అమానవీయ సంఘటన

- **చావు బతుకుల్లో ఉన్న వ్యక్తిని పట్టించుకోని వైద్యులు**

**జగిత్యాల,జనవరి20( వెలుతురు):**
జగిత్యాల జిల్లా ప్రభుత్వ దవాఖానాలో అమానవీయ సంఘటన చోటు చేసుకుంది. ప్రాణం పోయాల్సిన వైద్యులే పట్టనట్లుగా వ్యవహరించారు. బెడ్ పై నుంచి కిందపడి ఓ రోగి చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నా.. ఎంతమందిని పిలిచినా ఎవరు స్పందించలేదు. గంటకు పైగా భూమయ్య బెడ్ కిందే పడిపోయి నరకయాతన అనుభవించాడు. నేను చచ్చిపోతున్న పట్టించుకోవాలని రోదించినా దవాఖాన సిబ్బందిలోని ఏ ఒక్కరి హృదయాన్ని కదిలించలేక పోయింది. ఆయన ఆర్తనాదం అరణ్య రోదనగానే మిగిలిపోయింది. కాగా, బీఆర్‌ఎస్ హయాంలో ఓ వెలుగు వెలిగిన ప్రభుత్వ దవాఖానులు నేడు పట్టించుకునే నాథుడే లేడని ప్రజలు చర్చించుకుంటున్నారు. వైద్య సిబ్బంది నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



## కాలిఫోర్నియా కార్చిచ్చు ఘాటైన కవురు వాసన

**హైదరాబాద్,జనవరి20( వెలుతురు):**
కాలిఫోర్నియా గాలిలో బలంగా వ్యాపిస్తోన్న ఘాటైన కవురు వాసన. అంతులేని కార్చిచ్చుల వల్ల పెరుగుతున్న ఆందోళన.. కేవలం క్షణికమైన విపత్తు కాదు. భవిష్యత్‌ను కలవరపెట్టే అంశం. కాలిఫోర్నియా, లాస్‌ఏంజెల్స్‌లో ప్రకృతి దృశ్యం మండుతున్న నారింజ, బూడిద రంగులతో కూడిన భయంకరమైన వస్త్రం కప్పినట్లుగా కనిపిస్తోంది. ఇళ్లు పొగమంచు శిథిలాలుగా మారాయి. పర్యావరణం నాశనమైంది. ఆర్థిక నష్టం, నిరాశ్రయ కుటుంబాల భావోద్వేగం వారి జీవితాలను మార్చలేనంతగా కమ్మేసింది. గత కొన్ని దశాబ్దాలుగా కార్చిచ్చులు, భూకంపాలు వంటి విపత్తులకు మానవులు కూడా సమాన బాధ్యులే. లాస్ ఏంజెల్స్‌లో రగిలిన కార్చిచ్చు.. చెట్టు పుట్టను కబళించడమే కాదు, ఈ ప్రాంతంలోని అత్యంత ఖరీదైన ఇళ్లను బూడిద కుప్పలుగా మార్చింది. 16 మంది మృతి చెందగా, 70 వేల మందికి పైగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఈ కార్చిచ్చు మానవ ఆరోగ్యంపై దీర్ఘకాలిక ప్రభావం చూపే అవకాశం ఉందని, వ్యాధి నిరోధక శక్తిపై దాడి చేయడమే కాకుండా శ్వాస సంబంధ వ్యాధులను, ఇన్ఫెక్షన్లను వ్యాప్తి చేస్తుందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

కాలిఫోర్నియా, లాస్‌ఏంజెల్స్‌లో సంభవించిన కార్చిచ్చు ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. శాస్త్రవేత్తలను సైతం నిర్ఘాంతపరుస్తోంది. మంటలు ఇంత వేగంగా వ్యాపించడం మునుపెన్నడూ చూడలేదని, వాతావరణ పరిస్థితులే దీనికి కారణమని అగ్నిమాపకాధికారులు చెబుతున్నారు. మానవ తప్పిదాల వల్ల మున్ముందు ఇలాంటి విపత్తుల ముప్పు మరింత పెరుగుతుందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 'ఈ కార్చిచ్చు ఒక్క అమెరికాకే పరిమితమైంది కాదు. నేడు ప్రపంచమంతా ఈ ముప్పు ముంగిట వుంది' అని తేల్చి చెబుతున్నారు. భారత్‌లోనూ కార్చిచ్చుల బెడద క్రమంగా పెరుగుతోంది. హిమాలయాల జీవవైవిధ్యానికి అడవీ మంటలు ముప్పుగా పరిణమిస్తాయని ఆందోళన చెందుతోంది. ఉత్తర భారతంలోని అడవుల్లో ఇటీవల పెరుగుతున్న అగ్నిప్రమాదాలే దీనికి కారణం. 36 శాతం మేరకు అడవులు దావాలనాల బారిన పడుతున్నాయి. చిత్తడి ప్రాంతాల్లోనూ వాటి విజృంభణ సర్వసాధారణమైంది.

ఈ ఏడాది తొలిరోజునే కులులోని తాండి గ్రామాన్ని భీకర అగ్నిప్రమాదం బూడిద కుప్పగా మార్చింది. ఈ దృశ్యానికి చలించిన సిమ్లాకు చెందిన యువ రచయిత సౌరభ్ చౌహాన్.. 'నిశ్శబ్దం తన గీతాన్ని అల్లిన కొండల దగ్గర/ క్రూరమైన మంట మసకబారింది/ శీతాకాలపు పట్టులో, అక్కడ మంచు పట్టుకుంటుంది/ కలలు కాలిపోయాయి, హృదయాలు చల్లగా మారాయి/ అగ్ని గర్జించింది, దాని నాలుక దయలేనిది/ ఏ ఆశను వదలని మృగం/ ఇళ్లు కూలిపోయాయి, రాయి నుండి ధూళి వరకు/ మండుతున్న గాలులకు జ్ఞాపకాలు కోల్పోయాయి' అంటాడు భావోద్వేగంతో...



ముఖ్యంగా పర్యావరణ మార్పుల వల్ల సంభవించే వేడి, పొడి వాతావరణ పరిస్థితులే కార్చిచ్చు వేగంగా వ్యాప్తి చెందడానికి కారణమౌతుంది. దీనివల్ల ఆ ప్రాంత జీవవైవిధ్యం దెబ్బతింటోంది. మొక్కలతోపాటు జంతుజాలానికి, సూక్ష్మజీవులు, క్రిమికీటకాలు, ఉభయచరాలు, సరీసృప జాతుల మనుగడకు ముప్పు వాటిల్లుతోంది. గడ్డి, ఇతర మొక్క జాతులు కాలిపోతున్నాయి. మరోవైపు మనుషుల ఆరోగ్యంపైనా కార్చిచ్చు తీవ్ర ప్రభావం చూపుతోంది. దట్టమైన పొగ అస్థిరమైన కర్బన సమ్మేళనాలు, ఓజోన్, విష వాయువులు, సూక్ష్మజీవులు కలిసి వుంటాయి. ఇవి శ్వాసకోశ ఇన్ఫెక్షన్లతో పాటు ఆస్తమాను కలిగించవచ్చని పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. పొడి నేలల్లో ఉండే కోక్సిడియోయిడ్స్ ఇమ్మిటిస్, కోక్సిడియోయిడ్స్ పోసాడాసి వంటి బ్యాక్టీరియా.. దుమ్ము, పొగతో మనుషుల్లోకి చొరబడతాయి. ఇవి జ్వరం, ఫ్లూ, ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్ కలిగిస్తాయని కాలిఫోర్నియాలో వైల్డ్‌ల్యాండ్ అగ్నిమాపక సిబ్బందిపై జరిపిన ఓ అధ్యయనం వెల్లడించింది. ఈ కార్చిచ్చులను నిలువరించాలంటే.. పర్యావరణ మార్పులకు కారణమౌతోన్న శిలాజ ఇంధనాల వాడకాన్ని తగ్గించాలి. వాతావరణ మార్పులను నిలువరించేందుకు, పర్యావరణాన్ని సంరక్షించేందుకు ప్రపంచ దేశాలన్నీ కలిసికట్టుగా కృషిచేయాలి. కార్చిచ్చుల వల్ల నాశనమైన అడవులను పునరుద్ధరించడంపై దృష్టి సారించాలి.

## శబరిమల అయ్యప్పస్వామి ఆలయం మూసివేత

**శబరిమల,జనవరి20( వెలుతురు):**
కేరళలోని శబరిమల అయ్యప్ప ఆలయంలో మండలపూజ, మకర విళక్కు వార్షిక పూజలు వైభవంగా ముగిశాయి. దీంతో సోమవారం ఉదయం ఆలయాన్ని మూసివేసినట్లు ట్రావెన్‌కోర్ దేవస్వమ్ బోర్డు అధికారులు వెల్లడించారు. పందలం రాజకుటుంబ ప్రతినిధి త్రికేత్తనాల్ రాజరాజ వర్మ అయ్యప్ప దర్శనం చేసుకున్న తర్వాత సోమవారం ఉదయం 6.30 గంటలకు ఆలయాన్ని మూసివేశామని పేర్కొన్నారు. ఈ సీజన్‌లో 53 లక్షల మందికిపైగా భక్తులు అయ్యప్ప స్వామివారిని దర్శించుకున్నారని తెలిపారు. ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. రెండు నెలల పాటు జరిగే మండల-మకర విళక్కు వార్షిక పూజల కోసం నవంబర్ 15న అయ్యప్ప ఆలయాన్ని పూజారులు తెరిచారు. మండల పూజ అనంతరం డిసెంబర్ 26న గుడిని మూసివేశారు. 41 రోజులపాటు సాగిన పూజల్లో లక్షలాది మంది భక్తులు పాల్గొన్నారు. నాలుగు రోజుల విరామం తర్వాత డిసెంబర్ 30న సాయంత్రం 4 గంటలకు మళ్లీ ఆలయాన్ని తెరిచారు. ఈ సీజన్‌లో అయ్యప్ప ఆలయానికి భక్తులు పోటెత్తారు. రోజుకు లక్షలాది మంది భక్తులు అయ్యప్పను దర్శించుకున్నారు. మొత్తం 53 లక్షల మందికిపైగా భక్తులు అయ్యప్ప దర్శనం చేసుకున్నట్లు టీడీపీ తెలిపింది. సోమవారం ఉదయం 5 గంటలకు ఆలయాన్ని తెరిచి, తూర్పు మండపంలో గణపతి హెూమం చేశామని. ఆ తర్వాత మేల్శాంతి అరుణ్ కుమార్ నంబూద్రి అయ్యప్ప విగ్రహానికి విభూతాభిషేకం నిర్వహించి, దానిని రుద్రాక్షలతో అలంకరించారని వెల్లడించారు. 'హరివరాసనం' పారాయణం తర్వాత మేల్శాంతి ఆలయ దీపాలను ఆర్పి గర్భగుడిని అధికారికంగా మూసివేశామని చెప్పారు. అనంతరం ఆలయ తాళాలను రాజకుటుంబ సభ్యుడికి అప్పగించామని తెలిపారు.

# మంచి బిజినెస్‌మన్ బిగ్‌బీ

## రూ. 31 కోట్లకు కొని రూ. 83 కోట్లకు ఫ్లాట్ అమ్మిన్ అబితాబ్‌బచ్చన్

బాలీవుడ్ స్టార్ యాక్టర్ అమితాబ్ బచ్చన్ ఓ వైపు సినిమాలు చేస్తూనే.. మరోవైపు బిజినెస్‌లో కూడా తనదైన స్ట్రాటజీతో ముందుకెళ్తూ టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తుంటారని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. తాజాగా తన అపార్ట్‌మెంట్‌ను భారీ మొత్తానికి అమ్మి మంచి లాభాలు గడించి వార్తల్లో నిలిచాడు బిగ్ బీ. బిగ్ బీ గత జనవరిలో ముంబైలోని ఓషివారా ప్రాంతంలోని తన అపార్ట్‌మెంట్‌ను విక్రయించగా.. తన పెట్టుబడిలో భారీగా అప్రిషియేషన్ పొందారు. అమితాబ్ బచ్చన్ 2021లో ఈ డూప్లెక్స్ అపార్ట్‌మెంట్‌ను రూ.31 కోట్లకు కొనుగోలు చేసి.. ఇప్పుడు దాన్ని రూ.83 కోట్లకు విక్రయించాడు. ముంబైలోని రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ సంస్థ స్క్వేర్ యార్డ్స్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ రిజిస్ట్రేషన్ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ పత్రాలతో సహా ఈ వివరాలను పొందుపరిచింది. ఓషివారా పశ్చిమ ముంబై సమీపంలోని లోఖండ్‌వాలా కాంప్లెక్స్ లొకేషన్‌లో ఈ అపార్ట్‌మెంట్ ఉంది. ది అట్లాంటిస్ ఏరియాలో క్రిస్టల్ గ్రూప్ అభివృద్ధి చేసిన ఈ రెసిడెన్షియల్ ప్రాజెక్ట్‌లో 4,5,6 బీహెచ్‌కే అపార్ట్‌మెంట్స్ ఉన్నాయి. ఐజీఆర్ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్స్ ప్రకారం ఈ డూప్లెక్స్ అపార్ట్‌మెంట్‌ను 5,704 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించారు. ఇందులో 5,185.62 చదరపు అడుగులు కార్పెట్ ఏరియా, ఆరు కారు పార్కింగ్ స్థలాన్ని కలిగి ఉంది. ఈ అపార్ట్‌మెంట్ లావాదేవీలకు స్టాంప్ డ్యూటీ పేమెంట్ రూ.4.98 కోట్లుకాగా.. రిజిస్ట్రేషన్ ఛార్జీలు రూ.30 వేలుగా పేర్కొన్నారు. డాక్యుమెంట్స్ ప్రకారం బిగ్ బీ ఈ అపార్ట్‌మెంట్‌ను 2021 ఏప్రిల్‌లో రూ.31 కోట్లకు కొనుగోలు చేయగా.. ప్రస్తుతం రూ.83 కోట్లకు అమ్మారు. అంటే రూ.52 కోట్లు లాభం అన్నమాట. ఇది విలువపరంగా 168 శాతం గణనీయంగా పెరిగింది. బిగ్ బీ ఈ అపార్ట్‌మెంట్‌ను నటి కృతిసనన్‌కు నవంబర్ 2021లో అద్దెకు కూడా ఇచ్చాడని తెలిసిందే. మొత్తానికి తనదైన స్ట్రాటజీతో లాభాలు గడిస్తూ బిజినెస్ ప్లాన్స్‌లో చాలా మందికి స్ఫూర్తిగా నిలుస్తున్నాడు బిగ్ బీ.



# మీనాక్షికి ఫస్ట్ క్రష్ అతడే

సంక్రాంతికి వస్తున్నాం' సినిమాతో హిట్టు అందుకొని వరుస హిట్లతో ఇండస్ట్రీలో దూసుకుపోతున్న స్టార్ హీరోయిన్ మీనాక్షి చౌదరి. అయితే తను ఇండస్ట్రీలో ఎంట్రీ ఇచినప్పటి నుండి ఎవరో ఒక హీరోతో డేటింగ్ లో ఉందని, ఇంకో హీరోతో పెళ్లి అని ఏదో ఒక పుకార్లు వినిపిస్తూనే ఉన్నాయి. ఇంతకీ మీనాక్షి లైఫ్ లో లవ్ ఉందా? ఆమెకు ఎవరంటే ఇష్టం? వీటిపై ఆమె ఏమన్నారు అంటే.. తనపై వస్తున్న రూమర్స్ ని ఖండిస్తూనే మీనాక్షి తన లవ్ లైఫ్ గురించి చెప్పేసింది. తాజాగా జరిగిన ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ.. " ప్రస్తుతం అయితే నా ఫోకస్ అంత సినిమాలపైనే ఉంది. స్కూల్ లేదా కాలేజీలో స్టూడెంట్స్ కు కచ్చితంగా టీచర్లపై క్రష్ ఉంటుంది. నాక్కూడా అలాంటిదే ఉంది. నేను 9వ తరగతి చదువుతున్నప్పుడు నా క్లాస్ లో ఓ టీచర్ అంటే చాలా ఇష్టం. టోటల్ క్లాస్ మొత్తం అతడ్ని ఇష్టపడేది. నాకైతే ఇంకా ఎక్కువ ఇష్టం. అదే నా ఫస్ట్ క్రష్ అండ్ లవ్." అంటూ తన ఫస్ట్ క్రష్ ని రివీల్ చేసింది. మాటలు కొనసాగిస్తూ.. " నాకు ఆ తర్వాత మళ్లీ ప్రేమలో పడేంత టైమ్ దొరకలేదు. మరీ ముఖ్యంగా మెడిసిన్ చదువు వల్ల ప్రేమకు పూర్తిగా దూరమయ్యాను. కాలేజీ లైఫ్ లో ఎలాంటి లవ్ లేదు. చదువుతోనే సరిపోయింది. పైగా మెడికల్ కాలేజీ కదా ఒత్తిడి చాలా ఎక్కువగా ఉండేది. ఎప్పుడూ చదువే. ఇండస్ట్రీకి వచ్చిన తర్వాత కూడా నేను ఎవరి ప్రేమలో పడలేదు. కెరీర్ పై మాత్రమే ఫోకస్ పెడుతూ వస్తున్నాను. ఇప్పుడిప్పుడే సెటిల్ అవుతున్నకాబట్టి ప్రేమ, పెళ్ళికి టైమ్ ఉంది. ప్రస్తుతానికి సినిమాలే నా లోకం" అంటూ ఫుల్ క్లారిటీ ఇచ్చేసింది.



# షూటింగ్‌లో ప్రమాదం

## అర్జున్‌కపూర్, రకుల్‌ప్రీతిసింగ్ భర్తకు గాయాలు

బాలీవుడ్ నటుడు అర్జున్ కపూర్‌కి నిర్మాత రకుల్ ప్రీత్ సింగ్ భర్త జాకీ భగ్నానీకి షూటింగ్‌లో ప్రమాదం జరిగింది. ఈ విషయాన్ని నిర్మాణ సంస్థ ఆలస్యంగా వెల్లడించింది. అర్జున్ కపూర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'మేరే హస్బెండ్‌కి బీవీ'. ఈ సినిమాను రకుల్ ప్రీత్ సింగ్ భర్త జాకీ భగ్నానీ నిర్మిస్తున్నాడు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ జరుపుకుంటుండగా.. షూటింగ్‌లో సెట్ పైకప్పు కూలిపోవడంతో ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో అర్జున్ కపూర్‌తో పాటు నిర్మాత జాకీ భగ్నానీకి గాయలు అయినట్లు సమాచారం. ఈ ప్రమాదంపై ఫెడరేషన్ ఆఫ్ వెస్ట్రన్ ఇండియా సినీ ఎంప్లాయిస్ అధ్యక్షుడు తివారీ స్పందిస్తూ షూటింగ్‌లో సెట్ పైకప్పు కూలిపోవడంతో ఈ ఘటన జరిగినట్లు వెల్లడించాడు. ఈ ఘటన జరిగి రెండు రోజులు అయ్యిందని.. అదృష్టవశాత్తూ, ఎవరూ తీవ్రంగా గాయపడలేదని తెలిపాడు. భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు జరగకుండా చూసుకుంటామని భద్రతా కారణాల దృష్ట్యా ప్రస్తుతం ఆ ప్రదేశంలో షూటింగ్‌ను నిలిపివేసినట్లు తివారీ తెలిపాడు.





# భారీ అంచనాలు పెంచుతున్న తండేల్



టాలీవుడ్ యాక్టర్ అక్కినేని నాగచైతన్య -సాయిపల్లవి కాంబోలో సినిమా వస్తుందంటే క్రేజ్ ఎలా ఉంటుందో తెలిసిందే. ఇప్పటికే లవ్ స్టోరీతో బాక్సాఫీస్‌ను షేక్ చేసిన ఈ స్టార్ యాక్టర్లు ప్రస్తుతం తండేల్‌లో నటిస్తున్నారు. రొమాంటిక్ డ్రామా నేపథ్యంలో వస్తోన్న ఈ చిత్రం చందూ మొండేటి డైరెక్షన్‌లో తెరకెక్కుతోంది. ఈ చిత్రాన్ని ఫిబ్రవరి 7న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేస్తున్నట్టు మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు. ఈ మూవీ తెలుగు, తమిళం, హిందీ భాషల్లో విడుదల కానుంది. అయితే తాజాగా మరో క్రేజీ నిర్ణయాన్ని తీసుకున్నారన్న వార్త ఒకటి నెట్టింట హల్ చల్ చేస్తోంది. తండేల్ మలయాళం వెర్షన్‌ను రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తుండగా.. త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన కూడా ఉండబోతుందట. సాయిపల్లవికి మలయాళంలో సూపర్ క్రేజ్ ఉంటుందని తెలిసిందే. ఒకవేళ ఇదే నిజమైతే తండేల్ సినిమాకు మాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద వసూళ్లు పెరుగుతాయనడంలో ఎలాంటి సందేహం లేదు.

తండేల్ నుంచి ఇప్పటికే లాంచ్ చేసిన బుజ్జి తల్లి సాంగ్‌కు మంచి స్పందన వస్తోంది. 2018లో గుజరాత్ జరిగిన వాస్తవ ఘటనల ఆధారంగా వస్తోన్న తండేల్ చిత్రాన్ని గీతాఆర్ట్స్‌పై అల్లు అరవింద్ సమర్పణలో బన్నీవాసు నిర్మిస్తున్నారు. ఈ మూవీకి అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. తండేల్ నాగచైతన్య-చందూ మొండేటి కాంబోలో రాబోతున్న మూడో సినిమా కావడంతో ఈ ప్రాజెక్టుపై అంచనాలు భారీగానే ఉన్నాయి.



# బిగ్‌బాస్ షోకు గుడ్‌బై చెప్పిన కన్నడ హీరో

హాలీవుడ్ షో బిగ్ బ్రదర్‌కి మాతృకగా వచ్చిన బుల్లితెర రియాలిటీ షో బిగ్ బాస్‌కి ఇండియా అంతటా ఫ్యాన్స్ ఉన్న సంగతి తెలిసిందే. తెలుగు, హిందీలోనే కాకుండా తమిళం, కన్నడలోను ఈ షో టాప్ రియాలిటీ షోలలో ఒకటిగా నిలిచింది. అయితే కన్నడ బిగ్ బాస్ షోకి సంబంధించి హెూస్ట్‌గా చేస్తున్న స్టార్ హీరో కిచ్చా సుదీప్ కీలక నిర్ణయం తీసుకున్నాడు. ఈ షోకి తాను ఇకపై హెూస్ట్‌గా చేయనని వెల్లడించాడు. ఈ సందర్భంగా ఎమోషనల్ పోస్ట్ పెట్టాడు. కన్నడలో బిగ్‌బాస్ షో స్టార్ట్ అయినప్పటి నుంచి హెూస్ట్‌గా కిచ్చా సుదీప్ ఉన్నాడు. 2013లో ఈ షో స్టార్ట్ అవ్వగా.. ఇప్పటివరకు 11 సీజన్‌లు విజయవంతంగా కంప్లీట్ చేసుకుంది. ఇందులో 11 సీజన్‌లకు సుదీప్ హెూస్ట్‌గా వ్యవహరించి ప్రేక్షకులను అలరించాడు. అయితే ఈ స్టార్ నటుడు తాజాగా కన్నడ బిగ్ బాస్‌కి దూరమవుతున్నట్లు ప్రకటించాడు. "గత 11 సీజన్ల నుంచి నేను ఇష్టంతో పాటు ఎంజాయ్ చేసిన కార్యక్రమం బిగ్‌బాస్. ఈ షోకి హెూస్ట్‌గా చేసిన నాపై మీరు చూపించిన ప్రేమకి ధన్యవాదాలు. త్వరలో జరుగనున్న ఫినాలేతో బిగ్ బాస్‌తో నా ప్రయాణం ముగుస్తుంది. వ్యాఖ్యాతగా నా శక్తి మేరకు మీ అందరినీ ఎంటర్‌టైన్ చేశానని ఆశిస్తున్నాను. ఇది మరపురాని ప్రయాణం, నాకు సాధ్యమైనంతవరకూ ఉన్నతంగా దీనిని కొనసాగించా. నాకు ఈ అవకాశాన్ని ఇచ్చిన కలర్స్ కన్నడ టీవీకి వారికి ధన్యవాదాలు. ప్రేమతో మీ కే" అంటూ రాసుకోచ్చాడు సుదీప్.

# నా భార్యకు నా పాస్‌వర్డ్‌లు అన్నీ తెలుసు

## - వెంకటేష్


టాలీవుడ్‌లో సక్సెస్ రేట్ ఎక్కువగా ఉన్న సీనియర్ హీరోల్లో టాప్‌లో ఉంటాడు వెంకటేశ్. తనదైన మ్యానరిజంతో వినోదాన్ని పంచే వెంకీ ఇటీవలే సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చాడు. అనిల్ రావిపూడి డైరెక్షన్‌లో తెరకెక్కిన ఈ మూవీలో ఐశ్వర్యా రాజేశ్, మీనాక్షి చౌదరి ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటించాడు. భార్య, మాజీ ప్రియురాలి మధ్య చిక్కుకున్న భర్త పాత్రలో నటించాడు వెంకటేశ్. ఇందులో వెంకీ చెప్పే డైలాగ్స్ చాలా మంది ఫ్యామిలీ ఆడియెన్స్‌కు బాగా కనెక్ట్ అవుతున్నాయి. తాజాగా ఓ ఇంటర్వ్యూలో వెంకటేశ్‌ను ఆసక్తికర ప్రశ్న అడిగింది యాంకర్ సుమ. మీ భార్యకు మీ మొబైల్ పాస్‌వర్డ్‌లు, ఇతర పాస్‌వర్డ్‌లు తెలుసా..? అని వెంకీని అడిగింది సుమ. దీనికి వెంకీ ఏ మాత్రం తడబడకుండా నా భార్యకు నా మొబైల్‌తోపాటు అన్ని ఖాతాలో పాస్‌వర్డ్‌లు తెలుసు. ఈ విషయంలో నేను చాలా పారదర్శకంగా



ఉంటా. ఆమెకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చేశానంటూ చెప్పుకొచ్చాడు. ఇప్పుడీ కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. సంక్రాంతి కానుకగా జనవరి 14న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదలైన ఈ చిత్రం సంక్రాంతి బ్లాక్ బస్టర్‌గా నిలిచింది. కేవలం 6 రోజుల్లోనే రూ.100 కోట్ల షేర్‌ను రాబట్టి వెంకీ కెరీర్‌లో నయా బెంచ్ మార్క్ క్రియేట్ చేసింది. అనిల్ రావిపూడి కెరీర్ మైల్ స్టోన్ సినిమాగా నిలవడమే కాకుండా.. కెరీర్‌లో సెకండ్ హయ్యెస్ట్ గ్రాసింగ్ ఫిల్మ్‌గా నిలిచింది. ఈ చిత్రంలో నరేశ్, పాపులర్ మరాఠీ యాక్టర్, యానిమల్ ఫేం ఉపేంద్ర లిమాయే, కోలీవుడ్ నటుడు వీటీవీ గణేశ్ కీలక పాత్రలు పోషించారు. ఈ మూవీని దిల్ రాజు సమర్పణలో శిరీష్ నిర్మించారు.

# టాలీవుడ్‌లో విషాదం.. విజయ రంగరాజు మృతి

తెలుగు సినీ పరిశ్రమలో విషాదం చోటు చేసుకుంది. ప్రముఖ నటుడు విజయ రంగరాజు మృతి చెందారు. కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన చెన్నైలోని ఓ ప్రయివేట్ హాస్పిటల్ లో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. అకస్మాత్తుగా ఆయనకు గుండెపోటు రావడంతో రంగరాజు మరణించినట్లు సమాచారం. ఇక రంగరాజు మరణవార్త తెలుసుకున్న పలువురు సినీ ప్రముఖులు ఆయనకు సంతాపం ప్రకటిస్తున్నారు.



విజయ రంగరాజు అసలు పేరు రాజ్ కుమార్. ఆయన చెన్నైలో రంగస్థల కళాకారునిగా అనేక నాటకాలలో నటించారు. ఆ తర్వాత సినీ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చారు. బాపు దర్శకత్వంలో వచ్చిన 'సీతా కళ్యాణం' రంగరాజుకు నటుడిగా మొదటి సినిమా. అయితే అతడికి గుర్తింపు లభించింది మాత్రం బాలకృష్ణ హీరోగా వచ్చిన భైరవ ద్వీపం సినిమా ద్వారా. ఈ సినిమాలో అతడి నటనకు మంచి మర్కులు పడడమే కాకుండా సినిమాల్లో ఫుల్ బిజీగా మారిపోయాడు. నటుడిగా, ఫైట్ మాస్టర్‌గా, ఫైటర్‌గా, విలన్‌గా అన్ని భాషల్లో కలుపుకుని దాదాపు ఐదు వేలకు పైగా సినిమాల్లో ఆయన పనిచేశారు. గోపీచంద్ నటించిన 'యజ్ఞం' సినిమాలో ఆయన విలన్‌గా నటించడం అతడి కెరీర్‌లో టర్నింగ్ పాయింట్ అని పలు ఇంటర్వ్యూలలో ఆయన చెప్పుకోచ్చాడు.

# 200 నకిలీ నోట్ల చెలామణి

- రద్దు చేయాలన్న ఆలోచన లేదన్న ఆర్బిఐ




**ముంబై,జనవరి20( వెలుతురు):**
ప్రస్తుతం మార్కెట్‌లో 500 మరియు 200 రూపాయల నోట్లు ఎక్కువగా చెలామణిలో ఉన్నాయి. దీనికి సంబంధించి రిజర్వ్ బ్యాంక్ కీలక ప్రకటన చేసింది. ఆర్‌బీఐ నోటిఫికేషన్ కూడా జారీ చేసింది. మార్కెట్లో నకిలీ 200 రూపాయల నోట్లు వస్తున్నాయని, నకిలీ నోట్లను అరికట్టేందుకు చర్యలు చేపడుతున్నామని ఆర్బీఐ తెలిపింది. కొందరు 200 రూపాయల నోట్లను రద్దు చేస్తున్నట్లు పుకార్లు సృష్టిస్తున్నారని, అలాంటిదేమి లేదని స్పష్టం చేసింది. ఇలాంటి వార్తలను ప్రజలు నమ్మవద్దని సూచించింది. 2000 రూపాయల నోట్లపై నిషేధం తర్వాత దేశంలో నకిలీ 200, 500 రూపాయల నోట్ల చెలామణి నిరంతరం పెరుగుతోందని ఆర్‌బిఐ తెలిపింది. ఇలాంటి పరిస్థితిని క్యాష్ చేసుకోవడానికి కేటుగాళ్లు రంగంలోకి దిగి నోట్లను రద్దు చేస్తున్నట్లు పుకార్లు సృష్టిస్తున్నారని ఆర్బీఐ తెలిపింది. లావాదేవీల సమయంలో ప్రజలు మరింత జాగ్రత్తగా ఉండాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా హెచ్చరించింది. ఇటీవల తెలంగాణలో 200 రూపాయల నోట్లకు కలర్ జిరాక్సులు తీయించి చలామణి చేస్తున్న ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

# అమెరికాలో హైదరాబాద్ యువకుడిపై కాల్పులు

- చైతన్యపురికి చెందిన యువకుడు మృతి

**హైదరాబాద్,జనవరి20( వెలుతురు):**
అమెరికాలో హైదరాబాద్ యువకుడిపై దుండగులు కాల్పులకు పాల్పడ్డారు. ఈ ఘటనలో చైతన్యపురికి చెందిన రవితేజ మృతి చెందాడు. అతని మరణ వార్త విని కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మాస్టర్స్ చదివేందుకు 2022లో రవితేజ అమెరికా వెళ్లినట్లు సమాచారం. దీనిపై ఇంకా వివరాలు తెలియాల్సి ఉంది.

# సీఎం రేవంత్ మాటలు కోటలు.. చేతలు గల్లీ కూడా దాటవు

- రాష్ట్రంలో కనీసం జీతాలు కూడా ఇవ్వలేని స్థితి : హరీశ్‌రావు



**హైదరాబాద్,జనవరి20( వెలుతురు):**
సీఎం రేవంత్‌రెడ్డి మాటలు కోటలు దాటుతాయని కానీ చేతలు మాత్రం గల్లీ కూడా దాటదని, ప్రతి నెలా మొదటి తారీఖున ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు చెల్లిస్తున్నామన్న సీఎం, మంత్రుల మాటలు నేతి బీరకాయలో నెయ్యిచందంగా మారాయని అనేకసార్లు రుజువయ్యాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులకే కాదు.. మహిళల హక్కులను కాపాడే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన మహిళా కమిషన్ సభ్యులకు గత సంవత్సర కాలం నుంచి రేవంత్ రెడ్డి ప్రభుత్వం జీతాలు ఇవ్వడం లేదని తాజాగా నా దృష్టికి వచ్చింది అని హరీశ్‌రావు గుర్తు చేశారు. ఈ ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో మహిళా కమిషన్‌కు రూ. 2 కోట్ల 42 లక్షలు కేటాయించినప్పటికీ విడుదల చేసింది రూ. 20 లక్షలకు మించి లేదు. న్యాయమూర్తులతో సమానంగా వ్యవహరించబడే మహిళా కమిషన్ సభ్యులకే జీతాలు చెల్లించలేక పోతే ఈ ప్రభుత్వం సామాన్య మహిళల హక్కులను ఏ విధంగా కాపాడుతుంది..? అని హరీశ్‌రావు ప్రశ్నించారు. వెంటనే మహిళా కమిషన్ సభ్యుల పెండింగ్ బకాయిలు విడుదల చేయాలని, ఇక నుంచి మొదటి తారీఖునే మహిళా కమిషన్ సభ్యులకు జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కోరుతున్నానని హరీశ్‌రావు తెలిపారు.


# రాజన్న సిరిసిల్ల జిల్లాలో చిరుతపులి కలకలం


- బర్రెపై దాడి.. ఆందోళన ప్రజలు

**రాజన్న సిరిసిల్ల,జనవరి20( వెలుతురు):**
రాజన్న సిరిసిల్ల జిల్లాలో చిరుత పులి కలకలం సృష్టిస్తోంది. ఓ బర్రెపై చిరుత దాడి చేసి చంపింది. చిరుత సంచారంతో స్థానిక రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. గంభీరావుపేట మండల పరిధిలోని ముస్తాఫానగర్ గ్రామ శివారులో రాసమల్ల రాజు అనే రైతుకు వ్యవసాయ పొలం ఉంది. అయితే పొలంలోనే పశువుల కోసం ఓ షెడ్‌ను నిర్మించాడు. అందులో బర్రెను కట్టేసి ఆదివారం రాత్రి ఇంటికి వచ్చాడు. ఇక సోమవారం తెల్లవారుజామున పొలం వద్దకు వెళ్లి చూడగా, బర్రె రక్తపు మడుగులో పడి ఉంది. ఆందోళనకు గురైన రాజు.. గ్రామస్తులను అప్రమత్తం చేశాడు. ఇక అతని పొలంలో పులి పాదముద్రలను గుర్తించారు. దీంతో అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. పులి పాదముద్రలను అధికారులు నిర్ధారించారు. అనంతరం రైతులను, స్థానికులను అధికారులు అప్రమత్తం చేశారు. చిరుత కదలికలపై రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

# మోడీకి మైనార్టీ...చంద్రబాబుకు మెజార్టీ

- బాబుకు కలసి వస్తున్న కూటమి ఏర్పాటు
- పురోగతిలో అమరావతి, విశాఖ స్టీల్, పోలవరం





**అమరావతి,జనవరి20( వెలుతురు):**
ఎన్‌డిఎలో భాగస్వామ్యం కావడం, మోడీ అత్తెసరు సీట్లతో గెలవడం ఎపి సిఎం చంద్రబాబుకు కలసి వస్తోంది. అయితే కొంతమేర ఎపి లభాపడుతుందనే చెప్పాలి. అమరావతి, పోలవరం, విశాఖ స్టీల్ ప్లాంట్ విషయాల్లో ఎపి సిఎం చంద్రబాబు ఆచితూచి అడుగు వేయడం వల్ల కలసివస్తోంది. చంద్రబాబు అవసరం ఉంద ఇకనుక మోడీ కూడా కిక్కురుమనకుండా ఉంటున్నారు. లేకుంటే మోడీ తన విశ్వరూపం చూపేవారు. ఇలా అన్ని రాష్ట్రాలకు మోడీ చేయూతను ఇస్తే ఆయా రాష్ట్రాలు అభివృద్ధి చెందగలవు. ఇక్కడ ఆయన తనకు అవసరమున్న మిత్రులకు మాత్రమే అండగా ఉండాలను కోవడం వల్ల మిగతా రాష్ట్రాల్లో వ్యతిరేకత రాగలదు. అయితే కేంద్రంతో చేయి కలిపి నడవడం వల్ల సత్ఫలితాలు వస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ నిలదొక్కుకుని బలపడాలంటే కేంద్ర సహకారం పూర్తిగా అవసరం. ఈ కారణంగానే ముఖ్యమంత్రి చంద్రబాబు పట్టువిడుపులతో వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. కేంద్రానికి బేషరతుగా మద్దతు ఇస్తున్నారు. ఫలితంగా రాజధాని అమరావతి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం గ్రాంట్ల రూపంలో ఆర్థిక సహాయం అందించడానికి ముందుకు వచ్చింది. తాజాగా విశాఖ ఉక్కు కర్మాగారాన్ని నిలబెట్టడానికి 11 వేల కోట్లకు పైగా ఆర్థిక ప్యాకేజీ ప్రకటించింది. పోలవరం ప్రాజెక్టు కూడా సజావుగా పూర్తికావడానికి అవసరమైన ఆర్థిక సహాయం చేయడానికి కేంద్రం ముందుకు వచ్చింది. ఇటీవలే కేంద్ర బృందంకూడా ఇక్కడ పర్యటించి ప్రాజెక్టు వివరాలు సేకరించింది. మొత్తంగా ఈ మూడు అంశాలకు సంబంధించి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉదారంగా వ్యవహరించారని చెప్పవచ్చు. కేంద్రంలో మోదీ సర్కార్ మూడవ పర్యాయం అధికారం చేపట్టడంలో తెలుగుదేశం పార్టీ మద్దతు కీలకం కావడం వల్ల మాత్రమే ఇది సాధ్యమయ్యిందని చెప్పాలి. లేకుంటే మోడీ ఈ మాత్రం కూడా చేసేవారు కాదు. విశాకను తెగనమ్మడానికి నిర్ణయించుకున్నా ..అనివార్యంగా ప్యాకేజీ ప్రకటించక తప్పలేదు. తనకు అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా చంద్రబాబు చాణక్యం ప్రదర్శిస్తున్నారు. గతంలో కేంద్రంతో విభేదించినందున ఏం జరిగిందో ఆయనకు తెలుసు. ఎన్‌డిఎతో విభేదించి బయటకు రావడం వల్ల ఎపిలో అధికారం పోయింది. తెలుగుదేశం పార్టీకి లోక్‌సభలో 16 మంది సభ్యులు ఉన్నారు. ఈ మాత్రం సంఖ్యా బలాన్ని సమకూర్చు కోవడం మోదీ ప్రభుత్వానికి కష్టం కాదు. ఈ వాస్తవాన్ని దృష్టిలో పెట్టుకునే చంద్రబాబు.. కేంద్ర ప్రభుత్వానికి తన విధేయతను ప్రకటిస్తూ..అనకువగా ఉంటున్నారు. ప్రస్తుతానికి చంద్రబాబు అవసరం ప్రధాని మోదీకి, మోదీ అవసరం చంద్రబాబుకు ఉంది. జనసేనాని, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు బీజేపీ పెద్దలతో సత్సంబంధాలు ఉన్నందున మూడు పార్టీల మధ్య సఖ్యత కూడా ఎపి పురోభివృద్ధికి తోడ్పడుతోంది. అందుకే ప్రైవేటీకరించాలనుకున్న విశాఖ ప్లాంట్ విసయంలో మోడీ మనసు మార్చుకున్నారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీకి భారీ ఆర్థిక ప్యాకేజీ ప్రకటించడం మోడీకి కూడా లాభించే విషయమే. రాజధాని అమరావతి నిర్మాణం కోసం కూడా కేంద్రం గత బడ్జెట్‌లో ఆర్థిక సాయం అందించింది. భవిష్యత్తులో అమరావతి కూడా హైదరాబాద్ స్థాయిలో కాకపోయినా గ్రీన్ సిటీగా అభివృద్ధి చెందితే ప్రభుత్వ ఆదాయం పెరుగుతుంది. మూడు రాజధానులు అంటూ మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి రాష్ట్రానికి చేసిన నష్టం కారణంగా ఎపి ఐదేళ్లు వెనకబడి పోయింది. అమరావతిని జగన్ పూర్తి చేసివుంటే ఆ ఖ్యాతి ఆయనకే దక్కేది. రాజధానిపై విషం చిమ్మిన పాపానికి జగన్ భారీ మూల్యం చెల్లించుకున్నారు. గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందాలన్నా, పేదలకు సంక్షేమం అందాలన్నా రాజధాని లాంటి అద్భుత నగరం ఉండాల్సిందే. అమరావతి నిర్మాణం కోసం ఖర్చు చేసే ప్రతి పైసా నుంచి ప్రభుత్వానికి 20 శాతం వరకు పన్నుల రూపంలో వెనక్కు వస్తోంది. మొత్తంగా విశాఖ పునరుద్ధరణ జరిగి లాభాల్లో ప్లాంట్ నడిచేలా చేయగలగాలి. అలాగే ఈ నాలుగున్నరేళ్ల కాలంఓ అమరావతిని పూర్తి చేయాలి. పోలవరం కూడా ఇదే సమయంలో పూర్తి కాగలగాలి. గత 14 ఏళ్లచంద్రబాబు పాలనకన్నా, ఈ ఐదేళ్ల పాలనే బాబుకు పరీక్ష. ఇవన్నీ చేయగలిగితనే ప్రజలు నమ్ముతారు.

# రాష్ట్రవ్యాప్తంగా కొత్త రేషన్ కార్డుల జారీ

- జంటనగరాల్లో చురుకుగా వెరిఫికేషన్ ప్రక్రియ
- కొత్త రేషన్ కార్డు కోసం 83వేల మంది దరఖాస్తు

**హైదరాబాద్,జనవరి20( వెలుతురు):**
తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా కొత్త రేషన్ కార్డుల జారీ పక్రియను వేగవంతం చేస్తోంది. ఇటీవల కొత్త రేషన్ కార్డుల జారీకి సంబంధించిన మార్గదర్శకాలను ప్రభుత్వం విడుదల చేసిన విషయం తెలిసిందే. ప్రత్యేకంగా హైదరాబాద్ నగరంలో కొత్త రేషన్ కార్డుల పక్రియను మరింత దృష్టిలో పెట్టుకుని, జీహెచ్ఎంసీ అధికారులు రంగంలోకి దిగారు. జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి నేతృత్వంలో 150 డివిజన్లలో దరఖాస్తుదారుల అర్హతల పరిశీలన ప్రారంభమైంది. జీహెచ్ఎంసీ పరిధిలో రేషన్ కార్డుల వెరిఫికేషన్ కొనసాగుతోంది. కొత్త రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న వారి ఇంటికి వెళ్లి ఆదాయం, ఆస్తులు వివరాలు తనిఖీ చేస్తున్నారు.




రెవెన్యూ, సివిల్ సప్లై అధికారుల సమన్వయంతో ఫీల్డ్ వెరిఫికేషన్ కొనసాగుతోంది. రెండు లక్షల లోపు ఆదాయం ఉండి, బిలో పావర్టీ లైన్‌కు దిగువన ఉన్న వారు రేషన్ కార్డు అర్హులు అంటున్నారు. సొంత ఇండ్లు, ఆస్తులు ఉండి కూడా రేషన్ కార్డు కోసం అప్లై చేసుకున్న వారి దరఖాస్తులను అధికారులు పరిశీలించడం లేదని అంటున్నారు. గ్రేటర్ వ్యాప్తంగా కొత్త రేషన్ కార్డు కోసం 83 వేల మంది దరఖాస్తు చేసుకున్నట్లు, ఈ నెల 20 వరకు ఫీల్డ్ వెరిఫికేషన్ పూర్తి చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ నెల 24వ తేదీ నాటికి అర్హుల ఎంపిక పక్రియను పూర్తిచేయాలని, 25వ తేదీకి ఆయా జిల్లా కలెక్టర్లకు నివేదికను అందజేయాలని జీహెచ్ఎంసీ నిర్ణయించింది. అర్హులుగా గుర్తించిన దరఖాస్తుదారుల వివరాలను ప్రభుత్వం వద్ద ఉన్న డేటాతో సరిచూసి, చివరగా ఈ నెల 26వ తేదీ నుంచి కొత్త రేషన్ కార్డులను జారీ చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. తెలంగాణ ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన సమగ్ర సర్వేలో, జీహెచ్ఎంసీ పరిధిలో 22 లక్షల కుటుంబాల వివరాలను సేకరించింది. ఈ సర్వే అనంతరం కొత్త రేషన్ కార్డుల కోసం వచ్చిన దరఖాస్తులను అధికారులు పరిశీలించారు. ఇందులో 83,285 మంది కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నట్లు గుర్తించారు.ఇంటింటి సర్వేలో కూడా అనేక మంది కొత్త రేషన్ కార్డుల కోసం తమ వివరాలను నమోదు చేసుకున్నారు. గతంలో కొత్త రేషన్ కార్డుల జారీ లేకపోవడం, కార్డుల్లో మార్పులు చేసుకునే అవకాశాలు లేకపోవడంతో వేలాది మంది ప్రజలు కొత్త కార్డుల కోసం ప్రభుత్వాన్ని ఆశ్రయించారు. జీహెచ్ఎంసీ అధికారులు ప్రాథమికంగా అర్హులుగా గుర్తించిన దరఖాస్తుదారుల వివరాలను పరిశీలిస్తున్నారు. నివేదిక తయారు చేసి, ఈ నెల 26వ తేదీ నాటికి కొత్త రేషన్ కార్డుల జారీ ప్రారంభమయ్యేలా కృషి చేస్తున్నారు. ఈ కొత్త పక్రియ ద్వారా రాష్ట్రంలోని అనేక మంది అర్హులైన పేద కుటుంబాలకు రేషన్ కార్డులు అందుబాటులోకి వస్తాయి. ఇది ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను మరింత సమర్థంగా అమలు చేయడంలో సహాయపడుతుంది.

# పౌరసేవల్లో డేటా రక్షణ ముఖ్యం

- సమాచార దుర్వినయోగంపైనా దృష్టి అవసరం

**అమరావతి,జనవరి20( వెలుతురు):**
ఎపిలో 150 రకాల పౌరసేవలను వాట్సాప్ ద్వారా అందించడం జరుగుతోంది. ఎలాంటి ఇబ్బంది లేకుండా పలు రకాల సేవలు అందుబాటులోకి వచ్చాయి. మంత్రి లోకేశ్ తీసుకున్న చొరవ కారణంగా, కుల, ఆదాయ ధృవీకరణ వంటి అనేక పత్రాలను నేరుగా పొందే అవకాశం ఏర్పడింది. అయితే డేటా రక్షణ చట్టం లేకుండా కేవలం వాట్సాప్ ద్వారా అందిస్తే పౌరుల ప్రాథమిక హక్కులకు భంగకరమన్న వాదనలు వస్తున్నాయి. ఆందోళన కూడా వ్యక్తం అవుతోంది.

రాష్ట్రంలో వాట్సాప్ ద్వారా ఈ గవర్నెన్స్ సేవలు అందించేందుకు కంపెనీలతో ఒప్పందం చేసుకున్నట్లు దాన్ని 18వ తేదీన ప్రారంభించబోతున్నట్లు సిఎం చంద్రబాబు ఇప్పటికే ప్రకటించారు. ఏదైనా ఒక సర్టిఫికెట్ కావాల్సి వస్తే దానికి సంబంధించిన డాక్యుమెంట్లు అప్‌లోడ్ చేయాలని, వాట్సాప్‌లో అవి భద్రంగా ఉంటాయన్న గ్యారంటీ లేదన్న వాదన వస్తోంది. వాటిని దుర్వినియోగం చేయరన్న చట్టబద్ధ హామీ లేదు. 2018 నుండి డేటా ప్రైవసీ చట్టం పెండింగ్‌లోనే ఉందని, అది చట్టం కాకుండా ఇలాంటి ఒప్పందాలు పౌరుల వ్యక్తిగత భద్రతకు ముప్పని అంటున్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు ఊడా ఇదేరకమైన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గతంలో ఆధార్ సహా అనేక రకాల డాక్యుమెంట్లు దుర్వినియోగమైన విషయం






విదితమేనని పేర్కొన్నారు. పౌర సేవలు వేగంగా అందుతాయో లేదో గ్యారంటీ లేదని, కానీ రాజకీయ, వ్యాపార ప్రయోజనాలకు డేటా దుర్వినియోగం అయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఇప్పటికే మీ సేవ, సచివాలయ వ్యవస్థలున్నాయని, వాట్సాప్‌తో ఒప్పందం చేసుకుని సచివాలయ సిబ్బందిని తగ్గించాలన్న యోచనలో ప్రభుత్వం ఉందని, దీనివల్ల మీ సేవ సిబ్బంది నిరుద్యోగులవుతారని అన్నారు. గోప్యంగా ఉండాల్సిన పౌరుల వ్యక్తిగత సమాచారాన్ని అంబానీ, మెటా వంటి కార్పొరేట్ కంపెనీలపరం చేయడం అభ్యంతరకరమని పేర్కొన్నారు. డేటా ప్రైవసీ రక్షణ చట్టం వచ్చేంత వరకు ఈ ఒప్పందాన్ని అమలు చేయొద్దని, సచివాలయ సిబ్బందిని కుదించొద్దని, మీసేవా కేంద్రాలకు భద్రత కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. నిజానికి సేవలు అందించడంతో పాటు, చట్టబద్ధత కూడా ముఖ్యమని గుర్తించి, డేటా రక్షణ చర్యలు తీసుకోవాల్సి ఉంది.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICCATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com